ప్రత్యేక సంచిక

శ్రీః

ఓం గం ఓం గణపతయే నమః

ఆత్మజ్యోతి

ప్రధాన సంపాదకులు : స్వామి అరుళానంద

మహాశివరాత్రి

శుభాకాంక్షలు

ది. 07-03-2016

ప్రకాశకులు
అరుళానంద పబ్లికేషన్స్
అరుళానందట్రస్ట్ - శ్రీ లలితానందాశ్రమము
వాడరేవు, చీరాల - 523157, ప్రకాశం జిల్లా, ☎ 08594 - 248237

ఆత్మజ్యోతి

సంపుటి - 13 సంచిక -5 1 మార్చి 2016

విషయసూచిక

		పుట సంఖ్య
శ్రీ మహాగణపతిస్తోత్రమ్		3
శ్రీదణ్డాయుధపాణి స్తోత్రమ్		4
శ్రీ భగవద్గీతాభాష్యార్కప్రకాశికానువాదము		5
నమోఽస్తు తే జనని!	– వ్యాఖ్యాత – డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు	8
స్వామివారి సందేశం	– స్వామి అరుళానంద	9
ఆశ్రమ వార్తలు		11
మూలికలు	– స్వామి అరుళానంద	12
Sri Aravinda Sarith Sagara	- *Dr. Prema Nandakumar*	14
పాణిమంత్రము		21
అశ్వధాటీకావ్యమ్ - కాళీస్తుతి	– వ్యాఖ్యాత – గరిమెళ్ళ సోమయాజులుశర్మ	22
గంగా – గౌరీ	– వ్యాఖ్యాత – మల్లాది హనుమంతరావు	29
ఆనందసాగరస్తవః	– వ్యాఖ్యాత – డా॥ ఈ.వి.యస్.మూర్తి	30
శ్రీ పరశమ్భుమహిమ్నఃస్తోత్రమ్	– వ్యాఖ్యాత – దోర్బల విశ్వనాథశర్మ	32
శ్రీకృష్ణచరితము	– డా॥ గాలి గుణశేఖర్	34
సంస్కృతభాషాపూర్ణిమ		36
లింగార్చన ఎందుకు శ్రేష్ఠమైనది?	– గబ్బిట దుర్గాప్రసాద్	38
బ్రహ్మసూత్రాలు	– వ్యాఖ్యాత – మేళ్ళచెర్వు వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి	42
తెలుఁగు సమస్యలు – చమత్కారాలు	– వ్యాఖ్యాత – డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు	45
శ్రీవిష్ణుపాదాదికేశాంత స్తోత్రమ్	– వ్యాఖ్యాత – డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు	48
అన్నమాచార్య సంకీర్తనామృతము	– డా॥ సముద్రాల లక్ష్మణయ్య	53
వరదరాజస్తవః	– వ్యాఖ్యాత – డా॥ కె.లక్ష్మీనారాయణ	55
ఇరేనా సెండ్లర్	–	59
జమిలి వేలుపు	– వ్యాఖ్యాత – డా॥ పాపినేని శివశంకర్	64
శ్రీమయూరకవివిరచితః సూర్యదణ్డకః – బాలానన్దినీవ్యాఖ్యా–ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రః		66
మహాభారతం – మానవస్వభావచిత్రణ	– డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య	79
ఆంధ్రనాయకశతకసౌందర్యము	– డా॥ కె. గిరిజాలక్ష్మి	81
శిశుపాలన	– డా॥ కోడూరు ప్రభాకరరెడ్డి	82
విదురనీతిసారము	– మొవ్వ వృషాద్రిపతి	85
బాలల భాగవతకథలు	– డా॥ కె. ప్రభాకర్ రెడ్డి	87
వేమన తాత్త్వికత – మనస్తత్వవిశ్లేషణ	– వ్యాఖ్యాత – డా॥ వై.భానుభవానీ	89
తిక్కన కీచకవధ	– డా॥ చింతలపూడి వేంకటేశ్వర్లు	92
యోగసూత్రాలు	– వ్యాఖ్యాత – చింతగుంట సుబ్బారావు	95
వేదాన్తముక్తావళ్యంతర్గతా 'ముండకోపనిషత్'	– శ్రీ బెల్లంకొండరామరాయవిరచితమ్	97
ఉమాకల్యాణము	– వ్యాఖ్యాత – రామోరా	98
నమక చమకాలు – తెలుగు టీక	–డా॥ తాడేపల్లి పతంజలి	100
వేంకట పార్వతీశ్వరకవులు (1881-1972; 1882-1955) – ఆచార్య గోగినేని యోగప్రభావతీదేవి		105
లోకంబులు లోకేశులు	–డా॥ తాడేపల్లి పతంజలి	110
Osho- The Great Ambition		112
భారతాంబికా!	– వ్యాఖ్యాత – డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు	113
Gold Nuggets - ఆణిముత్యాలు	- *Osho* / సౌభాగ్య	114
Book Review - Isavasya Upanishad for students	-Dr. Ch. Subbarao	115

RNI : New Delhi, APTEL 08725/01/12004-TC Rc.No.: C3 1789/2004

ఇందు ప్రచురించబడిన వ్యాసములందలి అభిప్రాయములు ఆయా రచయితలవే

D.T.P. by ***SANJAY GRAPHICS*, Chirala. 9966156263** Printed at : ***SOWMYA OFFSET*, Chirala, 9848088156**

ఓం గం ఓం గణపతయే నమః

శ్రీ మహాగణపతి స్తోత్రమ్

శ్రీ సృష్టిగణపతి ధ్యానమ్

శ్లో॥ పాశాంకుశస్వదన్తామ్రఫలవానాఖువాహనః ।
విఘ్నం నిహన్తు నః శోణః సృష్టిదక్షో వినాయకః ॥

....ఎఱ్ఱని శరీరకాన్తిగల, సృష్టిచేయుట యందు సమర్థుడైన వినాయకుడు మనయొక్క విఘ్నములను పోగొట్టుగాక! ✦

శ్రీ దణ్డాయుధపాణిస్తోత్రమ్

శ్లో॥ యథాబ్ధేస్తరంగా లయం యాన్తి తుంగా
స్తథైవాపదస్సన్నిధౌ సేవతాం మే ।
ఇతీవోర్మిపంక్తీర్నృణాం దర్శయన్తం
సదా భావయే హృత్సరోజే గుహం తమ్ ॥

.... కార్తికేయుని నిరంతరము నా హృదయపద్మమున తలంతును. ✦

శ్రీ భగవద్గీతా భాష్యార్క ప్రకాశికానువాదము

'శ్రీమద్భగవద్గీత'కు అపరశంకర బిరుదాంకితుడగు 'శ్రీబెల్లంకొండ రామరాయకవి' రచించిన 'భాష్యార్క ప్రకాశికా' భాష్యము పరమప్రామాణికమైనదిగా పెక్కుఱుచే పేర్కొనబడినది. దీనికి *1956*లో బ్రహ్మశ్రీ మల్లావఝ్ఝల వేంకటసుబ్బరామశాస్త్రిగారు ఆంధ్రానువాద మందించగా, దానిని బ్రహ్మశ్రీ కవితా సుబ్రహ్మణ్యం గారు అచ్చొత్తించి పలు గ్రంథాలయము లందు ఆంధ్రదేశమంతటా నిక్షిప్తము గావించి అఖండమైన మేలొనరించిరి. అలభ్యమగు అద్దానిని నేడు 'ఆత్మజ్యోతి పాఠకులకు' అందించుచున్నందుకు అమందానందమొందుచున్నాను.

ఇటీవలే పుస్తకరూపం సంతరించుకొన్నది. కావలసినవారు సంప్రదించగలరు. ఫోన్ : *9440115411.* వెల : రూ. *600/-;* పేజీలు : *956.*

(22)

ద్వితీయాధ్యాయము

శ్లో॥ దుఃఖేష్వనుద్విగ్నమనాస్సుఖేషు విగతస్పృహః ।
వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥ 56

అ॥ దుఃఖేషు అను మూలమునందలి పదమునకు దుఃఖహేతువు లగు తాపము లని యర్థము జెప్పుకొనవలయును. అయ్యవి యాధ్యాత్మికతాపము లనియు, నాధిదైవిక తాపము లనియు, నాధిభౌతికతాపము లనియు మూడు విధములు.

అందు జ్వరాదివ్యాధులవలన గలుగు తాపము లాధ్యాత్మికములు, వ్యాఘ్రసర్పాది క్రూరమృగములవలన గలుగు తాపము లాధిభౌతికములు. చలి, యెండ, గాలి మున్నగు వాటివలన గలుగు తాపము లాధిదైవికములు. **ఇట్టి తాపములవలన గలుగు దుఃఖము ప్రాప్తించినపుడు మనస్సంక్షోభము లేనివాడు స్థితప్రజ్ఞు** డని యర్థము.

ఓయి! మూలమునందలి **దుఃఖేషు** అను పదమునకు దుఃఖములను నర్థము జెప్పక, నాధ్యాత్మికాది తాపము లను నర్థమును జెప్పి, మరల యట్టి తాపమువలన దుఃఖము ప్రాప్తించినపుడు అను నన్వయము క్లిష్టయోజనగదా యని శంకింపవలదు.

మూలమునందలి దుఃఖ పదము "దుఃఖేషు" అని బహువచనాంతముగా నుండుటచే సాక్షాత్ దుఃఖార్థక మని గ్రహింప వీలులేదు. అందువలన దుఃఖహేతువు లగు తాపము లను

నర్థమును జెప్పుటయే యుక్తము. అట్లే సుఖములు సంప్రాప్తము లయినపుడు వాటియం దాస లేనివాడు స్థితప్రజ్ఞుడని యర్థము.

ఓయి! ప్రాప్యములయిన (పొందదగిన) సుఖములయందు బురుషున కిచ్ఛ యుదయించును గాని, ప్రాప్తములయిన (పొందబడిన) సుఖములయందే మానవునకు నాస బుట్టనేరదు గదా. కోరికకు (ఇచ్ఛకు) ఫలప్రాప్తి పర్యవసాన మనునది లోకసిద్ధము గదా? యని శంకింపవచ్చు. **సమాధానము :** అగ్నిహోత్రమునందు కట్టెలనునిచినపుడు గాని, యాజ్యమునునిచిపుడు గాని, యగ్ని జ్వాలలతో వృద్ధినొందు నట్లు ప్రాప్తించిన సుఖము ననుసరించి యేరికి సుఖములు వృద్ధిజెందవో వారు విగత స్పృహులని యర్థము.

పురుషున కన్నము సంప్రాప్తమగుచో నన్నమునందలి గోరిక యెట్లు నివర్తించునో, ధనము సంప్రాప్తమయినపుడు ధనేచ్ఛ యట్లు నివర్తింపదు. అట్లే సుఖము లభించినను, సుఖేచ్ఛ నివర్తింపదు. పైగా నింతకంటె 'యెక్కువ సుఖము నా కగు గాక' యని సుఖేచ్ఛ వృద్ధియే జెందును. అగ్నిహోత్రమునం దెన్ని కట్టెల నుంచినను యెంత నేయి బోసినను వీతిహోత్రునకు కాష్ఠాదులయం దాస తీరదు. మరియు నా యాశ వృద్ధియే జెందును. **"నాగ్నిస్తృప్యతి కాష్టానాం"** కట్టెలవలన నగ్ని దృప్తి జెందదని లోకన్యాయము గాక కట్టెలవలన నగ్నిహోత్రుడు దృప్తిజెందుచో నం దునిచిన గట్టెల నా యగ్నిహోత్రుడు దహింపజేయకనే యుండును. లోకమునం దట్లు గనుపించుట లేదు మరియు నత్యధికమగు జ్వాలలతో నా కట్టెలను గోరుచునే యుండును. కావున సుఖప్రాప్తివలన సుఖేచ్ఛ నివర్తింపక వృద్ధిజెందుట సహజము.

కాన (సుఖేషు ప్రాప్తేషు) సంప్రాప్తములయిన సుఖములయందు గోరిక లేనివాడు స్థితప్రజ్ఞుడని భాష్యకర్తలు చేసిన నిర్వచనము యుక్తమగును.

పూర్వశ్లోకమునుండి యదా, తదా, అను శబ్దముల రెంటిని నీ శ్లోకమునం దనువృత్తి జేసికొనవలయును. అపుడు ఆత్మజ్ఞానమును మననము జేసికొనువా డెపు డిట్టివాడగునో నపుడు స్థితప్రజ్ఞు డనబడుచున్నాడని యన్వయము.

యద్వా 'పురుషః' అను పదమును అధ్యాహారము జేసికొనవలయును. అందువలన ఎపుడు పురుషు డిట్టి మునియగునో నపుడు స్థితప్రజ్ఞు డనబడుచున్నా డని యన్వయము లభించును.

ఇచట మునిశబ్దము సంన్యాసి యను నర్థమును బోధించునా? బోధింపదా? యని శంకింపవలదు. ముని యనగా నెల్లపుడు మననముజేసికొను స్వభావము గలవాడని యర్థము. ఇట్టి మననశీలత (మననము జేసికొను స్వభావము) సర్వకర్మసంన్యాసులకే పనియు లేనందున సంభవించును గాని గృహస్థునకు సంభవింపనేరదు, కావున ముని శబ్దము సంన్యాస్యర్థకమనియే గ్రహింపవలయును.

ఇట్లయినచో సంన్యాసమును స్వీకరింపని వసిష్ఠాదులు మునులెట్లయిరి? అని ప్రశ్నింపరాదు. వసిష్ఠాదులు గృహిణులతో గూడిన వారయినను, సర్వకర్మలను ద్యజించి, వనమునజేరి, యెల్లపు డాత్మమననమును జేయుచునే యున్నారు, గావున నట్టివారు సర్వకర్మలను సంన్యసించిన మునులే యగుదురు. 56

శ్లో॥ యస్సర్వత్రానభిస్నేహస్తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినన్దతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 57

అ॥ ఏ మానవుడు దేహమునందును, జీవితమునందును స్నేహమును వదలి శుభము (మంచి ఫలము) సంప్రాప్తమయినపు డానందింపక, అశుభము (చెడు ఫలము) సంప్రాప్తమయినపుడు ద్వేషింపక స్థిరమనస్కుడుగానుండునో వాడు **స్థితప్రజ్ఞు** డనబడును.

శ్లో॥ యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః ।
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్యస్తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 58

అ॥ తాబేలు, తన అవయవములను తన శరీరములోనికి భయపడి లాగికొనునట్లు ముముక్షువు తన యింద్రియములను విషయములనుంచి సర్వవిధముల, నెపుడు మరల్చుకొనునో అపుడు **స్థితప్రజ్ఞు** డనబడుచున్నాడు. 58 ✦ ... (సశేషం)

విజ్ఞానవీచిక

సేకరణ – నివేదిత, ఒంగోలు

నమోఽస్తు తే జనని!

– డా॥ వుయూరు లక్ష్మీనరసింహారావు, గుంటూరు.

పల్లవి : నమోఽస్తు తే జనని!
నవ్యాంధ్ర జనని!
అమరావతీరమణీయమహానగరమణిహారధారిణి!
సముద్రరాజపరిపూజితచరణాంబుజచారిణి! ॥నమోఽస్తు తే॥

చరణము : ప్రాచీనరాజేంద్రపరిపాలిత మహాపుణ్యధారుణి!
నవీనప్రజానాయకగణమనోమోదకారిణి!
వివిధనదీజలతరంగసంగీతనాదిని!
సస్యవృక్షగిరివనాళిచిత్రవర్ణమేదిని! ॥నమోఽస్తు తే॥

చరణము : యువలోకమేధాబలవికాసఫలమార్గదాయిని!
నవవిద్యానిరవద్యఫలితావళిసంధాయిని!
సకలప్రజాజీవనపథశుభదాయకవేషిణి!
సర్వవర్ణసుస్వరపీయూషమధురభాషిణి! ॥నమోఽస్తు తే॥

చరణము : సువిశాలవరుణాలయసుందరతీరావనిశాలిని!
స్వదేశీయవిదేశీయవినోదకళామాలిని!
వినతమనోనవమందిరనిరంతరవాసిని!
భారతమాతృవదనకాంతిపరివర్ధితహాసిని! ॥నమోఽస్తు తే॥ ✦

స్వామివారి సందేశము

వచ్చిన బ్రాహ్మణులు ఇరువురు స్వామివారికి నమస్కరించి అక్కడే కూర్చున్నారు. చెఱుకు ముక్కల్లో ఒక ముక్క పై బెరడు తీసివేసి ఇరువురు (దిగంబర స్వామివారు, స్వామివారు) సమానముగా తీసుకున్నారు. దిగంబర స్వామివారు స్వామివారిని చూసి 'చెఱుకు బాగా తియ్యగా ఉందా?' అని అడిగినారు. "అవును స్వామి, ఎక్కువ మధురముగా ఉన్నది." అని స్వామివారు సమాధానము చెప్పారు. ఈ బ్రాహ్మణుల బాధ తీరుటకు వారి గ్రామము సుభిక్షముగా ఉండుటకు నీవు ఏదైనా చెయ్యాలి. నీ మనస్సులో ఏమి అనిపిస్తున్నది? అని దిగంబర స్వామి స్వామివారితో అన్నారు. స్వామివారు మౌనంగా ఉన్నారు. బ్రాహ్మణులు ఇరువురు లేచి నమస్కరిస్తూ నుంచొని ఉన్నారు. నీ గురునాథులు నీకొక చిన్న పొట్లం ఇచ్చి పంపారు. ఆ పొట్లం లోని పస్పం కొంత వీరికి ఇచ్చి పంపించు అని దిగంబరస్వామివారు స్వామివారితో అన్నారు. మరల స్వామివారు మౌనముగా ఉన్నారే తప్ప ఎటువంటి సమాధానం చెప్పలేదు. తన గురునాథులు తన ముందు ఒక మాయ సృష్టించి ఈ రూపములో వచ్చారా అనే సందేహము కలిగినది. నేను ఏదైనా తప్పు చేశానా! అని ఆలోచిస్తూ మౌనంగా కళ్ళు మూసుకుని కూర్చున్నారు. దిగంబర స్వామి బ్రాహ్మణులు ఇరువురిని గుహవద్దకు వెళ్ళి అక్కడ గల తొట్టిలో స్నానం చేసి రమ్మని పంపారు. స్వామివారికి మనస్సులో ఆంజనేయస్వామి రూపమే మెదిలినది. స్వామివారికి ఆంజనేయస్వామి విశ్వరూప దర్శనం అయినది. ఆ విశ్వరూప దర్శనములోనే ఐక్యం అయి స్తంభించి మౌనముగా ఉన్న స్వామివారి భుజం పైన ఏదో ఒక స్పర్శ తగిలింది. కళ్ళు తెరిచి చూస్తే అది దిగంబర స్వామివారు. "ఇది శ్రీశైలములో ఒక జ్ఞానపీఠము. దత్తాత్రేయుడు అవతరించినది ఇక్కడే. ఆంజనేయస్వామి ఇక్కడ చిరంజీవి. స్వామివారు ఇక్కడకు బ్రాహ్మణులను పంపుటకు కారణమే నీలో గల అపరిమితమయిన శక్తిని ప్రపంచమునకు తెలియపరుచుటకే. నీవు ఏమి చేయదలచినావో అది చేసి పంపించమని" దిగంబర స్వామివారు స్వామివారితో అన్నారు. ఇంతలో బ్రాహ్మణులు స్నానం చేసి అక్కడకు చేరుకున్నారు. స్వామివారు మనస్సులో గురునాథులను ధ్యానించి పొట్లం తీసి అందులోని పస్పం కొంత, కొన్ని మారేడు దళములు వారి చేతికి ఇచ్చి "ఇవి తీసుకువెళ్ళి మీ గ్రామములో ఈశాన్యములో గల కులదేవత దేవాలయములో కోనేరులోని నీళ్ళు తీసుకుని ఆ జలములో ఈ పస్పం, బిల్వదళం వేయాలి. ఇందుకు కొత్త మట్టిపాత్రను ఉపయోగించాలి. ఈ పాత్రలో కోనేరు జలం, పస్పం, మారేడు దళములు వేసి కులదేవత ముందు పెట్టి పూజ చేసి గ్రామ పొలిమేర వద్ద నాలుగు అడుగుల లోతు గుంట త్రవ్వి

ఆ జలం కొంత ఆ గుంటలో పోసి కొన్ని మారేడు దళములు కూడా వేయాలి. మిగిలిన జలము గ్రామము నలుదిక్కుల చల్లాలి. అమావాస్య తర్వాత వచ్చే సప్తమి రోజు గ్రామములోని ప్రజలు అందరు ఈ త్రవ్విన గుంటవద్దకు వచ్చి సుదర్శన హోమం చేసి, ఆంజనేయస్వామి పూజ చేసి తర్వాత నల్లరాయితో చేసిన తొమ్మిది అడుగుల ఎత్తుగల ఆంజనేయస్వామి విగ్రహం అక్కడ ప్రతిష్ఠించాలి. పూజ జరిగిన 90 రోజుల లోపు విగ్రహప్రతిష్ఠ జరగాలి. దీనికి కావలసిన నిధి సమకూరును. ఈ కార్యక్రమము ప్రారంభం అయిన తర్వాత మీ గ్రామములో సంభవిస్తున్న దురదృష్టకర సంఘటనలు క్రమముగా తగ్గి శుభం జరుగును. గ్రామం సుభిక్షం అగును. ఆంజనేయస్వామి ప్రతిష్ఠ సమయములో ఇక్కడికి వచ్చి కదళీవనములోని జలము రాగిపాత్రలో తీసుకువెళ్ళి ఆగమశాస్త్ర ప్రకారం పూజాకార్యక్రమము పూర్తిచేసి ఆంజనేయస్వామికి ఆ జలంతో అభిషేకం చేయాలి. ఈవిధంగా నా మనస్సులో గట్టి సంకల్పము కలిగినది" అని చెప్పి పస్పం, మారేడు దళములు బ్రాహ్మణుల చేతికి ఇచ్చారు. దిగంబర స్వామివారు తన కుడిచేతి వేళ్ళను జపమాల తిప్పుతున్నట్లుగా కదిలించి చేతికి వచ్చిన రాగినాణెమును వారి చేతికి ఇచ్చి ప్రతిష్ఠ సమయములో యంత్రముతోపాటు ఈ నాణెమును కూడ పెట్టమని ఇచ్చారు. బ్రాహ్మణులు ఇరువురు వీరికి నమస్కరించి గుహవద్దకు వెళ్ళి పూజ చేసుకుని తమ స్వంత గ్రామమునకు బయలుదేరినారు. మిగిలిన వివరముల వచ్చే సంచికలో....

Our scriptures say that chanting the Divine Name leads to Shreyas. But some people ask the question, "Which name should I chant". Whether you take the Shiva, Hari, Ganesha or Subrahmanya, the essence is the same and so are the resulting effects.- Sri Sri Bharati Tirtha Mahaswamigal

ఆశ్రమ వార్తలు

ఆహ్వానము

స్వస్తిశ్రీ చాంద్రమాన మన్మథనామ సంవత్సర మాఘ బ॥ చతుర్దశి ది. 7-3-2016 సోమవారం **మహాశివరాత్రి** సందర్భముగా ఆశ్రమంలో వేంచేసియున్న చంద్రమౌళీశ్వర స్వామివారికి అభిషేకములు జరుపబడును. కనుక భక్తులెల్లరు విచ్చేసి అభిషేక కార్యక్రమములో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించవలసినదిగా కోరుచున్నాము.

కార్యక్రమములు : ది. 6-3-2016 ఆదివారం ఉదయం గం. 8-00 లకు రుద్రహోమ ప్రారంభము. ది. 7-3-2016 సోమవారం ఉదయం గం. 8-00 లకు రుద్రహోమం. సా॥ గం. 5-00 లకు రుద్రహోమ పూర్ణాహుతి. రాత్రి గం. 9-00ల నుండి శ్రీ చంద్రమౌళీశ్వర స్వామివారికి నాలుగు జాముల అభిషేకము. తెల్లవారుజాము గం. 5-00 లకు అన్నాభిషేకము, తదుపరి తీర్థప్రసాద వినియోగము. ✦

ఆహ్వానము

స్వస్తిశ్రీ చాంద్రమాన మన్మథనామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ ది. 23-3-2016 బుధవారం శ్రీ వల్లీ దేవసేనా సమేత **శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కళ్యాణ మహోత్సవము** జరుపబడును. కనుక భక్తులెల్లరు పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించవలసినదిగా కోరుచున్నాము.

కార్యక్రమములు : ది. 22-3-2016 మంగళవారం ఉదయం గం. 8-00 లకు షణ్ముఖ హోమ ప్రారంభము, సాయంత్రం షణ్ముఖ హోమము. ది. 23-3-2016 బుధవారం ఉదయం గం. 8-00 లకు షణ్ముఖ హోమము, ఉదయం గం. 11-00 లకు శ్రీ సుబ్రహ్మణ్య కళ్యాణము, సాయంత్రం గం. 5-00 లకు హోమ పూర్ణాహుతి. ✦

మూలికలు

– స్వామి అరుళానంద

క్రితం సంచికలో ద్రాక్షను గురించి తెలుసుకుంటున్నాము. ఇది మన అందరికీ అందుబాటులో ఉన్నది. అధిక ఖర్చు, శ్రమ లేకుండా లభ్యం అవుతుంది. కాబట్టి దీనిని మనం బాగా ఉపయోగించుకోవచ్చు. అల్సరు (కడుపులో పుండు), పొట్ట నొప్పి, అల్సర్ వల్ల వచ్చే గ్యాస్ ట్రబుల్ – వీటన్నింటికి ద్రాక్షరసం రోజుకి మూడు సార్లు కనీసము రెండు ఔన్సు చొప్పున వాడుతూ వస్తే ఈ ఇబ్బందులు తగ్గటమే కాకుండా ఉదరం బలపడుతుంది. కీళ్ళ వాతం, బి.పి. ఉన్నవారు ఈ రసం రోజుకి ఒకసారి వాడినా కూడా మంచిదే. ఈ రసం లివర్‌కు, జీర్ణ వ్యవస్థకు సంబంధిత అవయవాలకు బలాన్ని ఇచ్చే గుణం కలిగి ఉన్నది. మరియు అవి పాడవకుండా కాపాడే గుణం కూడా కలదు. లివర్ సంబంధిత వ్యాధులు, టి.బి., జాండిస్, పైత్యం వల్ల వచ్చే వ్యాధులు ఉన్నవారికి నిత్యం నల్లద్రాక్ష పండ్లు 100 గ్రాములు చొప్పున తీసుకుంటే ఈ వ్యాధులకు అది నివారణగాను, ఈ వ్యాధుల నుండి బయట పడుటకు అది ఒక supportive medicine గాను ఉపయోగపడును. ద్రాక్ష తీసుకుంటే రక్తం శుద్ధి అవుతుంది. చర్మవ్యాధులు గలవారు వాడితే చర్మం రంగు మారకుండా కాపాడును. కఫం, కఫం వల్ల వచ్చే పొడిదగ్గు – వీటికి ఎండు ద్రాక్ష (కిస్‌మిస్) 20 గ్రాములు, నెయ్యిలో వేయించి తీసుకుంటే మంచిది. ఎండుద్రాక్షను రోజ్‌వాటర్‌లో నానబెట్టి ఆ రసం వాడితే గుండెదడ, గుండె బలహీనం మొదలగునవి తగ్గును. మేడిపండ్లు 2, ఎండుద్రాక్ష 10 గ్రాములు రెండు కలిపి ఆవుపాలల్లో ఉడికించి రోజు ఉదయం పూట తీసుకుంటే మెదడు అభివృద్ధికి తోడ్పడుతుంది. మెదడుకు బలాన్ని ఇస్తుంది. ప్రతిరోజు తాజా మేడిపండ్లు దొరకటం కష్టం. కాబట్టి పండ్లు వచ్చే సమయములో వాటిని సేకరించి ముక్కలు చేసి నీడలో ఆరబెట్టి నిల్వ చేసుకోవచ్చు. లేదంటే కొట్లో అమ్మే ఎండిన మేడిపండ్లను రెండు లేదా మూడు ముక్కలు, ఎండుద్రాక్ష రెండూ పాలల్లో కొంచెం సేపు నానబెట్టి ఉడికించి తీసుకోవాలి. చిన్న వయస్సు నుండి ఇది వాడుతూ వస్తే సరస్వతి ఆకు వాడితే వచ్చే ఫలితం కన్నా ఇంకా అధిక ఫలితం ఇస్తుంది. ఇది మన అందరికీ అందుబాటులో ఉన్నది. సామాన్యులు కూడా చేసి వాడుకోవచ్చు. 40 సంవత్సరములు పైగా వయస్సు గల స్త్రీలకు వచ్చే బహిష్టు సమస్యలు, దానివల్ల వచ్చే ఇతర ఇబ్బందులు ద్రాక్షరసం రోజు మూడు ఔన్సుల చొప్పున వాడితే తగ్గును. మనలో వాత, పిత్త, శ్లేష్మ అనే మూడు శరీర తత్త్వాలు గలవు. పిత్త, శ్లేష్మ తత్త్వం గలవారు ఈ పండ్లు రోజూ తింటూ ఉంటే చేతులు, కాళ్ళు దురదలు, తల తిరగటం తగ్గును. మనం అందరం ప్రతి నిత్యం ద్రాక్ష తినటం అలవాటు చేసుకుంటే వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చు. మరియు వ్యాధుల నుండి కూడా బయటపడే అవకాశం కూడా ఉంది. వచ్చే సంచికలో మరో మూలిక గురించి తెలుసుకుందాం...

శివస్తుతి

హార కిరీట భాక్కమలహారికి వారణ దైత్యవీర ని
ర్హారికి రౌప్య భూధర విహారికి దేహ విభాజితాతి నీ
హారికి గాలకూట పరిహారికి సంతత సంశ్రితామృతా
హారికి జిహ్మగప్రకర హారికి మ్రొక్కెద గార్య సిద్ధికిన్

– వాణీవిలాసమాలిక – టేకుమళ్ల రంగశాయికవి (15వ శతాబ్ది)



SRI ARAVINDA SARIT SAGARA

- Dr. Prema Nandakumar, Srirangam.

16. Shorter Poems

By 1972 one had read most of the poems of Sri Aurobindo. Many of them short, some of them long, they were intellectually stimulating and philosophically satisfying. Most of them had come as small collections like **Ahana and Other Poems** (1915) and **Poems of Sri Aurobindo** (1934). 1942 brought us the two volume set, **Collected Poems and Plays.** The longer poem, **Love and Death** was published in 1921. However, when one opened the fifth volume of the Sri Aurobindo Birth Centenary Library, it did have a terrific impact. So many themes, varieties of prosody, and enchanting narrative poetry in a single volume: it was sheer delight. One was also conscious that the epic **Savitri** was not here, it would come as a separate volume. Meanwhile one could sit back and study Sri Aurobindo the poet for he had always said that primarily he was poet.

He came to the art quite early in his life. Of the thirty poems listed as written between 1890 and 1900, 'Songs to Myrtilla' leads. It is the work of a boy in late teens, an admirer of Greek poetry and the Greek love of material perfection. Two friends, Glaucus and Aethon take turns to praise the many-splendoured beauties of nature. Both Greek names, quite familiar to readers of Ovid and Homer. Though Myrtilla is the name of a baby boy, it is obviously the myrtle bush that is referred to in the poem. Early youth is the time when everything looks beautiful and promising and so a shower of flowers associated with love carpets springtime:

"I found as in a jewelled box
Love, rose-red, sleeping with imprisoned locks;
And I have ever known him wild
And merry as a child,
As roses red, as roses sweet,
The west wind in his feet,
Tulip-girdled, kind and bold,
With heartsease in his curls of gold …"

There are poems on Greeks gods and goddesses like Phaethon and

Ephrosyne, but already the closing century is gently leading Sri Aurobindo to thoughts of life around him. Poetry becomes his natural recorder as his attention turns to politics read in the news paper. He would be eulogizing our land as Mother India soon; already in 'Hic Jacet' he refers to "mother Erin" (Ireland) and a distinguished son who raised her back to glory, but was himself allowed to die in ignominy. Sri Aurobindo seems to have idolized Charles Parnell of Ireland with two more poems, heavy with Greek references. 'Lines on Ireland' mourns Parnell's death but already the sights are set on Ireland's future! This is a student speaking but as a child of an ancient civilization that likes to conclude not with mourning but a sense of victory; an Indian who assures the dead hero he would be an inspiration not only to the Irish for seeking freedom from England but even others who want to break away free from England:

"Nor to thy country only nor thy day
Art thou a name and a possession, stay
Of loftiest natures, but where'er and when
In time's full ripeness and the date of men
Alien oppression maddened has the wise,–
For ever thus preparing Nemesis
In ruling nations unjust power has borne
Insolence, injustice, madness, outrage, scorn,
Its natural children, then, by high disdain
And brave example pushed to meet their pain,
The pupils of thy greatness shall appear,
Souls regal to the mould divine most near,
And reign, or rise on throne-intending wings,
Making thee father to a line of kings."

Among the short poems Sri Aurobindo wrote after his return to India and before he went to Pondicherry are some very famous ones. There is the call of the champion (like the Greek heroes, like Parnell of his own time) to dare the enslaving powers, whatever the consequence may be. This is the very spirit of freedom giving a call:

With wind and the weather beating round me
    Up to the hill and the moorland I go.
Who will come with me? Who will climb with me?
    Wade through the brook and tramp through the snow? ...

I sport with solitude here in my regions,
    Of misadventure have made me a friend.
Who would live largely? Who would live freely?
    Here to the wind-swept uplands ascend."

Among these poems there is a wide variety in subject matter. Sometimes it is Vedanta; occasionally Death and there is one that juxtaposes Life and Death:

"Life, death,– death, life; the words have led for ages
Our thought and consciousness and firmly seemed
Two opposites; but now long-hidden pages
Are opened, liberating truths undreamed.
Life only is, or death is life disguised,–
Life a short death until by life we are surprised."

Myth and legend give a hand too, when Sri Aurobindo is inspired to make a statement. Trishancou, Hell, Heaven, the rakshasas, Mahatma Kuthumi, Sage Mandavya. 'The Meditations of Mandavya' is an instance of how each of these short poems actually needs a commentary on its own. The poem is based on a branch tale in the Mahabharata. There was a great Rishi Mandavya who was engaged in tapasya in front of his cottage, having taken a vow of silence. Some thieves came there, pursued by the King's men. The thieves left their booty inside the cottage and ran away. The royal bodyguard questioned the sage who would not answer. They took him and the stolen goods found in his cottage to the king who had him impaled for robbing the royal treasury. When the guards found him alive even after the passage of a long time, they reported it to the king, who realised his mistake. He came to the place where the rishi was and expressed his regrets for he had acted in ignorance. Mandavya felt pacified. The king had the sage brought down from the stake. The guards were unable to pull out the stake from the sage's body. So they cut off the part that was projecting out, and rest of the lance remained imbedded in the sage's body. Rishi Mandavya moved around with the part still in his body, continued with his tapasya and after the end of his earthly sojourn, reached many high heavens, an impossibility for others. As the top portion of a stake is called Ani, the sage came to be known as Ani Mandavya.

Once he wandered into the world of Yama and found Yama sitting on a throne. Mandavya wanted to know the crime he had perpetrated which gave him this terrible punishment. Yama replied: "O tapasvin! You pierced a moth with a blade of grass. The way karma works is that it becomes manifold when it reaches the time of returns. Just as a little charity begets a lot of punya, a little cruelty begets terrible woe." Since the rishi was only a little boy when he committed the wrong, Yama had gone against the Dharmashastras in inflicting such a grave punishment. He was cursed by Mandavya to be born as a mortal, Vidura.

With Sri Aurobindo, the retelling of the story was no doubt prompted by his reading of the **Mahabharata** where one of the major issues discussed is crime and punishment. And, the image of a solitary person alive atop the killer lance, while others who had been given the same punishment were around him as corpses hanging in various states of decomposition gave Sri Aurobindo a fine chance for vedantic contemplation. Written in 1913 when Sri Aurobindo had put behind him politics and was absorbing himself into yoga, **Meditations of Mandavya** is actually a series of reflections. The poem is about the sage's

thoughts as this realised soul still remains on the stake.

The early reflections are a description of the Brahmic state Mandavya has already gained. A simple telling, as four waves of ecstasy and self-exploration, a brahmananda that finds even the pain of the piercing lance to be a pleasure inexpressible:

"O joy of gaining all the soul's desire!
O stranger joy of the defeat and loss!
O heart that yearnest to uplift the world!
O fiercer heart that bendest o'er its pain
And drinkst the savour! I will love thee, O Love,
Naked or veiled or dreadfully disguised;
Not only when thou flatterest my heart
But when thou tearst it! Thy sweet pity I love
And mother's care for creatures, for the joys
I love thee that the lives of things possess,
And love thee for the torment of our pains;
Nor cry, as some, against thy will, nor say,
Thou art not. Easy is the love that lasts
Only with favours in the shopman heart!
Who, tortured, takes and gives the kiss, he loves."

It is a typical Paramatma-Jivatma plank where the Paramatma is seen as a guardian, to whom one has surrendered completely. Whether it is pain or pleasure, what does it matter? They are all different ways of experiencing the Divine. Anything could connect you with the Divine! It could be just a bird, "blue-winged like turquoise, crimson-throated, beaked, / Enormous, fluttering over the garden wall".

Having performed tapasya for long, and now having been able to withstand successfully the agony of impalement, Mandavya realizes that soul-force can achieve anything. Has he not risen above the pressures of the physical body? So we can control nature! All we have to do is to free the soul within us from remaining chained to nature by the seemingly uncontrollable passions, live untempted by the lures of the world. But then, there is also a love divine which we should gain. Where is the He who is Divine Love? Philosophical questioning and argument come to an end with personal experience. Sage Mandavya's dialogue with the Self deep within him has come to an end too. Where the piercing lance has itself become a strengthening part of his body, contraries vanish into the "rayless Light". The sounds of the world begin to reach Mandavya again, not as a cacophony but as the varied notes of the Eternal. Mandavya is no more a *yantrarudha,* but an electrically free being who has surrendered himself to the Light.[1] There is no crime, nor any punishment but all is Love.

There are poems that have a charming quietude about them like 'Night

by the Sea'; some like 'The Mother of Dreams' make us wonder about man's "other life" of shadows that seem so real; 'A Tree' which wrests a profound meaning from a casual glance around is a brief capsule of high philosophy;

A tree beside the sandy river-beach
Holds up its topmost boughs
Like fingers towards the skies they cannot reach,
Earth-bound, heaven-amorous.

This is the soul of man. Body and brain
Hungry for earth our heavenly flight detain."

Two poems written during the Second World War when Hitler was at the apex of his power bring out the anguish at the wanton destruction, genocide and destruction of democracy and humanism that was going on at that time. 'The Dwarf Napoleon: Hitler, October 1939' marks the devilish march of that twentieth century Satan:

"A little limited visionary brain
Cunning and skilful in its narrow vein,
A sentimental egoist poor and rough,
Whose heart was never sweet and fresh and young,
A headlong spirit driven by hopes and fears,
Intense neurotic with his shouts and tears,
Violent and cruel, devil, child and brute,
This screaming orator with his strident tongue,
The prophet of a scanty fixed idea,
Plays now the leader of our human march;
His might shall build the future's triumph arch.
Now is the world for his eating a ripe fruit.
His shadow falls from London to Korea.
Cities and nations crumble in his course.
A terror holds the peoples in its grip:
World-destiny waits upon that foaming lip."

The power of the rabble-rouser, again, is evoked with perfect precision by Sri Aurobindo in 'The Children of Wotan'. In fact, Sri Aurobindo's poetic pen could deal with any situation using an appropriate diction. He could even be deliciously humorous and write on a cat in "Despair on the Staircase":

"Mute stands she, lonely on the topmost stair,
An image of magnificent despair;
The grandeur of a sorrowful surmise
Wakes in the largeness of her glorious eyes.
In her beauty's dumb significant pose I find
The tragedy of her mysterious mind.
Yet is she stately, grandiose, full of grace.
A musing mask is her immobile face.

Her tail is up like an unconquered flag,
Its dignity knows not the right to wag.
An animal creature wonderfully human,
A charm and miracle of fur-footed Brahman,
Whether she is spirit, woman or a cat,
Is now the problem I am wondering at."

One could go on as it is hard to choose from his short poems where each sends out a brilliance of its own. To conclude with an important poem on the Avatara theory, so dear to the Indian mind, we have "A God's Labour". The poem is about the resistance of the human clay for getting moulded to a better form with speed. Of Sri Aurbindo the "poet of yoga", K.R. Srinivasa Iyengar writes:

"It is not simply the transformation of the psyche or of the mind – that is, perhaps, not so very difficult to achieve – but of the vital, of the physical, of the subconscient, of the inconscient. It is in 'A God's Labour' that Sri Aurobindo has described in its entirety his integral Yoga of man's and earth's transformation."[2]

Composed on 31-7-1935, the poem opens to underline the vast spaces that lie between a vision and the actual moment when the vision becomes a reality. Of course the Divine has no illusions about the human clay which is capable of infinite resistance. It is the aspirant human being that has such illusions regarding the quick transformation of life on earth into a life divine. But, the avatar is a direct portion of God, the human form is just a necessary cloak. Being divine in his essential personality helps the Avatar to proceed with the work of transformation. But why should there be all this tragedy, evil, pain and sorrow? Ah, if we gain bliss at the drop of a hat, would we value it? Would we value Krishna if there had been no Mahabharata War? Would we then take up the sorrow and struggle in time so that we can reach out to the Life Divine for all humanity? Hence the Imperishable descends among this perishable humanity, experiences the human emotions of sadness and betrayal in time, and then leads us by pointing out the glorious possibilities of the Next Future.

Sri Aurobindo says that the **Gita** itself does not spend much time on the process of avatarhood. There is no need for that is not the object. The object of the work is the manner in which the Avatar leads "the man who has risen to the greatest heights of mere manhood, to the divine birth and divine works." We may even take it that the 'God's Labour' is the Sutra (aphorism) for which the **Essays on the Gita** is the Bhashya (commentary). The poem deals with two main characters: The Omniscient narrator (God) and the silent man. Man is not without immortal longings but he is entrenched in prakriti, the love for his body, "*dehatmabhimana*". The attempt to link the human and the divine does fail repeatedly, but one cannot give up!

"He who would bring the heavens here
Must descend himself into clay

And the burden of earthly nature bear
And tread the dolorous way.

Coercing my godhead I have come down
Here on the sordid earth,
Ignorant, labouring, human grown
Twixt the gates of death and birth."

But this is done willingly, out of love for his creation, for helping the upward evolution of man.

When the poem was written, Sri Aurobindo had spent a quarter century in deep yoga. By then a fair number of disciples had drawn towards him and the Mother was in charge of the growing Ashram. Sri Aurobindo says in his **Kara Kahini** that it was when he was in the Alipur Jail and had to live amongst people condemned as thieves and criminals that he realised the presence of nobility and goodness at the very centre of darkness. God dwells in all! After the long's day's journey into night in this poem we step into a radiant world in the last stanzas:

"Like flames to the kingdoms of Truth and Bliss:
Down a gold-red stair-way wend
The radiant children of Paradise
Clarioning darkness's end.

A little more and the new life's doors
Shall be carved in silver light
With its aureate roof and mosaic floors
In a great world bare and bright."

Faith and Hope. That is the pathway to the Life Divine. ✦

పాణిమంత్రము - మహానారాయణోపనిషత్

ఓం నిధనపతయే నమః
ఓం ఊర్ధ్వాయ నమః
ఓం హిరణ్యాయ నమః
ఓం సువర్ణాయ నమః
ఓం దివ్యాయ నమః
ఓం భవాయ నమః
ఓం శర్వాయ నమః
ఓం శివాయ నమః
ఓం జ్వలాయ నమః
ఓం ఆత్మాయ నమః
ఓం పరమాయ నమః

ఓం నిధనపతాంతికాయ నమః
ఓం ఊర్ధ్వలింగాయ నమః
ఓం హిరణ్యలింగాయ నమః
ఓం సువర్ణలింగాయ నమః
ఓం దివ్యలింగాయ నమః
ఓం భవలింగాయ నమః
ఓం శర్వలింగాయ నమః
ఓం శివలింగాయ నమః
ఓం జ్వలలింగాయ నమః
ఓం ఆత్మలింగాయ నమః
ఓం పరమలింగాయ నమః

ఏతత్సోమస్య సూర్యస్య సర్వలింగగ్ గ్ స్థాపయతి పాణిమంత్రం పవిత్రమ్ ॥

శ్రీ పండితేంద్ర జగన్నాథ విరచితమ్

అశ్వధాటీకావ్యమ్

వ్యాఖ్యాత - గరిమెళ్ళ సోమయాజులుశర్మ,
విజయవాడ.

కాళీస్తుతి

అవతారిక : ఇప్పుడు గ్రంథమును ముగింపఁ బోవుచు శ్రీకాళీమాతను స్తుతించుచున్నాఁడు-

శ్లో॥ వాలీయుత శ్రవణ-పాలీయుగా లలిత-చూలీవిరాజిబకులా
కేలీగతానుగమ-రాలీకులా మధుర-మాలీభి రాదృతకథా ।
నాలీకదృక్ కుసుమ-నాలీకపాణి రిహ-కాలీయశాసిసహజా
తాలీదలాభతను-మాలీ సదా భవతు-కాళీ శుభాయ మమ సా ॥ ౨౪

వ్యాఖ్య : వాలీ = కేశగుచ్ఛముతో - కొప్పుతో; యుత = కూడిన; శ్రవణపాలీయుగా = పెద్ద వగు రెండు చెవులు గలది. జాఱుకొప్పు చెవులపైఁ బడుచున్న దని భావము. లేక 'వబయో రభేదః' - అను వచనముచే; బాలీ = దుద్దులతో; బాళీలు - చెవిదుద్దు లని లోక వ్యవహారము, యుత = కూడిన; శ్రవణపాలీయుగా = కర్ణద్వయము గలది; లలిత = మృదువైన (లేక) అందమైన; చూలీ = చెవి మూల భాగము నందు; విరాజి = ప్రకాశించుచున్న; బకులా - వకులా = పొగడపువ్వు గలది. పొగడపువ్వును జెవిలో ధరించిన దని భావము. కేలీగత = క్రీడగా నడచు నప్పుడు; అనుగ = అనుగమించుచున్న - వెనుక వచ్చుచున్న; మరాలీకులా = ఆఁడుహంసల సమూహము గలది. పార్వతీదేవి నడకలు హంసనడకల వలె నుండుటచే నాఁడుహంస లామెను వెంబడించుచున్న వని భావము. మధురమ్ = తియ్యఁగా; ఆలీభిః = చెలికత్తెలచే; ఆదృత = ఆదరింపఁబడిన; కథా = కథలు గలది. ఆదరముతో వినుచున్న చెలికత్తెలకుఁదియ్యని కథలు చెప్పుచున్న దని భావము. నాలీకదృక్ = పద్మముల వంటి కన్నులు గలది. 'నాలీకః శరశల్యాంగే ష్వబ్జఖండే నపుంసకమ్' - అని మేదినీకోశము. లేక - న + అలీక + దృక్ = అసత్యములు గాని చూపులు గలది. పార్వతీ దేవి చూపులు సత్య మైనవి. ఆమెకటాక్ష మించుక మనపైఁ బ్రసరించినచో మన కోరిక లన్నియు నిక్కముగా నెఱవేఱు నని భావము. లేక - న + అలీక + దృక్ = అప్రియములు కాని - ప్రియ మైన చూపులు గలది. ' అలీకం త్వప్రియేఽ నృతే' - అని యమరము. అమోఘదర్శన యని భావము. కుసుమ + నాలీకపాణిః = ఇతరపుష్పముల తోపాటు పద్మము కూడ హస్తము నందుఁ గలది. పద్మపాణి యని యర్థము. కాలీయశాసి = కాళియుఁ డను సర్పమును శాసించిన శ్రీకృష్ణునకు; సహజా = తోడఁబుట్టు వైనది; తాలీదల + ఆభ = తాటాకుతో సమానమైన; తనుమాలీ = దేహకాంతి

గలది. నల్లని రంగు గలది. శ్యామల యగు; సా కాలీ = ప్రసిద్ధురాలగు కాళికాదేవి; ఇహ = ఇక్కడ; సదా = ఎల్లప్పుడు; మమ = నాకు; శుభాయ = శుభము కొఱకు; భవతు = అగుఁగాక! ఆ కాళీదేవి నాకు శుభములు గల్గించుఁగాక! యని భావము.

తాత్పర్యము : పెద్ద జాఱుకొప్పుచేఁ గప్పఁబడిన శ్రవణ ద్వయము గలది, లేక బాళీలను దుద్దులు ధరించిన చెవులు గలది, చెవిలోఁ బొగడపువ్వును ధరించినది, తన విలాసగమనము ననుగమించు హంసల గుంపు గలది, సఖురాం డ్రాదరముతో వినునట్లుగా మధుర మైన కథలు చెప్పునది, పద్మముల వంటి కన్నులు గలది, వ్యర్థము కాని చూపులు గలది. పద్మమును జేతిలో ధరించినది, శ్రీకృష్ణునకుఁ జెల్లె లైనది, తాటాకు రంగు వంటి నల్లని శరీరము గలది యగు శ్రీకాళీదేవి నా కెల్లప్పుడు నిక్కడే శుభములు గూర్చుఁగాక!

విశేషములు :

(1) ఈ శ్లోకము నందలి 'వాలీ - బాలీ - చూలీ - మాలీ' శబ్దముల కర్థము చెప్పుటలో వ్యాఖ్యానమే శరణ్యము.

వాలీ - బాలీ : ముత్తైదువలగు స్త్రీలు చెవులకు ధరించు దుద్దులకు బాళీ లని పేరు. పాళీ - అని కాళిదాసు. 'పాళీభృతి శ్రవసి తాళీదళం వహసి'. ప్రాచీనకాలములో స్త్రీలు తాటాకులతోఁ జేసిన కర్ణాభరణములను ధరించెడివారు. అందువల్లనే 'చెవాకు' లని పేరు వచ్చినది.

శ్లో॥ కూర్పాసకం చ తాంబూల మంగుళ్యాభరణం శుభమ్।
కేశసంస్కారకబరీకరకర్ణవిభూషణమ్॥ అని కాశీఖండము.

మ॥ పసుపుం గుంకుమ కజ్జలంబు నునుగూర్పాసంబు తాంబూలమున్
గుసుమంబుల్ కబరీభరంబు 'చెవియాకుల్' మంగళాలంకృతుల్
విసు పొక్కింతయు లేక తాల్ప వలయున్ వీనిన్ సదాకాలము
న్నసిఁ జక్కంగఁ బ్రియుండు వర్ధిలుటకై నాళీకపత్రాక్షికిన్. (కాశీ -2-73)

అని శ్రీనాథుఁడు కర్ణాభరణమును 'జెవియా' కని తెనిఁగించినాఁడు. ఇవి బృహస్పతి లోపాముద్రకుఁ జెప్పిన పతివ్రతాధర్మములు.

ఉ॥ కంచెలయుం బటీరతిలకంబును బాపట చెందిరంబు ఘా
లాంచలసీమ లేఁబసుపుటచ్చుతబొట్టుఁజెవాకు గాజులుం
గొంచెపు వీడ్యమున్ విరులకొప్పును నొప్పు నొనర్ప నెప్పుడుం
చంచలనేత్ర యుండఁ దగు సంతత భర్తృఫలాభివృద్ధికిన్. (శృం.శా-4 - 78)

అని పిల్లలమఱ్ఱి పినవీరభద్ర కవికూడఁ జెప్పినాఁడు. బాణభట్టు కాదంబరిలో - 'క్వచి ద్విధవే వోన్ముక్తతాళపత్రా' అని వింధ్యాటవిని వర్ణించినాఁడు. 'విధవేవ = మృతభర్తృకేవ। ఉభయోః

శబ్దసామ్య మాహ – ఉన్ముక్తేతి – ఉన్ముక్తాని త్యక్తాని తాళపత్రాణి తాళదళాని యస్యాం సా। పక్షే – ఉన్ముక్తాని తాలపత్రాని తాటంకా యయేతి విగ్రహః।' అని భానుచంద్ర – సిద్ధచంద్రగణి వ్యాఖ్య. రాల్చిన తాటాకులు గలది వింధ్యారణ్యము. తీసివేసిన తాటాకు దుద్దులు గలది విశ్వస్త.

దీనిని బట్టి ప్రాచీనకాలములోఁ దాటియాకులతోఁ జేసిన చెవాకులను (దుద్దులను) స్త్రీలు ధరించెడి వారని స్పష్టము. ముత్తైదువలు చెవులకుఁ దాటంకములు తప్పక ధరింపవలయును.

శ్లో॥ సుధామప్యాస్వాద్య ప్రతిభయజరామృత్యుహరిణీం
విపద్యంతే విశ్వే విధిశతమఖాద్యా దివిషదః ।
కరాలం యత్క్ష్వేలం కవలితవతః కాలకలనా
న శంభో స్తన్మూలం తవ జనని! తాటంక మహిమా ॥(సౌందర్య – 28)

భయంకర మైన ముసలి తనమును, మరణమును నాశనముచేయు నమృతమును గూడఁ ద్రాగి బ్రహ్మ, యింద్రుఁడు మొదలగు దేవత లందఱు విపన్ను లగుచున్నారు. భయంకర మైన కాలకూట విషమును మ్రింగియు నీ భర్త యగు శివుఁడు మృత్యువు నొందక మృత్యుంజయుఁ డైనాఁడు. ఓ తల్లీ! యిది యంతయు నీవు చెవులకు ధరించిన కమ్మల గొప్పతనము – అని శ్రీశంకర భగవత్పాదులు సౌందర్యలహరిలోఁ జెప్పినారు. ఇక్కడ–

(1) "అత ఏవ సువాసిన్యా కదాచి దపి కర్ణభూషణం న త్యాజ్య మిత్యుపదేశః" – అందు వల్లనే సువాసిని కర్ణభూషణము నెప్పుడు తీయఁగూడ దని యాచార్యుల యుపదేశమని యరుణా మోదినీవ్యాఖ్య.

(2) తాటంకో నామ కర్ణా భరణ విశేషః, దేశే స్త్రీణా మవైధవ్య సూచకః, విధవాభి ర్న కదాచి దపి ధారణీయః, వివాహ కాలా దారభ్య భర్త్రా బద్ధ మామరణాంతమ్ ప్రసిద్ధమ్। ఏతచ్చ కర్ణాటకదేశే తాటంక రూపమ్; ద్రవిడదేశే మాంగల్యసూత్రకమ్; గౌడదేశే శంఖవలయ సిందూరాదికమ్! పశ్చమదేశే వారకూట సౌవర్ణకంకణాది। తేష్వేకం సధవాభరణం తాటంక మత్రోపాత్తమ్॥ తాటంక మనఁగా జెవులకు ధరించు నలంకారవిశేషము. దుద్దు. ఇది ప్రతిదేశము నందు స్త్రీల కవైధవ్యసూచకము. దీనిని విశ్వస్త లెప్పుడును ధరింపఁగూడదు. ఇది వివాహకాలములో భర్తచేఁ గట్టఁబడిన నాఁటి నుండి భర్త మరణించు వఱకుఁ దాల్పఁదగినది. కన్నడము మొదలగు దేశములలో దుద్దుల రూపముగా, ద్రవిడదేశాదులలో మాంగల్యసూత్ర రూపముగా, గౌడాదిదేశములలో శంఖములతోఁ జేసిన కంకణములు, సీమంతసిందూరము (పాపటకుంకుమ) మొదలగు రూపముగా, పడమటదేశములలో నిత్తడి, బంగారము మొదలగు వానితోఁ జేసిన గాజుల రూపముగా నీయాచార మున్నది. వీని యన్నింటి యందు దుద్దులే ముఖ్య మైనవి – అని డిండిమభాష్యము. ఈ సౌందర్యలహరి యందలి భావము –

కం॥ మ్రింగెడు వాఁడు విభుం డని
మ్రింగెడిదియు గరళ మనియు మేలని ప్రజకున్
మ్రింగు మనె సర్వమంగళ
మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో! (భాగ - 8స్క - 241)

అను పోతన గారి భావము వంటిది.

తే॥గీ॥ తనకు రెండు పుట్టంబులు దనకు నయిన
మెలఁత మంగళసూత్రంబు మినుకుఁ దక్క
వినతుఁడై యుండె నారాము వితరణంబు
పాండవోత్తమ! యేమని పలుకవచ్చు. (భాగ - 9స్క - 342)

అని పోతనగారు సీతాదేవి మంగళసూత్రమును గూడ వర్ణించినారు. ఇక్కడ – మంగళసూత్రంబు మినుకు = తాళిబొట్టు – అని శ్రీకల్లూరిసుబ్రహ్మణ్యదీక్షితులుగారి లఘుటీక. ప్రాచీనకాలములోఁ దాటంకధారణ మెంత ముఖ్య మైనదో నేఁటి కాలములో మంగళసూత్రధారణ మంత ప్రధానమైనది. మొదటఁ దాటాకుతో మంగళసూత్రము కట్టెడు వారు. అందువల్లనే తాళి, తాళిబొట్టు, తాళికట్టు – అను వ్యవహారమేర్పడినది. తాటాకు క్రమముగా మామిడాకు, పసుపుకొమ్ముగా మారి నేఁడు బంగారముతోఁజేసిన మంగళసూత్ర మైనది. మంగళసూత్రపు బిళ్ళలపై కమసాలులు మామిడాకును జిత్రించుచున్నారు.

మంగళసూత్రధారణము మధ్యకాలములో వచ్చిన సంప్రదాయము గాని ప్రాచీనవైదిక – స్మార్తాచారము గారు. పోతన – శ్రీనాథులు మంగళసూత్రమును బేర్కొనుటచే 15శతాబ్ది నుండి యల్లసాని పెద్దన, పింగళి సూరన, చేమకూర వేంకటకవి మొదలగు కవులందఱు వివాహఘట్టములో మంగళసూత్రధారణమును దప్పకుండ వర్ణించిరి. పాలకుఱికి సోమనాథుఁడు (13.శ) కూడ మంగళసూత్రమును బేర్కొనినట్లు జ్ఞాపకము.

శ్లో॥ మాంగల్యతంతునానేన మమ జీవనహేతునా।
కంఠే బధ్నామి సుభగే! జీవంతు శరదాం శతమ్॥

అనునది యర్వాచీనశ్లోకము. సంస్కృతకవు లెవ్వరు మంగళసూత్రమును వర్ణింప లేదు. భవభూతిమహాకవి మాలతీమాధవములో–

శ్లో॥ అంత్రైః కల్పితమంగళప్రతిసరాః స్త్రీహస్తరక్తోత్పల
వ్యక్తోత్తంసభృతః పినహ్య సహసా హృత్పుండరీకస్రజః ।
ఏతాః శోణితపంకకుంకుమజుషః సంభూయ కాంతైః పిబం
త్యస్థిస్నేహసురాః కపాలచషకైః ప్రీతాః పిశాచాంగనాః ॥ (మాలతీ–5– 18)

పిశాచాంగనలు ప్రేఁగులతో మంగళప్రతిసరములను ధరించి నట్లు చెప్పినాఁడు, మంగళప్రతిసర

మనcగాc గరకంకణ సూత్రమే (తోరము) కాని గళమంగళసూత్రము కాదు. “అంత్రై రచితో మంగళార్థమ్ ప్రతిసరో హస్తసూత్ర మూర్ణామయం యాభి స్తాః। అవైధవ్యచిహ్నామ్ మంగళప్రతి సరో భవతి। యద్వా ప్రతిసరః కంకణమ్ ‘కంకణే కరసూత్రే చ భవేత్ ప్రతిసరోఽ స్త్రియామ్’ – ఇతి మేదినీకరః” అని జగద్ధరటీక. నల్లపూసలు కూడ నిట్టివే. హిందువులు వివాహ సమయములో వధువు మెడలో మంగళసూత్రము కట్టునట్లే తురుష్కులు పెండ్లికూcతురు కంఠమునకు నల్లపూసలదండ కట్టుదురు. తురుష్కులు భారతదేశమునాక్రమించిన తరువాత హిందువుల కన్యలను బలాత్కారముగా నెత్తుకొని పోయి యనుభవించెడివారు.

పెండ్లి యైన సువాసినులను ముట్టcగూడ దని వారి ధర్మశాస్త్రము (కురాను) లో నున్నదcట! వీరి యుపద్రవము నుండి తప్పించు కొనుటకై భారతీయులు తమ కన్యలకు రజస్వలలు కాక పూర్వమే వివాహము చేసి నల్లపూసలు కట్టెడి వారు. నల్లపూసలు ధరించుట తురకల పద్ధతి కాని హిందువుల సంప్రదాయము కాదు. ఈ యాచారము విజయనగరసామ్రాజ్యకాలము (14శ) నుండి దేశములో వచ్చినది. మాదయ్యగారి మల్లన రాజశేఖరచరిత్రములో–

తే॥గీ॥ సవిధకీర్ణపరాగాగ్ని సాక్షి గాcగc
దమ్మివిందు కరగ్రహణమ్మొనర్పc
బొలుచు పద్మినికిని నల్లపూసదండ
గట్టినాc డన నెలదేcటిగములు పొదలె. (రాజ –2–69)

అని నల్లపూసల ప్రస్తావము కలదు. ఇది సూర్యోదయవర్ణనము. పద్మముల నుండి రాలిన పుప్పొడియే యగ్నిసాక్షిగా నున్నది. సూర్యుcడు పద్మినిని బెండ్లాడి యామె మెడలోc గట్టిన నల్ల పూసల దండ వలెc దుమ్మెదల బా రున్న దని భావము.

ఈ విషయమునే యారుద్రగా రిట్లు చెప్పినారు–

“పుస్తెలూ పూసలూ ఐదవతనానికి చిహ్నా లని యాంధ్రమహిళలు భావిస్తారు. మంగళసూత్రధారణ తోపాటే నల్లపూసలు కూడా పెళ్ళినాడు ధరిస్తారు. ఈ ఆచారం ఆదిమ కాలంలో లేదు. కాకతీయయుగం లోని కవులు పెళ్ళిని వర్ణిస్తూ తలంబ్రాలు పోసుకోడాన్ని వర్ణించారు. శ్రీనాథుcడు, పోతరాజు గారు మంగళసూత్రాన్ని పేర్కొన్నారు. తెలుగు ఇల్లాలి మెడలో నల్లపూసలను తొలిసారి కట్టించిన కవీశ్వరుcడు మాదయగారి మల్లన.”
(స.ఆ.సా – 7సం – 54 పుట.)

కం॥ బలవంతుcడు బలహీనుcడు
పొలుతురు విధి దప్ప నల్లపూసలు ముత్యాల్
తొలcగుc గద మగcడు పోయిన
వెలcదుకకున్ బొణుగుపాటి వేంకటమంత్రీ!

అని యడిదము సూరకవి చెప్పినాఁడు. ఇవి ప్రాచీనాచారములు కాకపోయినను

శ్లో॥ శ్రుతిః స్మృతిః సదాచారః (యాజ్ఞ -1-7)

అని యాజ్ఞవల్క్య మహర్షి చెప్పినట్లుగా మధ్యకాలములో వచ్చిన సదాచారములు.

ప్రసక్తానుప్రసక్తముగా నింత చెప్పవలసి వచ్చినది. చెవిదుద్దులు ధరించుట ప్రాచీనాచార మనియు, మంగళ సూత్రములు, నల్లపూసలు ధరించుట మధ్యకాలములో వచ్చిన సదాచార మనియు సారాంశము. తాటాకులతోఁ జేసిన తాటంకములు ధరించుట యతిప్రాచీనాచార మని ప్రస్తుతాంశము.

2. నాలీక : న + అలీక = నాలీక. సవర్ణదీర్ఘసంధి.

తస్మా న్ను డచి (6-3-74) అను సూత్రముచే 'న + అలీక = అనలీక - అని కావలయును.

నైక శబ్దః సుప్సుపేతి సమాసాత్ (కావ్యా -5-2-12) అని వామనుని కావ్యాలంకార సూత్రము.

నైకధేత్యాదే తు నశబ్దేన సహ సుప్సుపేతి సమాసః - అని సిద్ధాంతకౌముది. నఞర్థకమగు నశబ్దమునకు సంధి వచ్చి 'నాలీక' - యని యగుచున్నది. నాక - నైక - నదవీయసి మొదలగు శబ్దము లిట్లే యేర్పడినవి. వేదపురాణశాస్త్రపదవీనదవీయసి (కాశీ -7-161) అని శ్రీనాథుఁడు; కాయంబు నాపాయమే (భాగ -8స్క-592) అని పోతన ప్రయోగించినారు.

3. కాలీయశాసి : శ్రీకృష్ణుఁడు యమునాహ్రదములోఁ గాళియుఁడను పాముపై దూఁకి వాని పడగలపై నాట్యము చేసి మర్దించిన కథ భాగవతములోఁ బ్రసిద్ధము. కాలీయశాసి = శ్రీకృష్ణుఁడు. కాలియుఁడే కాలీయుఁడు. సంజ్ఞావాచకము కావున దోషము లేదు.

4. కాలీయశాసిసహజ : శ్రీకృష్ణుఁడు దేవకీదేవి కడుపునఁ బుట్టినను యశోద బిడ్డగాఁ బెరిగినాఁడు. దుర్గాదేవి యోగమాయగా యశోదకుఁ బుట్టినది. ఈ విధముగాఁ గాళీదేవి శ్రీకృష్ణునకు సోదరి యైనది. ఈ కథ కూడ భాగవతములోఁ బ్రసిద్ధము.

ఈ శ్లోకము కాళిదాసు రచించిన దేవీస్తుతిలోని -

శ్లో॥ యాఽఽలీభి రాత్తతను-పాళీ లసత్ప్రికయ-పాళీషు ఖేలతి భవ
వ్యాళీనకు ల్యసిత-చూళీభరా చరణ-ధూళీలసన్మునిగణా ।
పాళీభృతి శ్రవసి-తాళీదళం వహతి-యాఽలీకశోభితిలకా
సాఽలీకరోతు మమ-కాళీ మనః స్వపద-నాలీకసేవనవిధౌ ॥

అను శ్లోకమున కనుకరణము. ౨౪ ✦ ... (సశేషం)

ఓం నమఃశివాయ

విజ్ఞానవీచిక

Chakra Cleansing & Balancing Mudras & Mantras

While SEATED in Easy Pose (Cross-Legged on the Floor), VISUALIZE the CHAKRA LOCATION; its COLOUR and REPEAT the MANTRA for 3 MINUTES for EACH CHAKRA; beginning with Root Chakra...

CHAKRA NAMES, PURPOSE & LOCATION	MUDRA	PROCEDURE	MANTRA & CHAKRA COLOUR	CHAKRA SYMBOL
1. **ROOT CHAKRA** MULADHARA (SURVIVAL) Base of Spine, on Perineum.		Thumb & Index fingers touch. Arms Straight, hands on knees. Chakra Sound... Long L-A-A-A-A-M.	LAM	
2. **SACRAL CHAKRA** SWADHISTHANA (CREATIVITY) Hips		Place Hands in your lap with your palms facing upwards, right palm resting on top of left. Chakra Sound... Long V-A-A-A-A-M.	VAM	
3. **SOLAR PLEXUS CHAKRA** MANIPURA (WILL POWER) Two-Inches Below Naval		Place Hands between your heart and your stomach. Chakra Sound... Long R-A-A-A-A-M.	RAM	
4. **HEART CHAKRA** ANAHATA (LOVE) Heart		Right Hand: Index finger and thumb touching at Heart Centre. Left Hand in same Mudra resting on the Knee. Chakra Sound... Long Y-A-A-A-A-M.	YAM	
5. **THROAT CHAKRA** VISHUDDA (EXPRESSION) Throat		Hands by Stomach, fingers interlaced and thumb tips touching. Focus on Throat Chakra. Chakra Sound... Long H-A-A-A-A-M.	HAM	
6. **THIRD EYE CHAKRA** AJNA (INTUITION, WISDOM) Third Eye		Hands in front of the lower part of your breast, Middle fingers stand up tips touching, other fingers bent at first joint as shown. Chakra Sound... Long A-A-A-U-U-M.	AUM	
7. **CROWN CHAKRA** SAHASRARA (SPIRITUAL CONNECTION) Crown		Hands in front of your stomach, fingers interlaced, Little fingers pointing upwards. Chakra Sound... Long A-A-A-A-N-G.	ANG	

©Copyright rosykaur.com. All Rights Reserved.

గంగా - గౌరి

మల్లాది హనుమంతరావు, హైదరాబాద్.

'అంబా కుప్యతి, తాత! మూర్ధ్ని విలసత్ గంగేయ ముత్సృజ్యతామ్!'
'విద్వన్ షణ్ముఖ! కా గతిః మయి చిరాదస్యాః స్థితాయాః వద!'
కోపావేశవశాదశేషవదనైః ప్రత్యుత్తరం దత్తవాన్
'అంభోధిః! జలధిః! పయోధి! రుదధిః! వారాన్నిధి! ర్వారిధిః!'

చమత్కార శ్లోకం యిది. ఇందులో సంభాషణ ఉన్నది. ఎవరి సంభాషణ? మీరే చిత్తగించండి.

అంబా కుప్యతి, తాత! మూర్ధ్ని విలసత్ గంగా ఇయం ఉత్సృజ్యతామ్ – "అమ్మకు కోపం వస్తున్నది నాన్నా! నీ నెత్తిమీద ప్రకాశిస్తున్న ఈ గంగను వదిలేయాల్సిందే!" ఈ మాట అనేదెవరు?

నెత్తిమీద గంగను పెట్టుకొన్నవాడు శివుడు కనుక, ఆయన్ని 'నాన్నా' అని సంబోధిస్తున్నాడు కనుక శివకుమారుడు ఈ మాటన్నాడు. ఏ శివకుమారుడు? వినాయకుడా, షణ్ముఖుడా? జవాబు వింటే తెలుస్తుంది. వినండి రెండోపాదం.

విద్వన్ షణ్ముఖ! కా గతిః మయి చిరాత్ అస్యాః స్థితాయాః వద? – పండితుడ వయిన షణ్ముఖా! నా యందు చిరకాలంగా ఉంటూ వచ్చిన ఆమెకు వేరే గతి ఏమిటి, నువ్వే చెప్పు?

ఇది తండ్రీ కొడుకుల సంభాషణ అనీ, వాళ్ళు కుటుంబ కలహం గురించి తీవ్రంగా చర్చిస్తున్నారనీ తెలుస్తున్నది కదా? మరి శివుడి ప్రశ్నకు జవాబేమిటి? ఇది ఒక్కడి నుంచీ కాదు, కోపావేశంతో ఆరు ముఖాలనుంచీ ఆరు మాటలుగా వచ్చింది. **కోపావేశ వశాదశేష వదనైః ప్రత్యుత్తరం దత్తవాన్** (ఇవ్వబడింది). ఏమిటి ప్రత్యుత్తరం? **'అంభోధిః! జలధిః! పయోధిః! ఉదధిః! వారాన్నిధిః! వారిధిః!'** ఆరు ముఖాలూ ఆరు మాటలు చెప్పాయి. కానీ అన్నింటికీ అర్థం ఒకటే, సముద్రం. మా అమ్మని యిబ్బంది పెట్టే సవతి, ఏ బంగాళాఖాతంలో దూకితే మాకేమిటి? ఆమె సమస్యలతో మాకు సంబంధం లేదు, అని షణ్ముఖుడు కోపంగా అంటున్నాడు.

గంగానదికి మరి సరిద్వల్లభుడయిన సముద్రుడే గదా గతి!

ఇప్పుడు శ్లోకం మరోసారి చదవండి. అందులో చమత్కారం మళ్ళీ ఆస్వాదించండి. ✦

శ్రీ నీలకణ్ఠదీక్షితవిరచిత

ఆనందసాగరస్తవః

- వ్యాఖ్యాత - డా॥ ఈ.వి.యస్.మూర్తి, బాపట్ల

అవతారిక: కులదేవతోపాసన విషయంలో స్వేచ్ఛలేదు. నీవే మా కులదైవానివి. కనుక నన్ను నీవే రక్షించాలి అని ప్రార్థిస్తున్నాడు కవి.

శ్లో॥ త్వయ్యర్పితం ప్రథమమప్పయయజ్వనైవ
స్వాత్మార్పణం విదధతా స్వకులం సమస్తమ్ ।
కా త్వం మహేశి! కులదాసముపేక్షితుం మాం
కో వాఽనుపాసితుమహం కులదేవతాం త్వామ్ ॥43

పదవిభాగము : త్వయి, అర్పితమ్, ప్రథమమ్, అప్పయయజ్వనా, ఏవ, స్వాత్మార్పణమ్, విదధతా, స్వకులమ్, సమస్తమ్, కా, త్వమ్, మహేశి!, కులదాసమ్, ఉపేక్షితుమ్, మామ్, కః, వా, అనుపాసితుమ్, అహమ్, కులదేవతామ్, త్వామ్.

అన్వయము : ప్రథమం స్వాత్మార్పణం విదధతా అప్పయయజ్వనా ఏవ త్వయి స్వకులం సమస్తమ్ అర్పితం మహేశి! కులదాసం మామ్ ఉపేక్షితుం, కా త్వం కులదేవతాం త్వామ్ అనుపాసితుం అహం కః వా,

అర్థము : ప్రథమమ్ = మొదట, స్వాత్మార్పణం విదధతా = తనకు తానుగా నీకు సమర్పించుకున్న, అప్పయయజ్వనా ఏవ = అప్పయయజ్వచేతనే, స్వకులం సమస్తమ్ = తన వంశమంతయు, త్వయి = నీయందు, అర్పితమ్ = నివేదింపబడినది, మహేశి! = పరమేశ్వరి!, కులదాసమ్ = పరంపరగా దాసుదాసుడనయిన, మామ్ = నన్ను , ఉపేక్షితుమ్ = విడుచుటకు, కా త్వమ్ = ఎవరు నీవు? (విడిచిపెట్టుట కూడదని భావము), కులదేవతామ్ = వంశమునకు అధిదేవతను, త్వామ్ = నిన్ను, అనుపాసితుమ్ = సేవించకుండుటకు, అహమ్ = నేను, కః వా = ఎవడను, (విడిచి పెట్టరాదని భావము)

భావము : ఒక వంశంలోని పూర్వపురుషుడు, ఆ కులాన్ని ఒక దేవతకు సమర్పణ చేశాక, ఆ కులస్తులందరు ఆ దేవతనే ఆరాధించడం జరుగుతుంది. ఆ వంశంలోని వారికి - ఆ దేవతను సేవించడం, ఆ దేవతకు, ఆ కులాన్ని రక్షించడం విధాయకం. ఎవరికీ స్వేచ్ఛలేదని విశ్వాసాన్ని కవి ప్రకటించాడు.

విశేషములు : అనన్య భక్తి మాత్రమే కార్యసాధక మవుతుంది. రోజుకొక దేవతను ఆరాధిస్తే

ఉపయోగం అంతగా కనపడదని కవి నమ్ముతున్నాడు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడ, “అనన్యాః చిన్తయంతో మామ్” అంటూ అనన్య భక్తిని కీర్తిస్తాడు.

వ్యాకరణ విశేషాలు :

సంధులు :

1. త్వయి + అర్పితమ్ = త్వయ్యర్పితమ్, ఇ + అ > య్ + అ = య. యణాదేశసంధి
2. అప్పయయజ్వనా + ఏవ = అప్పయయజ్వనైవ. ఆ + ఏ > ఐ. వృద్ధిసంధి
3. వా + అనుపాసితుమ్ = వానుపాసితుమ్. ఆ + అ > ఆ. సవర్ణదీర్ఘ సంధి

సమాసాలు :

1. ఆత్మనః అర్పణం, ఆత్మార్పణం, స్వస్య ఆత్మార్పణం, స్వాత్మార్పణం, తమ్ స్వాత్మార్పణం. షష్ఠీతత్పురుష సమాసము
2. కులస్య దాసః కులదాసః , తమ్, కులదాసం; షష్ఠీతత్పురుష సమాసము
3. కులస్య దేవతా – కులదేవతా, తామ్, కులదేవతామ్. షష్ఠీతత్పురుషసమాసము
4. న ఉపాసితుం – అనుపాసితుమ్. నఞ్ తత్పురుషసమాసము.

అవ్యయములు : ఏవ, ఉపేక్షితుమ్, అనుపాసితుమ్, వా ✦ ... (సశేషం)

విజ్ఞానవీచిక

శ్రీ దుర్వాసోముని విరచిత

శ్రీ పరశమ్భుమహిమ్నః స్తోత్రమ్

వ్యాఖ్యాత - దోర్బల విశ్వనాథశర్మ, రామాయంపేట.

అవతారిక : పై శ్లోకమున దర్శన స్పర్శనాది క్రియల నిర్వర్తించు ఇంద్రియములకు పరశమ్భు వాశ్రయమని చెప్పబడినది. ఈ శ్లోకమున ఆతని క్రియల చేతనే ఆతని విశ్వరూపత్వము ప్రకటిత మగుచున్నదని చెప్పబడుచున్నది.

శ్లో॥ యద్వన్న్యగ్రోధబీజం పృథుతరవిటపానోకహత్వేన రూఢం
సామర్థ్యం దర్శయేస్త్వం పరమశివ! సదా సత్యవిజ్ఞానబీజమ్ ।
ఇచ్ఛాక్షేత్రేఽసుబుద్ధీంద్రియకులకలితం సర్వతః స్వక్రియాభిః
స్వాత్మానం విశ్వరూపం ప్రకటయతి యదా త్వం తదా గోచరః స్యాః ॥ 44

ప్రతిపదార్థము : పరమశివ = ఓ పరమశివా!, న్యగ్రోధబీజమ్ = మఱ్ఱివిత్తనము, పృథుతరవిటపానోకహత్వేన = పెద్దకొమ్మల చెట్టుగా, రూఢమ్ యద్వత్ = పెఱిగినట్లు, త్వమ్ = నీవు, సామర్థ్యమ్ = శక్తిని, సదా = ఎల్లప్పుడు, దర్శయేః = చూపించెదవు, ఇచ్ఛాక్షేత్రే = ఇచ్ఛ అను క్షేత్రమున, అసుబుద్ధీంద్రియకులకలితమ్ = ప్రాణేంద్రియ సమూహముతో కూడిన, సత్యవిజ్ఞాన బీజమ్ = సత్యవిజ్ఞానమను విత్తనము, విశ్వరూపమ్ = విశ్వరూపమునుగా, స్వాత్మానమ్ = స్వాత్మను, యదా = ఎప్పుడు, ప్రకటయతి = ప్రకటించునో, తదా = అప్పుడు, సర్వతః = అన్నివైపుల నుండి, స్వక్రియాభిః = తన క్రియల చేత, గోచరః = గోచరుడవు, స్యాః = అగుదువు.

తాత్పర్యము : మఱ్ఱివిత్తనము శాఖోపశాఖలుగల వృక్షముగా పెఱిగినట్లు నీవు ప్రాణేంద్రియములతో కూడి విశ్వరూపముగా నిన్ను నీవు ప్రకటించు కొందువు. తొలుత నీవు సత్యవిజ్ఞానమను విత్తనముగానే ఉండి నీ సామర్థ్యమును చూపించి ప్రకటించు కొన్నప్పుడు గోచరుడ వగుదువు. ఎన్నియో నీ క్రియల ఫలరూపమే ఈ విశ్వము.

వివరణము : విత్తనమందు క్రియాశక్తి గూఢమై ఉండును. శాఖోపశాఖలుగా విస్తరించి నప్పుడు ఈ కనబడి కనబడని ఈ చిన్ని విత్తనమం దంతశక్తి యున్నది కదా అని మన మాశ్చర్యము నొందెదము. అట్లే పరశమ్భువు సృష్టికి ముందు సత్యవిజ్ఞాన మనెడి విత్తనముగా నుండి దానిలోని క్రియాశక్తులు విజృమ్భించి విశ్వరూపముగా తనను తాను ప్రకటించు

కొన్నప్పుడు విశ్వరూపముగానే ఆ విజ్ఞాన బీజము ఇంద్రియములకు గోచరించును. విత్తనము సూక్ష్మము. అట్లే సత్య విజ్ఞానము ఎవరికి కనబడనంత సూక్ష్మము. అంత సూక్ష్మమైన ఆ బీజమున అనంతశక్తులు గూఢముగా ఉండును. ఆ విజ్ఞాన బీజమే స్థూలవిశ్వరూపముగా ప్రకటితమైనప్పుడు మన ఇంద్రియములకు గోచరమగును. కాని విజ్ఞానబీజమే ఈ విశ్వ మహావృక్షముగా గోచరమగుచున్నదని ఎఱుగము. వేద శాస్త్రాగమాదుల వలన ఆ విషయము నెఱిగినప్పుడు ఈనాడు మనము ఆ విజ్ఞానబీజమే తన క్రియాశక్తులతో ఇంత స్థూలత్వము నొంది గోచరమగుచున్నదని ఎఱుగుదుము. ఈ విషయమునే శ్రీ శంకరులు **'జాతేఽఙ్కురే కథమిహోపలభేత బీజమ్'** అని వివరించిరి. ఈ ప్రపంచమున సత్యవిజ్ఞాన స్వరూప పరమాత్మ ఏల గోచరించదు, అను ప్రశ్నమునకు పై శంకరుల వాక్యము సమాధానము. చెట్టుగా మారినది విత్తనమే అయినను ఆ విత్తనము మొలకెత్తినప్పుడే విత్తనమేమైనదని వెదకువాని కావిత్తనము కనబడునా! ఆ విత్తనమే ఇప్పుడంకురమైనది. దాని విత్తనము యొక్క రూపము ఇప్పుడెట్లు కనబడును అని ప్రశ్నమునకు ప్రశ్నమునే సమాధానముగా చెప్పినారు. బీజము కారణావస్థాపన్నము. సత్యవిజ్ఞాన బీజము కారణావస్థాపన్నము. విశ్వము కార్యావస్థాపన్నము. ఆ కారణ బీజము ఈ కార్య విశ్వరూపముగా గోచరించుచున్నది. కావున మనము ఈశ్వరుడు మనకు ఇంద్రియగోచరు డగుచునే యుండగా ఆతడు గోచరించ లేదనుట వట్టి అజ్ఞానము మాత్రమే. **'వాసుదేవ స్సర్వమ్'** అను జ్ఞానము కలవాడే మహాత్ముడు. అట్టివారు కోటి కొక రుందురు. వారికీశ్వరుడే ఈ విశ్వముగ గోచరించును. **విశ్వముగా నున్నది ఆ ఈశ్వరుడే** అని శ్లోకము యొక్క సారాంశము.

బహువిటపాకులమ్ము వటపాదపమెట్టులు బీజ గూఢమై
బహిరుపగామియౌనటులె బాహ్యము సత్యవిబోధ బీజమున్
స్పృహయనుక్షేత్రమందు సుమతీంద్రియసంకులమై స్వకర్మలన్
మహిత జగమ్ము వెల్వఱచు మాకుఁగనంబడెదప్పుడే శివా! ✦...(సశేషం)

వాల్మీకివాణి : తొలిమద్యనిషేధచట్టం - వాల్మీకిరామాయణం.

పానాదర్థశ్చ ధర్మశ్చ కామశ్చ పరిహీయతే ॥

మద్యపానంవలన ధనం, ధర్మం నశించటమేకాదు, కామంకూడా క్షీణిస్తుంది. అనారోగ్యంతోబాటు మరణంకూడా సంభవిస్తుంది. ఈ దుర్వ్యసనం సంఘానికి పట్టిన చీడ, పీడ. దీనిని పారద్రోలండని ఆదికావ్యమైన రామాయణంలో వాల్మీకి ప్రకటించాడు. ఇటువంటి సాంఘిక దురాచారములనెన్నింటినో ఖండించింది ఆ ఆదికావ్యం. హితంకూర్చేది సాహిత్యం. ఉత్తమసాహిత్యం రామాయయణం.

-డా॥ టి. దక్షిణామూర్తిశాస్త్రి

శ్రీకృష్ణ చరితం

డా॥ గాలిగుణశేఖర్, తిరుపతి.



ఏడవ స్కంధం

రాక్షసుల విజృంభణ – దేవతల ఆక్రందన

వరగర్వంతో విజృంభించి హిరణ్యకశిపుడు యక్ష, భూత, ప్రేత, సాధ్య, చారణ, గంధర్వ, కిన్నర, విద్యాధర, దేవతా గణాలను లొంగదీసుకున్నాడు. దేవేంద్ర నగరాన్ని ఆక్రమించి సింహాసనాన్ని అధిష్ఠించి లోక కంటకుడయ్యాడు. దేవతల్ని తన సేవకులుగా నియమించుకున్నాడు. యజ్ఞయాగాదుల్లో హవిర్భాగాలను తానే అందుకున్నాడు. అతడి ఆజ్ఞను శిరసావహించి సూర్యుడు పరిభ్రమించాలి. వర్షాలు కురవాలి.

అతడి క్రూరకృత్యాలు పెచ్చుమీరుతుండగా దేవజాతులన్నీ భయభ్రాంతులకు లోనై, అందరూ కూడి విష్ణువును ప్రార్థించారు. విష్ణువు వాళ్లకి అభయం ఇచ్చాడు.

శమదమాది సద్గుణ సంపన్నుడైన తన కుమారుడు ప్రహ్లాదుణ్ని హిరణ్యకశిపుడు హింసించినప్పుడు, అతణ్ని అంతమొందిస్తాను అని దేవతలకు చెప్పి అంతర్ధానమయ్యాడు.

ప్రహ్లాదుడు – మూర్తీభవించిన హరిభక్తి

హిరణ్యకశిపుడికి అనుహ్లాద, హ్లాద, ప్రహ్లాద, సంహ్లాదులనే నలుగురు కుమారులు. వాళ్లలో ప్రహ్లాదుడు హరిభక్తుడు. సమస్త ప్రాణుల్ని తనలా చూసేవాడు. పరస్త్రీలను కన్నతల్లిలా పరిగణించేవాడు. పెద్దలు ఎదురైనప్పుడు నమస్కరించే వినయశీలి. దీనులకు తల్లీ, తండ్రీ అన్నీ తానుగా ఉంటూ ఆదరించే ఆర్ద్ర మనస్కుడు. స్నేహితుల్ని సోదరుల్లా భావించి, గురువుల్ని దైవంలా కొలిచేవాడు. హాస్యానికైనా అబద్ధం చెప్పనివాడు.

రూపం, విద్య, సంపద మొదలైనవి అపారంగా ఉన్నా గర్వంలేనివాడు. ఎల్లప్పుడూ హరిచింతన గలవాడు. రాక్షస విరోధులు దేవేంద్రాదులు సైతం అతడి సద్గుణాలను చూసి కీర్తించేవాళ్లు.

ప్రహ్లాదుడు వైఖరి హిరణ్యకశిపుడికి విలక్షణంగా, విపరీతంగా అన్పించింది. **వీడు స్వర్గాధిపత్యాన్ని కూడా లెక్కచెయ్యడు. దుర్బలుడిగా సోమరిగా ఉంటున్నాడు. బహుశా**

చదివిస్తే బాగుపడతాడేమోనని ప్రహ్లాదుణ్ని తన వద్దకు పిలిపించి ఇలా అన్నాడు.

చదువని వాడజ్ఞుండగు చదివిన సదసద్వివేక చతురత గలుగున్
చదువగ వలయును జనులకు చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ!
(180)

మంచి, చెడ్డలు గ్రహించే నైపుణ్యం కోసం, శుక్రాచార్యుడి పుత్రులైన చండుడు, అమర్కులనే వాళ్లని రప్పించి, వాళ్లకి తన కుమారుణ్ని అప్పగించాడు. గురుసేవలో జాగ్రత్తగా మసలుకుంటూ, వాళ్లు చెప్పే విషయాలను గ్రహిస్తూ ఉన్నా, మనస్సు శ్రీహరిమీదే లగ్నమై ఉండేది. ఎవరు ఏమిచెప్పినా వినడమే కాని వాదనలకు దిగేవాడు కాదు.

కొంతకాలం గడిచింది – హిరణ్యకశిపుడు కుమారుణ్ణి రప్పించాడు. అతణ్ణి దగ్గరగా తీసుకొని, తల నిమిరి, శిరస్సును ఆఘ్రాణించాడు.

హిరణ్యకశిపుడు **కొడుకుల మాటలు సంతోషాన్ని కలిగిస్తాయి. నువ్వు గురువుల వద్ద చదివిన దాన్ని కొంత వినిపించు** అన్నాడు.

ప్రహ్లాదుడు – తండ్రీ! ఈ **భూమిపై జన్మించిన జనులు సంసారం అనే చీకటి నూతిలో పడి బయటపడలేకున్నారు. మీరు వేరు మేము వేరు అనే భ్రమతో బ్రతుకుతున్నారు. ఇదంతా భగవంతుడి లీలావిలాసం అని గ్రహించలేకున్నారు. అలా గ్రహించి విష్ణువును తలచుకుంటూ అడవిలో నివసించినా మంచిదే** అన్నాడు.

ప్రహ్లాదుడి శత్రుకీర్తన విని హిరణ్యకశిపుడు ఆశ్చర్యంతో – కుమారా! ఈ **భావాలన్నీ నీ అంతట నీవు చెబుతున్నవి కావు. లోకంలో పెద్దలు ఏం చేస్తే పిల్లలు వాటినే అనుకరిస్తారు. ఈ అవివేకాన్ని నీకు ఎవరు కలిగించారు. విష్ణువు మనకు ప్రధానమైన శత్రువు. అతడి పేరు ఈ రాజ్యంలోనే విన్పించకూడదని** శాసించాను.

విష్ణుభక్తుల్ని శాసించడం, మునిగణాలను బాధించడం. యజ్ఞయాగాదుల్ని ధ్వంసం చెయ్యడం, ఇవే దైత్యుల కర్తవ్యం. బుద్ధిమాలి శత్రువును స్మరించి చెడిపోకు – అని మందలించాడు.

ప్రహ్లాదుడు – **పరమాత్మను తెలుసుకునే విషయంలో బ్రహ్మాదులు కూడా అసమర్థులే. అటువంటప్పుడు సామాన్యులు గ్రహించడం సాధ్యంకాదు కదా! నాకెవ్వరూ హరిభక్తిని బోధించలేదు. ఇనుము అయస్కాంతం వైపు ఆకర్షింపబడినట్లు నా మనస్సు హరివైపే ఆకర్షింపబడుతూంది.** ✦ ... (సశేషం)

శ్రీ గీతా సుధాసారము

– *దివంగత* **కప్పగల్లు సంజీవమూర్తిరావు, బళ్ళారి.**

1. అర్జున విషాదయోగము

సీ॥ శ్రీకరంబగు ముక్తిఁజేకూర్చు బ్రహ్మవి
దోృపదేశము నొంద యోగ్యుఁ డనియు
నియతిమై లేనిపోని దురాశలకు నెల్ల
దూరుఁడై నిలిచెడు ధీరుఁడనియు
ఎట్టి యాపద చుట్టిముట్టినఁ, బాపంబు
పొంతఁ బోవని పుణ్యపురుషుఁ డనియు
తనకెంత కష్టమైనను నోర్చి, పెఱవారిఁ
గలఁప నోర్వని దయాకలితుఁ డనియు

గీ॥ క్రీడి నెంచి, కృష్ణుండు క్షత్రియకులార్హ
ధర్మమున కాతనిన్ బూన్పఁ దలఁచెఁ గరుణ
నంచు మొదటి యధ్యాయంబు నందుఁ దెలిపి
గీత కరుణించు; లోకోపకృతి గణించు.

శ్రీకరంబగు ముక్తికై బ్రహ్మోపదేశమునకు యోగ్యుడని, అర్జునుని బంధుప్రీతియను అజ్ఞానము పోగొట్టుటకై శ్రీకృష్ణుడు గీతోపదేశమున కుద్యుక్తుడయ్యెను.

పార్థుడు మహాసంగ్రామమున బంధుమిత్రులను చూచి, వారి సంహారము అందరికి దుఃఖము కలుగచేయునని, పరితప్తుడై విషాదవదనుడై, ఖిన్నుడై యుద్ధము చేయజాలనని, ఆయుధములను వీడి, నిస్సహాయుడై యున్న అర్జునునకు, క్షాత్రధర్మమును దెలుప, గీతోపదేశము ద్వారా, దయాపరుడు, ధీరుడు అయిన పార్థునికి జ్ఞానోపదేశం చేయనెంచి...

లోకోపకృతి గణించి పార్థసారథి గీతను కరుణించెను.

(సాధనభూతమైన శరీరమే రథము (కారక, ఉపనిషత్తు) వికల మనస్కుడైన పార్థుని ద్వంద్వాభిప్రాయముల పోగొట్టి, మనోస్థైర్యము నింపి, తాను సారథ్యము వహించెను. జీవులెల్లరందుండి సుఖ-దుఃఖములను ద్వంద్వములను సుజ్ఞానముచే తొలగించ గీతామృతమును అర్జునుని ద్వారా తత్త్వమార్గమును బోధించుచున్నాడు.)

లింగార్చన ఎందుకు శ్రేష్ఠమైనది?

- రచన - గబ్బిట దుర్గాప్రసాద్, ఉయ్యూరు

మనం చేసే పూజనుబట్టి ఫలితం ఉంటుందని ధర్మశాస్త్రాలు ఉద్ఘోషిస్తున్నాయి. ఎంపిక చేసుకున్న ఆ దైవం ఏ రూపంలో పూజిస్తే, పూర్ణానుగ్రహంతో మన కోర్కెలను నెరవేరుస్తాడో ముందే గ్రహించాలి. దైవం పట్ల నిష్ఠ వుండాలి. ఆ విధివిధానాన్ని ఆచరించి మనోభీష్టాన్ని నెరవేర్చుకోవాలి. ఇది తెలిసి అర్జునుడు, శ్రీకృష్ణుడు శివుణ్ణి అర్చించి విశేష ఫలితం పొందితే, అది తెలియక వేరొక విధానంలో పరమేశ్వరుడిని పూజించి ఫలితం పొందలేక పోయాడు అశ్వత్థామ. ఈ విషయాన్ని మహాభారతంలో ద్రోణపర్వంలోని చిన్న కథ వివరంగా తెలిపింది. మాఘమాసంలో మహాశివరాత్రి వస్తుంది కనుక శివలింగార్చన గురించి తెలుసుకొందాం.

శివరాత్రి

ప్రత్యేకం

మహాభారతయుద్ధం భీభత్సంగా జరుగుతోంది. అప్పటికే ద్రోణాచార్యుడు యుద్ధంలో వీరమరణం పొందాడు. ద్రోణసుతుడు అవమానభారం తో రగిలి, ఆ కోపాన్ని బాణాలలో సంధించి పాండవసైన్యంపై చెలరేగుతున్నాడు. అతని ధాటికి తట్టుకోవటం చాలా కష్టంగా ఉంది. అశ్వత్థామ మహాశస్త్రాస్త్రనిపుణుడు. కృష్ణార్జునులను తీవ్ర శరాఘాతంతో చీల్చి చెండాడుతున్నాడు. శరీరాలు గాయాలై రక్తం వరదగా పారుతోంది కృష్ణార్జునులకు. అర్జునుడు ఇవేమీ లెక్కచేయకుండా అశ్వత్థామను తీవ్రబాణాలతో బాధిస్తూనే వున్నాడు. వీరిద్దరిని ఇంక ఏమి చేయలేనని తీర్మానించుకొన్నాడు ద్రోణసుతుడు. కోపం, పరాభవంతో చెలరేగిపోయాడు. పరిస్థితి చెయ్యిదాటిపోతోందన్న ఆవేశమూ తోడైంది. చివరి ప్రయత్నంగా మంత్రపూతంగా నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. ఈ దెబ్బతో అందరి పని సరి అని సంబరపడిపోతున్నాడు. అంతటా హాహాకారాలు చెలరేగుతున్నాయి. ఆ అస్త్రప్రయోగం తో

"ధరణీచక్రము దిర్దిరం దిరిగె, మార్తాండుండు, గుంఠీ భవ -
త్కిరణుండయ్యె, దిశా వితానము వడంకెన్, మిన్నదిర్చెన్,మహీ
ధర సంతానము లోలి గ్రక్కదలె,నుద్భ్రాంతంబులై యంబుధు
ల్వొరలెన్ గట్టులమీద బిట్ట పిడుగుల్మ్రోసెన్ మహోదగ్రతన్"

ఇంత భీభత్సం సృష్టిస్తూ దూసుకొస్తున్న నారాయణాస్త్రప్రభావం తెలిసిన శ్రీకృష్ణుడు అందరికి హెచ్చరికలు చేశాడు. యోధులందరినీ వారి వాహనాలను దిగి, చేతిలో ఆయుధాలు లేకుండా భూమి పై నిలబడి నమస్కరించమని బోధించాడు. కేశవుని మాట మన్నించి అందరూ ఆయన చెప్పినట్లే చేశారు. శ్రీకృష్ణార్జునులు కూడా ఆయుధ విసర్జన చేసి, రథం దిగి నారాయణాస్త్రానికి నమస్కరించారు. మహాశ్చర్యంగా మహా మహిమాన్వితమైన నారాయణాస్త్రం కృష్ణార్జునులను పాండవవీరులను సైన్యాన్ని ఏమీ చేయలేకపోయింది. కాని కృష్ణుడి మాటను పెడచెవిని పెట్టి భీమసేనుడు ఇంకా బీరాలు పలుకుతూ రథం మీదే ఆయుధాలతో ఉండిపోయాడు. నారాయణాస్త్రం అందర్నీ వదిలి భీముడి వైపుకు మహావేగంగా దూసుకుపోతోంది. పోనీ మాట వినకపోయినా ఊరుకున్నాడా అంటే అదీ లేదు - తన సహజ ధీర గంభీర స్వరంతో అందరిని భయపడవద్దని -

"డిగకుడు వాహనంబులు, గడింది మగంటిమి గోలుపోవ మీ
రు గడగ దక్కి పెట్టకుడు, రూపర నాయుధముల్ మహాస్త్ర శ
క్తి గెలుతు గోత్ర భిత్కులిశ, తీవ్ర శరంబుల వైభవంబు, భూ
రి గద విహారభంగియు నరిప్రకరంబులు పిచ్చలింపగన్"

అంటూ ప్రగల్భాలు పలుకుతూ సవాలు విసిరాడు. అందర్నీ కాపాడుతానని అభయమిస్తూ పిరికిపందలు కావద్దని హెచ్చరించాడు. పరిస్థితి మహాతీవ్రమై భీముని ఉనికికే ప్రమాదం జరుగుతుందని భావించి కృష్ణార్జునులు ఒక్కసారిగా అతని రథంలోకి ఉరికి నిరాయుధుడిని చేసి రథం దిగేట్లు చేసి పెద్ద అపాయమే తప్పించారు. పాండవ సైన్యం ఊరట చెందింది. నారాయణాస్త్రం తనకింక పనేమీ లేదని భావించి ప్రశాంతమయింది. అయ్యో అస్త్రం వ్యర్థమైందే అని ద్రోణసుతుడు దిగాలు పడ్డాడు.

చిరునవ్వు కృష్ణార్జులదైతే, చిరాకు అశ్వత్థామదయింది. ఎందుకు తన అస్త్రం విఫలమయిందో తెలియటం లేదు ద్రోణసుతుడికి. తీవ్రంగా విచారించాడు. ఇంతలో దుర్యోధనుడు నారాయణాస్త్రాన్ని మళ్ళీ ప్రయోగించమని తొందర పెట్టాడు. అప్పుడు అశ్వత్థామ ఆ అస్త్రం పునః ప్రయోగానికి అర్హం కాదని, ఒక వేళ మూర్ఖంగా ప్రయోగిస్తే ప్రయోగించినవాడినే వధిస్తుందని నారాయణాస్త్రాన్ని వరంగా ఇచ్చినపుడు కేశవుడే

చెప్పాడని తెలియజేశాడు. చావు, ఓటమి రెండూ ఒకటే కనుక అది శత్రువులనోడించి వెళ్లి పోయింది అన్నాడు. మళ్ళీ సంకుల సమరం సాగింది. అర్జునుడు అశ్వత్థామ ఒకరిపై ఒకరు అస్త్రాలు ప్రయోగించారు. ద్రౌణి ప్రయోగించిన ఆగ్నేయాస్త్రాన్ని కిరీటి బ్రహ్మాస్త్రం చేత నిర్వీర్యం చేశాడు. దిక్కు తోచలేదు ద్రోణసుతుడికి. తల పట్టుకు కూర్చున్నాడు. పరాభవభారంతో కుంగిపోయాడు.

ఆ విషయమేదో తేల్చుకోవాలని ద్రోణసుతుడు రథం దిగి భూమిపై నిలబడి ఆర్తితో వ్యాసమహర్షిని ధ్యానించాడు. ఆయన ప్రత్యక్షమైనాడు. నమస్కరించి "ఇది ఏమి మాయో తెలియటంలేదు స్వామీ! దేవగంధర్వాదిజాతులనుకూడా బాధించి ఇబ్బంది పెట్టిన దివ్యాస్త్రమైన నారాయణాస్త్రం, ఆగ్నేయాస్త్రం కేవలం మనుష్యులైన కృష్ణార్జునులను దహించలేదు కారణం ఏమిటో తెలుసుకోవాలని కుతూహలంగా వుంది తెలియజేయండి" అన్నాడు అశ్వత్థామ. అప్పుడు వ్యాసమహర్షి చిరునవ్వు నవ్వి "ఎవరు చేసుకున్న పూజా ఫలితం వారికి లభిస్తుంది. పూర్వజన్మలో విష్ణుమూర్తి లోకరక్షణార్థం శివునిగూర్చి తీవ్రంగా తపస్సు చేశాడు. పద్మాక్షుని తపస్సుకు విరూపాక్షుడు మెచ్చి ప్రత్యక్షమయ్యాడు. శివుని కేశవుడు నానావిధస్తోత్రాలతో స్తుతిస్తూ

"నిను దనుగా నతి నిర్మల - మనస్సమాధి ప్రకర్ష మగ్నత వలనం
గనుగొని తద్రూప భజన - మొనరించు మహాత్ముడమృత మొందు బశుపతీ"

అని శివపూజ వలన అమృతత్వం లభిస్తుందని చెప్పి, శివుని అనన్య భక్తితో పూజించే తనకు "అనన్య సులభ ప్రభావం" ప్రసాదించమని వేడుకొన్నాడు. భక్తసులభుడు పరమేశ్వరుడు "నువ్వు నర, కిన్నర, గంధర్వ, గరుడ ఉరగాదులను అవలీలగా జయిస్తావు. నిన్ను ఏ అస్త్రశస్త్రాలు బాధించ లేవు. పంచభూతాలూ నీ జోలికి రావు. చావు నొప్పులు నీకు ఉండవు. నువ్వు నన్నైనా జయించగల సమర్థుడవౌతావు" అని అభయమిచ్చాడు. నారాయణుడు విజయుడైనాడు. నారాయణునిలో జనించిన నరుడు కూడా విజయుడే అయ్యాడు అని కొంత రహస్యం విప్పి చెప్పాడు.

మళ్ళీ కొన సాగిస్తూ "నువ్వు పూర్వజన్మలో పరమేశ్వరుడిని ప్రతిమారూపంలో అర్చించావు" అని

"శుభ్రమగు నుర్వి మృత్తిక సురుచిరంపు -
బ్రతిమ గావించు గొని, యందు బరము నావ
హించి,పూజా విశేషంబులెల్ల జేసి -
నీవు దొలు మేన గొలిచితి నిష్ఠ తోడ" అన్నాడు. మరి కృష్ణార్జులు -

**"వారలు లింగాధిష్ఠా-నా రూఢుం గా నొనర్చి యర్చించిరి, భ
వ్యారాధన పరులై ముసు - గౌరీపతి నతుల నియమ కల్పన వెలయన్"**

వాళ్ళిద్దరూ లింగరూపంలో వున్న శివుడిని ఆరాధించారు అని మిగిలిన రహస్యాన్నీ విప్పాడు. ఏ రూపంలో పరమేశ్వరారాధన చేసినా సర్వార్ధసాధకం అవుతుంది. కాని "లింగంబు నందు బూజించుట, యర్చ యందారాధించుట కంటే ననేక గుణంబు లెక్కువ" అని ధర్మసూక్ష్మాన్ని వివరించాడు. పూర్వజన్మలో మీరు చేసుకున్న పూజాఫలితమే ఇప్పుడు ఈ రూపంలో ఫలితంగా కన్పిస్తుంది. లింగార్చన చేసినవారిని శివుడు మెచ్చి రక్షిస్తాడు. అందుకే కృష్ణార్జునులను నీ నారాయణాస్త్రం, ఆగ్నేయాస్త్రాదులు ఏమీ చేయలేక పోయాయి" అని సవివరంగా తెలియజేశాడు మహర్షి వ్యాసుడు. శివుణ్ణి లింగరూపంలో, అభిషేకం చేసి పూజచేస్తేనే ఆయన సంతోషించి అభీష్టసిద్ధినిస్తాడన్న రహస్యం అశ్వత్థామకు ఇప్పుడు తెలిసింది. కనుక శివప్రతిమను పూజించటం కంటే, శివలింగాన్ని పూజిస్తే అధిక ఫలితం. ఈ విషయాన్ని ఆనుశాసనిక పర్వంలో కూడా శ్రీకృష్ణునిచేత ధర్మరాజుకు చెప్పించాడు వ్యాస మహర్షి. శివలింగసన్నిధానంలో చేసే ప్రతి పని ఆయురారోగ్య ఐశ్వర్యాల నిస్తుందని తెలియజేశారు. వ్యాసర్షి వివరణతో సంతృప్తి చెంది, పులకితాంతరంగుడు, సమాహితాంతరంగుడు అయిన రుద్రుని తలచుకొని, కేశవుడిని పొగిడి, వ్యాసమహర్షికి కృతజ్ఞతాపూర్వాక అభివాదం చేశాడు ద్రోణపుత్రుడు.

ఇంతకీ లింగం అంటే ఏమిటి? "సమ్యక్ జ్ఞానమే లింగం" అని శైవ ఆగమాలు బోధిస్తున్నాయి. శివలింగమే పరబ్రహ్మమని చెప్పాయి. ఓంకారమే లింగం. శివపురాణంలో లింగమే తన రూపు అని శివుడే చెప్పాడు. లింగాన్నే అర్చించమని కుడా చెప్పాడు. శివలింగం అంటే శివుని యొక్క లింగం అని మాత్రమే కాదు శివుడే లింగం అని శైవ ప్రకాశిక లో వుంది. పద్మపురాణం కూడా లింగానికే శివార్చన చేయాలని బోధించింది. త్రికాల శివలింగార్చన శ్రేష్ఠమని ఉపనిషత్తు వుద్ఘోషించింది. కనుక సాధకుడు ఇందులోని రహస్యం గ్రహించి, తన కోర్కెలను తీర్చుకోవటానికి తన ఇష్టదైవం ఏ రూపంలో అర్చించితే, ధ్యానిస్తే భక్తసులభుడై వరదానం చేస్తాడో, ఆపదల నుంచి రక్షిస్తాడో, తెలుసుకొని పూజించి అభీష్టసిద్ధిని పొందాలి. ఇదే ఈ కథలోని ధర్మసూక్ష్మం. ఆ ధర్మసూక్ష్మం తెలిసి శ్రీకృష్ణుడు, అర్జునుడు శివలింగార్చన చేశారు. అందుకే అశ్వత్థామ ప్రయోగించిన నారాయణాస్త్రం మొదలైనవి శివుని అనుగ్రహం వల్ల వారిని ఏమీ చేయలేకపోయాయి. ఇది తెలియక అశ్వత్థామ శివప్రతిమనే పూజించి, నారాయణాస్త్రఫలితాన్ని పొందలేకపోయాడు. కనుక పూజనుబట్టే పురుషార్థం లభిస్తుందని తెలుసుకోవాలి. ✦

బ్రహ్మసూత్రాలు (25)

బ్రహ్మసూత్రశాఙ్కరభాష్యమ్
ఆన్ధ్రభాషానువాదేన సమన్వితమ్

వ్యాఖ్యాత - మేళ్ళచెఱ్వు వేఙ్కట సుబ్రహ్మణ్యశాస్త్రి, తెనాలి.

జిజ్ఞాసువుల కొఱకు 'బ్రహ్మసూత్రముల'కు జగద్గురు శ్రీ శంకరాచార్యులవారు అందించిన భాష్యము, దానికి మేళ్లచెర్వువారు చేసిన ఆంధ్రానువాదము – 'ఆత్మజ్యోతి' పాఠకులకు అందించబడుతున్నవి. శాస్త్రగ్రంథము కావున సునిశిత దృష్టితో అధ్యయనము చేస్తూ ఆస్వాదించవలసినదని భావిస్తూ.... – రామోరా.

భాష్యమ్ 93 : సూ.భేదవ్యపదేశాచ్చాన్యః. **1.1.21**

అస్తి చాదిత్యాదిశరీరాభిమానిభ్యో జీవేభ్యః అన్యః ఈశ్వరోఽన్తర్యామీ – "**య ఆదిత్యే తిష్ఠన్ ఆదిత్యాదన్తరో యమాదిత్యో న వేద యస్యాదిత్యః శరీరం య ఆదిత్యమన్తరో యమయతి ఏష త అన్తర్యామ్యమృతః**" (బృ.ఉ.3.6.9) ఇతి శ్రుత్యన్తరే భేదవ్యపదేశాత్. తత్ర "ఆదిత్యాదన్తరో యమాదిత్యో న వేద" ఇతి వేదితురాదిత్యాద్విజ్ఞానాత్మనః అన్యోఽన్తర్యామీ స్పష్టం నిర్దిశ్యతే. స ఏవేహాప్యన్తరాదిత్యే పురుషో భవితుమర్హతి, శ్రుతిసామాన్యాత్. తస్మాత్పరమేశ్వర ఏవేహోపదిశ్యత ఇతి సిద్ధమ్. అన్తరధికరణం సమాప్తం

అను.93 : సూ. "**భేదం చెప్పటంవలన వేరైన వాడు**"

ఆదిత్యమండలము మొదలగు శరీరములను అభిమానించు జీవులకన్న అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు వేరుగా ఉన్నాడు. చూడండి. "ఆదిత్యునిలో ఉంటూ, ఆదిత్యునికి ఆంతరుడో, ఎవనిని ఆదిత్యుడే ఎరుగడో, ఎవనికి ఆదిత్యుడు శరీరమో ఎవడు ఆదిత్యుని లోపలనుంచి నియంత్రిస్తాడో, అతడే అమృతుడు. 'అంతర్యామి' (బృ) అని మఱొకశ్రుతి 'భేదమును' చెప్తున్నది. ఇందులో "ఆదిత్యునికి ఆంతరుడు, ఆదిత్యునికి గూడా తెలియడు" అనటం వలన ఆదిత్యునిలోని విజ్ఞానాత్మ (జీవుడు) కన్న భిన్నంగా ఒక అంతర్యామి ఉన్నట్లు స్పష్టము. అతడే ఇచ్చట ఆదిత్యాంతర్గత పురుషుడు కాదగును. రెండు శ్రుతులు సమానంగా ఉన్నవి కదా! కనుక ఇచ్చట (సూర్య, నేత్ర గోళాలలో) పరమేశ్వరుడే ఉపదేశింపబడుచున్నాడు. అన్తరధికరణం సమాప్తం

---

8. ఆకాశాధికరణమ్. సూ.22

భాష్యమ్ 94 : సూ. **ఆకాశస్తల్లిఙ్గాత్. 1.1.22**

వైయాసికన్యాయమాలా

కా. ఆకాశ ఇతి హోవాచేత్యత్ర ఖం బ్రహ్మ–వాత్ర ఖమ్,
శబ్దస్య తత్ర రూఢత్వాద్వాయ్వాదేః సర్జనాదపి. 1

కా. సాకాశజగదుత్పత్తిహేతుత్వాత్ శ్రౌతరూఢితః,
ఏవకారాదినా చాత్ర బ్రహ్మైవాకాశశబ్దితమ్. 2

ఆకాశాధికరణమ్. సూ.22

అను.94 : సూ. **“పరమాత్మ చిహ్నాలవలన ఆకాశము పరమాత్ముడే”**

“ఆకాశ ఇతి హోవాచ” అన్న మంత్రంలో ఆకాశమంటే, ఆకాశమా? బ్రహ్మమా? ఇచ్చట ఆకాశమే. ఆ శబ్దానికి ప్రసిద్ధమయిన అర్థం అదే. వాయువు మొదలగు వాటినదే సృజించిందిగదా! 1

కాదు. ఇచ్చట ఆకాశమంటే బ్రహ్మమే. ఆకాశంతో సహా మొత్తం జగత్తుకు ఉత్పత్తికారణం కనుక, వేదంలో ఆకాశ శబ్దం బ్రహ్మమునందు రూఢం కనుక ఆకాశమునుండియే (ఏవ=ఏ) అని ‘ఏవ’ వాడటం వలన 2

భాష్యమ్ 95 : ఇదమామనన్తి – **“అస్య లోకస్య కా గతిరిత్యాకాశ ఇతి హోవాచ సర్వాణి హ వా ఇమాని భూతాన్యాకాశాదేవ సముత్పద్యన్తే, ఆకాశం ప్రత్యస్తం యన్త్యాకాశో హ్యేవైభ్యో జ్యాయానాకాశః పరాయణమ్**” (ఛాం.ఉ. 1.9.1) ఇతి, తత్ర సంశయః – కిమాకాశశబ్దేన పరం బ్రహ్మాభిధీయతే ఉత భూతాకాశమితి. కుతః సంశయః? ఉభయత్ర ప్రయోగదర్శనాత్, భూతవిశేషే తావత్సుప్రసిద్ధో లోకవేదయోరాకాశశబ్దః. బ్రహ్మణ్యపి క్వచిత్ ప్రయుజ్యమానో దృశ్యతే, యత్ర వాక్యశేషవశాదసాధారణగుణశ్రవణాద్వా నిర్ధారితం బ్రహ్మ భవతి, యథా **“యదేష ఆకాశ ఆనన్దో న స్యాత్”** (తై.ఉ. 2.7) ఇతి **“ఆకాశో వై నామ నామరూపయోర్ని ర్వహితా తే యదన్తరా తద్బ్రహ్మ**” (ఛా.ఉ. 8.14.1) ఇతి చైవమాదౌ. అతః సంశయః. కిం పునరత్ర యుక్తమ్? భూతాకాశమితి. కుతః? తద్ధి ప్రసిద్ధతరేణ ప్రయోగేణ శీఘ్రం బుద్ధిమారోహతి. న చాయమాకాశశబ్దః ఉభయోః సాధారణః శక్యో విజ్ఞాతుమ్, అనేకార్థత్వప్రసంగాత్. తస్మాద్బ్రహ్మణి గౌణ ఆకాశశబ్దో భవితుమర్హతి. విభుత్వాదిభిర్హి బహుభిర్ధర్మైః సదృశమాకాశేన బ్రహ్మ భవతి న చ ముఖ్యసంభవే గౌణోఽర్థః గ్రహణమర్హతి,

సంభవతి చేహ ముఖ్యస్యైవాకాశస్య గ్రహణమ్. నను భూతాకాశపరిగ్రహే వాక్యశేషో నోపపద్యతే – "**సర్వాణి హ వా ఇమాని భూతాన్యాకాశాదేవ సముత్పద్యన్తే**" ఇత్యాదిః? నైష దోషః. భూతాకాశస్యాపి వాయ్వాదిక్రమేణ కారణత్వోపపత్తేః. విజ్ఞాయతే హి "**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః, ఆకాశాద్వాయుః, వాయోరగ్నిః**" (తై.ఉ.2.1) ఇత్యాది, జ్యాయస్త్వపరాయణత్వేఽపి భూతాన్తరాపేక్షయోపపద్యేతే భూతాకాశస్యాపి. తస్మాదాకాశ శబ్దేన భూతాకాశస్య గ్రహణమితి.

అను.95 : ఇది అంటున్నారు – "ఈలోకమునకేదిగతి? ఆకాశము అని చెప్పెను. ఈ సమస్త భూతాలు ఆకాశమునుండియే పుట్టును. ఆకాశములోనే లీనమగును. వీటికన్న ఆకాశమే పెద్దది. ఆకాశమే పరమగమ్యము" (ఛాం) అని. ఇక్కడ సందేహము. ఆకాశమనగా పరబ్రహ్మమా? లేక భూతాకాశమా? సందేహమెందుకు వచ్చింది? రెండర్థాలలోనూ ఈ శబ్దం వాడబడుతున్నది గదా! పంచభూతాలలో ఒకటయిన ఆకాశము అనేది లోకంలోనూ వేదంలోనూ ప్రసిద్ధమే. బ్రహ్మమునందు దానికి ప్రయోగం కనబడుతున్నది. అంతకుముందున్న వాక్యశేషం వలన గాని, ప్రత్యేక గుణాలు చెప్పటం వలన గాని 'ఆకాశం' అంటే బ్రహ్మం అనిపిస్తుంది. ఉదా॥ "ఆనందరూపమయిన యీ ఆకాశము లేకపోతే" (తై). "ఆకాశమనగా నామరూపనిర్వహణ కర్తగా నీలోపల నున్నదే అదే బ్రహ్మము" (ఛాం) ఇలాంటివాటిలో. అందుకే సందేహము. ఇందులో ఏది యుక్తము. భూతాకాశమనటం యుక్తము. ఎందుకని? అది ప్రసిద్ధం కనుక వెంటనే తేలికగా అర్థమవుతుంది. ఈ ఆకాశ శబ్దము రెండర్థాలలోను సమానంగా వర్తిస్తుందనటం కష్టము. అనేకార్థములు వచ్చే అవకాశం ఉంటుంది. కనుక బ్రహ్మం విషయంలో ఆకాశ శబ్దం గౌణంగా మాత్రమే 'బ్రహ్మం' ను చెప్తుంది. ప్రత్యక్షంగాకాదు. ఆకాశానికి బ్రహ్మమునకు సర్వవ్యాప్తి, అందకపోవటం మొదలగు చాలా పోలికలున్నాయి. ముఖ్యార్థం కుదిరేటపుడు గౌణార్థం గ్రహించరాదు. పైగా భూతాకాశం అనే అర్థం బాగా కుదురుతుంది గూడా. అయ్యా! భూతాకాశం అని అర్థం చెప్తే ఆ వాక్యంలో మిగిలిన భాగం కుదరదు. "సర్వభూతాలు ఆకాశం నుండియే పుడ్తున్నవి" మొదలయినది. – అది దోషం కాదు. భూతాకాశం వాయువు మొదలయిన వానికి కారణం గదా!. చూడండి "ఆ యీ ఆత్మనుండి ఆకాశము పుట్టెను. ఆకాశమునుండి వాయువు, వాయువు నుంచి అగ్ని(తై) అలాగే 'పెద్దది కావటం, పరమగమ్యం' కావటం అనేవి గూడా వాయువు మొదలగు ఇతరభూతాల దృష్ట్యా సరిపోతాయి. ఆకాశం ఇతరభూతాలకన్న పెద్దది. అవి అన్ని ఆకాశంలోనే లీనమవుతాయి. కనుక "ఆకాశం" అంటే "భూతాకాశమే" అనాలి. ✦ ... (సశేషం)

తెలుఁగు సమస్యలు - చమత్కారాలు

– డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు, గుంటూరు.

సమస్య : చెలువుగ రామలక్ష్మణులు సీతకుఁ దమ్ములు శంభుఁ డన్నయున్.
(రామలక్ష్మణులు సీతాదేవికి తమ్ములు, శివుఁడు అన్నయు అగుదురు)

పూరణము : చ. అలర గణింపఁ బంక్తిరథునాత్మజు లెవ్వరు? మైథిలుండు నే
లలనకుఁ దండ్రి? మన్మథునిలావుశరంబులు నేవి? కాళికా
చెలువునినామ మెద్ది? మఱి సీరియు శౌరికి నేమి కావలెన్?
జెలువుగ రామలక్ష్మణులు, సీతకుఁ, దమ్ములు, శంభుఁ, దన్నయున్.

ఈ సమస్యను పూరించిన విధానము ప్రశ్నము మఱియు సమాధానరూపములో నున్నది. కనుక వివరణము కూడ అదేవిధముగ చూపఁబడుచున్నది–

ప్రశ్నము	సమాధానము
1. పంక్తిరథుని (=దశరథుని) కొడుకు లెవరు?	రామలక్ష్మణులు
2. మైథిలుఁడు (=జనకుడు) ఏ స్త్రీకి తండ్రి?	సీతకు
3. మన్మథుని బలమైన బాణము లేవి?	తమ్ములు (=పద్మములు)
4. కాళికా (పార్వతీ) దేవి భర్త పేరేది?	శంభుఁడు
5. శౌరికి (=శ్రీకృష్ణునికి) సీరి (= బలరాముఁడు) ఏమి కావలెను?	అన్నయ్య

విశేషాలు : ముద్రణప్రతిలో ఈ పద్యంలోని తృతీయపాదంలో సీరికి శౌరియు నేమి కావలెన్? – అని ఉంది. చూ. 1953వ సంవత్సరపు వావిళ్ల ప్రతి. ఈ పాఠాన్ని నేను "సీరియు శౌరికి నేమి కావలెన్" అని దిద్దాను. కన్నయ్యకు బలరాముఁడే కదా! అన్నయ్య. ఇఁక "కాళికా చెలువుని" అన్న ప్రయోగం మన తెలుఁగు వ్యాకరణం ప్రకారం వైరిసమాసం. వ్యాకరణ దోషాలలో వైరిసమాసాలు ఒక భాగం. తెలుఁగు విభక్తి చేరని సంస్కృతశబ్దాన్ని తెలుఁగు పదంతో కలిపితే దాన్ని వైరిపదం లేక వైరిసమాస మని అంటారు. క్షీరార్ణవకూఁతురు, సంసారార్ణవయోడ, సీతాచెలువము, దశరథకొడుకు, మన్మథవిల్లు – ఇలాంటివి వైరిసమాసాలకు ఉదాహరణలు. వీటిలోని సంస్కృత శబ్దాలకు తెలుఁగు విభక్తులను చేర్చి క్షీరార్ణవము కూఁతురు, సంసారార్ణవమునునోడ, సీతచెలువము, దశరథునికొడుకు, మన్మథునివిల్లు – అని ప్రయోగిస్తే దోషాలు తొలఁగిపోతాయి. పై కాళికాచెలువుని నామము అనే దాన్ని కాళికచెలువునినామము అని సవరిస్తే వ్యాకరణదోషం పోతుంది గాని, ఛందోభంగమనే మహాదోషం వచ్చి కూర్చుంటుంది.

ఛందోభంగం న కారయేత్ (ఛందోభంగమును చేయరాదు) అని శాస్త్రకారులు హెచ్చరిస్తున్నారు. అంచేత మహాకావ్యాలు వ్రాసేటప్పుడు తగినన్ని జాగ్రత్తలు తీసుకోక తప్పదు. ఆశుకవితల్లోను, అవధానాల్లోను ఇటువంటివాటిని పెద్దగా పట్టించుకోవలసిన పనిలేదు. ఎందుకంటే వైరిసమాసాలు, వ్యావహారిక ప్రయోగాలు మొదలయినవి ఆశుకవితావిహారంలో అక్కడక్కడ ఎదురవుతుంటాయి. వాటిని తెలుసుకోవటంవఱకే మనపని. దారుణదోషాలుగా ప్రకటించటం మన పని కాదు.

మన అవధానివరేణ్యులు కొందఱు కొన్ని సమస్యలను ఇలాగే ప్రశ్న మఱియు సమాధాన క్రమంలో అన్వయించుకునేలా పూరించి చమత్కరించారు. ఆశుకవి కేసరి, మహీశూర (మైసూరు) మహారాజాస్థాన విద్వాంసుఁడు అయిన కీ॥శే॥ బ్రహ్మశ్రీ పిశుపాటి చిదంబరశాస్త్రి గారికి ఒకసారి –

"ప్రాజ్ఞగమందు శంభుఁడు సుభద్రను గూడఁగఁ బుట్టె గాంధియే"

అన్న సమస్య యెదురయింది. వెంటనే దానిని శ్రీ శాస్త్రిగారు చమత్కారభరితంగా ఇలా పూరించారు –

ఉ. రుజ్ఞలయం బినుం డుదయరోచి నెసంగు నెటన్? మతంగజ
త్వజ్ఞవవస్త్ర మెవ్వఁడు సదా ధరియించు? మహేంద్రసూతి యే
దృజ్ఞలినన్ రమింప నుదయించె ఘనుం డభిమన్యుఁ? డాంగ్లభూ
భుజ్ఞివహంబుతో నెదిరి పోర నెవండు జనించె నిద్ధరన్?
ప్రాజ్ఞగమందు – శంభుఁడు – సుభద్రను గూడఁగఁ – బుట్టె గాంధియే.
(చూ. పిసుపాటి చిదంబరశాస్త్రిగారి జీవితచరిత్ర–అవధానసాహిత్యము, పుట37)

అసలే దుష్కరప్రాసము, ఆపైన అడ్డదిడ్డపు సమస్య. ఇలాంటి సమస్యల నిచ్చినప్పుడు ఏదో సర్కసు చేసి అర్థాన్ని సరిపెట్టవచ్చునేమో కాని, ప్రాసవిలాసాన్ని సాధించటం మాత్రం తేలిక కాదు. సమగ్రవ్యాకరణబలముంటే తప్ప ప్రాసనిర్మాణం కుదరదు. శ్రీ చిదంబర కవీంద్రులకు సంస్కృతాంధ్రవ్యాకరణాలు కరతలామలకాలు కనుక దుష్కరప్రాసను కూడ సుకరంగా నిర్వహించి రమణీయపద్యసుధాకలశాన్ని నిర్మించారు. పనిలో పనిగా ఈ పద్యంలోని ప్రశ్నలు, సమాధానాలు తేలికపాటిభాషలో వ్రాసుకుని గుర్తుపెట్టుకుందామిలా–

1. సూర్యుడు ఎక్కడ ఉదయించును? – తూరుపుకొండమీఁద (ప్రాజ్ఞగమందు)
2. గజచర్మమును ఎవఁడు ఎల్లప్పుడు ధరించును? – శంభుఁడు
3. అర్జునుఁడు ఏ స్త్రీని కూడఁగా అభిమన్యుడు జనించెను? – సుభద్రను కూడఁగా

4. ఆంగ్లభూపతులను ఎదిరించి పోరుటకు ఈ లోకమున ఎవఁడు జనించెను? -గాంధియే.

సంస్కృతవ్యాకరణాన్ని సమాశ్రయించి - రుక్ + నిలయంబు = రుఙ్నిలయంబు, త్వక్ + నవవస్త్రము = త్వఙ్నవవస్త్రము, దృక్ + నలిన = దృఙ్నలిన, భూభుక్ + నివహంబు = భూభుఙ్నివహంబు - అనే పదాలను సాధించారు శాస్త్రిగారు. ఇంతేకాదు, రుక్, త్వక్, దృక్, భూభుక్ - అనే పదాలను స్వీకరించటంలో శ్రీ శాస్త్రిగారి సంస్కృతనిఘంటు పాండిత్యాన్ని కూడా చదువరులు గమనించవచ్చు. నాలుగు పాదాలలోనూ నాలుగు ప్రశ్నలు సంధించి నింపటంవల్ల సమస్యాపాదాన్ని అయిదవపాదంగా చేర్చుకోవలసి వచ్చింది. ఇందువల్ల ఇది పంచపాది అయింది. అంటే సమస్యా పాదం కాకుండానే నాలుగు పాదాలలో దుష్కరప్రాస నవలీలగా నిర్మించిన చిదంబరశాస్త్రులు వారి పాండిత్యబల మెంత గాఢమైనదో పద్యప్రియు లూహించుకోవచ్చు.

శాఖాచంక్రణమైనా ఇక్కడ ఒక్క విషయాన్ని నొక్కినొక్కి వక్కాణిస్తున్నాను. విద్వాంసులలో అగ్రగణ్యులు వైయాకరణులే (ప్రథమే హి విద్వాంసో వైయాకరణాః) అని ఆనందవర్ధనాచార్యుల వారు ధ్వన్యాలోకంలో వివరించారు. అంటే ఎంత శ్రమైనాపడి వ్యాకరణాలు బాగా నేర్వండి నాయనలారా! అని ఆనందవర్ధనుల హెచ్చరిక! వ్యాకరణాలు బాగా నేర్చినవారికి భాషా సాహిత్యాలతోపాటు ఇతర శాస్త్రాలు కూడా లొంగుతాయి. వ్యాకరణాల విషయంలో బద్ధకించిన వాళ్లను చూచి చిన్న చిన్న గ్రంథాలు కూడా పగలబడి నవ్వుతాయి. ఇప్పుడు చెప్పండి - మన విద్యాలయాలలోని సంస్కృతాంధ్రశాఖలలో నానాఁటికి వ్యాకరణాలను తగ్గించటం న్యాయమా? ఇది విద్యార్థులను శుంఠలుగా తయారుచేయటానికి పన్నిన కుట్ర కాదా? సారస్వతసమాజం చచ్చుపడి రసికులు తగ్గిపోవటానికి ఈ కుట్ర కారణం కాదా?

మఱొక్క మంచిమాట! పైవిధంగా ప్రశ్నలు, సమాధానాలు క్రమంగా పొందుపఱచిన సమస్యా శ్లోకాలు సంస్కృతంలో కూడా ఉన్నాయి. వాటి సంగతి సంస్కృతీయులు చూచుకుంటారులే అనుకున్నా, ఇలాంటి తెలుఁగు పద్యాలన్నీ ఒకే పుస్తకంలోకి తేవటం మాత్రం తెలుఁగువారి బాధ్యత. ✦

శ్రీ శంకరాచార్యకృతమ్
శ్రీవిష్ణుపాదాదికేశాంత స్తోత్రమ్

- వ్యాఖ్యాత - డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు, తిరుపతి.

శ్లో॥ యస్మాదాక్రామతో ద్యాం గరుడమణిశిలాకేతుదండాయమానాత్
ఆశ్చ్యోతంతీ బభాసే సురసరిదమలా వైజయంతీవ కాంతా ।
భూమిష్ఠో యస్తథాన్యో భువనగృహబృహత్స్తంభశోభాం దధౌ నః
పాతామేతౌ పయోజోదరలలితతలౌ పంకజాక్షస్య పాదౌ ॥ 12

ప్రతిపదార్థము : ద్యామ్ = అంతరిక్షాన్ని, ఆక్రామతః = పూర్తిగా పైన చివరివరకు (సత్యలోక పర్యంతం) ఆక్రమించి కొలిచే, గరుడమణిశిలాకేతుదండాయమానాత్ = గరుడ పచ్చలతో కూడిన ధ్వజస్తంభం వలె ఉండే, యస్మాత్ = ఏ శ్రీచరణం నుండి, ఆః చ్యోతంతీ = ప్రవహిస్తున్నది, అమలా = స్వచ్ఛమైనది, అయిన, సురసరిత్ = దేవనది అయిన మందాకిని, వైజయంతీ ఇవ = ధ్వజంవలె, కాంతా = మనోహరమైనదై, బభాసే = ప్రకాశిస్తున్నదో, తథా = ఆరీతిగా, భూమిష్ఠః = భూమిలో పొందికగా ఉండే, అన్యః = ఇంకొక, యః = ఏ శ్రీచరణం, భువనగృహబృహత్స్తంభశోభామ్ = బ్రహ్మాండమనే భవనం యొక్క పెద్ద స్తంభం వంటి శోభను, దధౌ = ధరిస్తున్నదో, ఏతౌ = ఈరెండు, పంకజాక్షస్య = పుండరీకాక్షుని, పయోజోదరలలితతలౌ = తామరయొక్క లోపలిభాగంవలె మృదువైన అరికాళ్ళను కల్గిన, పాదౌ = శ్రీచరణాలు, నః = మనలను, పాతామ్ = రక్షించాలి.

ఇందులో, సాక్షాత్ విష్ణుపాదాలను మూడు శ్లోకాలతో, పాదత్రయక్రమణంతో లోకాలను కొలిచిన శ్రుతి ప్రసిద్ధమైన త్రివిక్రమ విష్ణు క్రమణసంఖ్యాక్రమాన్ని ఆదరించి వర్ణిస్తున్నారు. "ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదమ్, సమూఢమస్య పాంసురే", "విష్ణో ర్నుకం వీర్యాణి ప్రవోచం యః పార్థివాని విమమే రజాంసి యో అస్కభాయదుత్తరం సతస్థం విచక్రమాణః త్రేధోరుగాయః" (త్రివిక్రమవిష్ణువు ఈ లోకాన్ని అంతటిని విశేషంగా తన పాదవిన్యాసాలతో కొలిచాడు. అపుడు మూడువిధాలుగా శ్రీచరణాలను పెట్టాడు. ఈ భగవానునియొక్క ధూళితోకూడిన పాదస్థానంలో లోకం అంతా కల్పివేయబడింది. సర్వస్వామి అయిన పరమపురుషునియొక్క వీరచరిత్రలను మిక్కిలి విస్తృతంగా పల్కుతున్నాను అని కవి అంటే, ఏ విష్ణువు పృథివితో చేరిన దానికి కింద వుండే ఏడు

లోకాలను సృష్టించాడో, ఏ విష్ణువు పుణ్యశాలురు చేరి ఉండే స్థానమైన గొప్ప లోకాలను సృష్టించాడో, గొప్పగా కీర్తింపబడే ఆ స్వామి మూడు రీతులలో ఈ లోకాన్ని కొలిచాడు) మొదలైన శ్రుతివాక్యాలు కవి హృదయంలో ప్రకృతంలో మెదులుతున్నాయి. "పాంసవః పాపపంకమ్"(10) అని మొదటలోనే పాంసుస్మరణం కల్గింది. భూమిలో ఉండే ధూళికణాలను ఒక్కటిని కూడా విడువకుండా శ్రీచరణం స్పృశించి కొలిచిన విజయం కవి స్మరణకు వచ్చింది. పాంసువులను వర్ణించి, తరువాత శ్రీచరణయుగాన్ని గూడ "యస్యామలం దివియశః ప్రథితం రసాయాం భూమౌ భూమౌ చ తే భువన మంగళ దిగ్వితానమ్, మందాకినీతి దివి భోగవతీతి చాధో గంగేతి చాత్ర చరణాంబుపునాతివిశ్వమ్" అనీ శ్రీచరణతీర్థం స్వర్గలోకంలో మందాకిని – అనే పేరుతో, పాతాళలోకంలో భోగవతి – అనే పేరుతో, ఇక్కడ గంగ – అనే పేరుతో జగత్తును అంతటిని పరిశుద్ధం చేస్తూ పై లోకంలో, భూమిలో, అధోలోకంలో నీ యశస్సురూపంలో వ్యాపించి, ఆకాశంలో, సకల దిక్కులలో ప్రకాశిస్తున్నది. అటువంటి నీ అద్భుతమైన గొప్పతనాన్ని ఏమని స్తుతించను?" అని నారదుడు సాశ్చర్యంగా శ్రీభాగవతం 10వ స్కంధం 70వ అధ్యాయంలో స్తుతించిన శ్లోకాన్ని స్మరించి, లోకాలను కొలిచిన వృత్తాంతంలోని ఆశ్చర్యాలను వర్ణిస్తున్నారు దండి మహాకవి దశకుమారచరితకావ్యారంభంలో –

శ్లో॥ బ్రహ్మాండచ్ఛత్త్రదండః శతధృతిభువనాంభోరుహోనాళదండః
క్షోణీనౌకూపదండః క్షరదమరసరిత్ పట్టికాకేతుదండః ।
జ్యోతిఃచక్రాక్షదండః త్రిభువనవిజయస్తంభదండోఽంఘ్రిదండః
శ్రేయస్త్రివిక్రమస్తే వితరతు విబుధద్వేషిణాం కాలదండః ॥

బ్రహ్మాండానికి అంతటికి నీడను ఇచ్చే గొడుగు వలె, పైన గొడుగువలె విస్తరించి, ఆ గొడుగును మోసే దండంగా, బ్రహ్మదేవుని ఉత్పత్తి స్థానం, వాసస్థానమైన భగవానుని నాభీకమలాన్ని ధరించే దండంగా, భూమి అనే నావకు చుక్కాని దండంగా, తన నుండి ప్రవహించే దేవనది అనే ధ్వజపటాన్ని ధరించే దండంగా, ఆకాశంలోని నక్షత్రాది జ్యోతిర్మండలచక్రానికి అక్షదండంగా, ముల్లోకాలను జయించిన విజయాన్ని సూచించే విజయస్తంభంగా, దేవతలకు విరోధులైన అసురులను వధించే కాలదండంగా వెలిగే త్రివిక్రమునియొక్క దండంవంటి అంఘ్రి మనకు శ్రేయస్సును ఇవ్వాలి– అని పల్కిన మంగళశ్లోకం ఇక్కడ స్మరణీయం. "చరణం పవిత్రం వితతం పురాణం, యేన పూతస్తరతి దుష్కృతాని, తేన పవిత్రేణ శుద్ధేన పూతాః, అతి పాప్మానమరాతిం తరేమ, లోకస్య ద్వారమర్చిమత్ పవిత్రం జ్యోతిష్మత్ భ్రాజమానం మహస్వత్, అమృతస్య ధారా బహుధా

దోహమానం చరణం నో లోకే సుధితాం దధాతు" అనే ప్రసిద్ధమైన శ్రుతి ఇక్కడ స్మరించదగినది. అనాది, ఎల్లప్పుడు నిత్యనూతనంగా హర్షాన్ని కల్గించేది, అంతటా వ్యాపించినది, తన స్పర్శతో, స్మరణతో అన్నిటిని పరిశుద్ధం చేసేది, భగవానుని చరణం, దానిచే పరిశుద్ధం చేయబడినవారు సకల దుష్కృతాలను దాటగలరు. అటువంటి స్వయంశుద్ధమైనది, తనను ఆశ్రయించినవారిని అందఱిని పరిశుద్ధం చేసే మహిమను కల్గినదైన భగవానుని శ్రీచరణంతో మనం పరిశుద్ధులమై, అంతులేని పాపమనే ఆ ప్రబల శత్రువును పోగొట్టుకొంటాముగాక!

మోక్షం పర్యంతం గల క్షేమాలను పొందడం కోసం ఆరాధించి, ఆశ్రయింపబడే ద్వారమైన ఆ చరణం జ్యోతిర్మయమై, జ్వలిస్తూ మోక్షానందం వంటి శాంతి సమృద్ధమైన ఆనందాన్ని, అపుడే ఈనిన లేగదూడకు తల్లి ఆవు అంతులేని స్నేహంతో పాలను స్రవించినట్లు స్రవించి వర్షిస్తూ, మనలను ఈ లోకంలోనే ముక్తులవలె ఆ ఆనందవర్షాన్ని తాగి ఆనందంతో ఉజ్జీవించేటట్లుగా తగిన సంవిధానాన్ని చేయాలి – అనేది ఈ శ్రుతి వాక్యాలకు అర్థం.

ఇక్కడ శ్రీచరణాల ధూళినుండి ఆరంభించి, రేఖలను వర్ణించి, మూడు శ్లోకాలలో శ్రీచరణాలను వర్ణిస్తున్నారు.

ద్యామ్ ఆక్రామతః ద్యౌః – అంటే అంతరిక్షం. ఇది స్వర్గాది ఊర్ధ్వలోకాలను తెల్పుతుంది. బ్రహ్మలోక పర్యంతం శ్రీచరణం ప్రసరించి, బ్రహ్మచే కమండలజలంతో ఆరాధింపబడినపుడు ఆ పాదాలనుండి దేవగంగ ప్రవహించింది. సురనది ప్రవహించిన విషయం ఇక్కడ వర్ణింపబడింది. దేవగంగకు మందాకిని అని పేరు. పైలోకాలను అన్నిటిని వ్యాపించి, కొలిచినది అని, కొంచెం కూడా బాహ్యప్రదేశం అనేది లేకుండా అంతటిని స్పృశించే రీతిలో స్వామిచరణం కొలిచింది – అనే విషయాన్ని "ఆఙ్" అనే ఉపసర్గ తెల్పుతున్నది. "రజాంసి విమమ్" అనే శ్రుతిలో ఒక్కొక్క ధూళికణాన్ని తాకి కొలిచింది – అని తెల్పిన భావాన్ని ఇక్కడ "ఆ" అని అనడం ద్వారా తెలిపారు.

గరుడమణిశిలాకేతుదండాయమానాత్ – భగవానుని ఉన్నతమైన, నల్లని వర్ణంలోని పాదం గరుడపచ్చ అనే మరకతమణినిర్మితమైన స్తంభంవలె గోచరిస్తున్నది.

ఆక్రామతః – ఈ పదానికి పూర్ణసరస్వతి – శ్రీచరణం పైకి వ్యాపించి పైలోకాలను కొలిచేటపుడే – అని భావమని తెలిపారు. అపుడే బ్రహ్మలోకానికి వెళ్ళాడు, తెల్లని జలాలతో దానినుండి ప్రవహించి, ఆకాశంలో వేగంగా పరుగుతీసేటపుడు అది ఆకాశం అంతటిని

వ్యాపించే తెల్లని కీర్తి ధ్వజపటంవలె కన్పించింది.

"ధాతుః కమండలుజలం తదురుక్రమస్య పాదావనే జనపవిత్రతయా నరేంద్ర!, స్వర్ధున్య భూన్నభసి సా పతతీ నిమార్ష్టి లోకత్రయం భగవతో విశదేవ కీర్తిమ్" ఓ పరీక్షిన్మహారాజా! బ్రహ్మదేవుని కమండలం నుండి త్రివిక్రముని పాదాన్ని పూజించడం కోసం సమర్పింపబడిన పాద్యమనే తీర్థం దేవగంగానదీరూపంలో ఆకాశంలో ప్రవహించి మూడులోకాలను భగవానుని తెల్లని విశుద్ధమైన కీర్తియొక్క రూపంలో శుద్ధిచేస్తున్నది – అని శ్రీభాగవతం 8వ స్కంధం 21వ అధ్యాయంలో తెలుపబడింది. బ్రహ్మలోకపర్యంతం వ్యాపించిన ఈ మరకతమణిస్తంభాన్ని భగవంతుని పాదాల విజయకీర్తిధ్వజాన్ని ధరించే స్తంభంగా ఇక్కడ వర్ణిస్తున్నారు.

కేతువంటే ధ్వజం. పైన ఆకాశంలో ధ్వజం విస్తరిస్తుంది. పైన ఎగిరే ధ్వజాన్ని ధరించే స్తంభం వలె ఉన్నతంగా ఎదిగిన పాదం కన్పిస్తున్నది. ఇక్కడ ధ్వజం – ఆకాశంలో తెల్లని నురుగుతో ఆకాశం అంతటా వ్యాపిస్తూ ప్రవహించే దేవగంగానది. దానిని ఇక్కడ "సురసరిత్" అని వర్ణించారు. వైజయంతీ – అనే పదం ప్రకృతంలో ధ్వజాన్ని తెల్పుతుంది. ఆకాశంలో ఉన్నతంగా ఎదిగిన నీలమణిస్తంభనామంతో గంగానదీ ప్రవాహమైన తెల్లని ధ్వజం దిక్కులలో వ్యాపించడం వర్ణసామ్యంతో చాలా అందంగా ఉన్నదనే విషయాన్ని "కాంతా" అనే పదం ద్వారా సూచిస్తున్నారని పూర్ణసరస్వతీవ్యాఖ్య. వేఱొక పాదం ఏ అద్భుతాన్ని దర్శింపజేస్తున్నది? అంటే, "తథా" అనే పదం ద్వారా "ఆవిధంగానే, ఆ అద్భుతరీతిలోనే" అని అంటూ సూచిస్తున్నారు. సమస్త లోకమనే గొప్ప గృహాన్ని భరించే పెద్ద స్తంభంవలె ఇంకొక పాదం ఉన్నది.

ఈవిధంగా, "ఏతౌ" – పూర్వం తెల్పిన ఈ రెండు శ్రీచరణాలు కలసి మనకు మంచిని కల్గించాలి. వేర్వేరుగా ఉండే రెండు చరణాలను ఒక జంటగా చేర్చి ధ్యానంలో కవి గ్రహిస్తున్నారు. "పయోజోదరలలితతలౌ" తామరపూవులోని లోపలి భాగంవలె అతి సుకుమారమైన అరికాళ్ళను కల్గినది. "పంకజాక్షస్య పాదౌ" – పుండరీకాక్షుని పుండరీకాలవంటి శ్రీపాదాలు – అని ధ్యేయం, విశేష్యమైన పాదాలను శ్లోకోపసంహారంలో మార్చడం సరసం. "పంకజాక్ష" పదం ద్వారా ఆ పాదాలను, తనను వలెనే, ధ్యానం చేసేవారిని వికసించిన తామరలవలె చల్లగా కటాక్షించే సేవను అనుగ్రహించడం సూచిస్తున్నారు. "గరుడమణిశిలాకేతుదండాయమానాత్" అనేదానిలో కూడా గరుడ ధ్వజుడైన భగవానుని యొక్క గరుడుని స్మరణను ధ్వజంగా ఈ సందర్భంలో కల్గించి భగవానుని ధ్వజంగా గరుడుడు ఉన్నట్లే, శ్రీచరణానికి దేవగంగ యొక్క తెల్లని ప్రవాహం

ధ్వజమనే స్వారస్యాన్ని సూచించడంలో కూడా కవికి ఉద్దేశ్యం ఉన్నది. మేఘసందేశంలోని మొదటి సర్గలోగల 57వ శ్లోకంలో ఉత్తరదిక్కులో పయనించవలసిన మేఘాన్ని ఉద్దేశించి "తేనోదీచీం దిశమనుసరేః తిర్యగాయామశోభీ శ్యామః పాదః బలినియమనాభ్యుతస్యేవ విష్ణోః" (బలిచక్రవర్తిని అణచడానికి ఎత్తిన దీర్ఘమై విస్తరించి శోభిల్లే విష్ణుపాదంవలె నల్లని వర్ణంతో ప్రకాశించేవాడవై ఉత్తర దిక్కులో పయనించు) అనే మహాకవి వచనం కూడా కవిమనస్సులో ఉన్నది. కాళిదాసు రఘువంశంలో "హరిర్యదైకః పురుషోత్తమః స్మృతః" అని పల్కడం, "అతోఽ స్మి వేదే లోకే చ ప్రథితః పురుషోత్తమః" అని గీతలో 15వ అధ్యాయంలోని భాష్యంలో సూచింపబడింది. అందువల్ల కాళిదాసగ్రంథాలు మన పూర్వాచార్యులకందటికీ ముఖస్థాలే. ఆకాశంలో దీర్ఘంగా, అడ్డంగా శ్రీచరణం శోభిల్లుతూ ఉండటం ధ్వజంగా శోభిల్లుతున్నట్లున్నది. శ్రీచరణం విజయప్రస్తావం, ధ్వజం ఆకాశంలో ఎగురుతూ వ్యాపించడానికి పొసగుతుంది. శ్రీదేశికులు దశావతార స్తోత్రంలో **"యత్ ప్రస్తావసముచ్ఛ్రితధ్వజవీటీ వృత్తాంత సిద్ధాంతిభిః, స్రోతోభిః సురసింధురష్టసు సుధాసౌధేషు దోధూయతే"** అని అంటూ మహాబలియొక్క ఔదార్యాన్ని చూచి ఆశ్చర్యాన్ని పొంది, అతని ఔదార్యగుణకీర్తిని దేవనది ఎనిమిది దిక్కులలో ఉన్నతంగా తెల్లనినురుగుతో కూడిన ప్రవాహంతో వ్యాపిస్తూ ప్రథితం చేస్తున్నదని వర్ణించడంకూడా ఇక్కడ భావ్యం. ✦ ... (సశేషం)



అన్నమాచార్య సంకీర్తనామృతము (8)

– డా॥ సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి.

అవతారిక : రక్తితో జేయు పరసేవకంటె విరక్తితో జేయు హరిసేవ మేలనుచున్నాడు.

శ్రీరాగం

చాలునిదే నా విరతి – సకల సామ్రాజ్యము
నాలోని పని యెంతై – నా నాకుఁగలదు. ॥పల్లవి॥

1. వడఁబడి పరులిండ్ల – వాకిలి గాచే నేను
వడి నాలో హరియున్న – వాకిలి గాచేను,
బడి నొకరిఁగొలిచి – బహురాజ్యమేలే నేను
యెడ నా మనోరాజ్య – మింతా నేలేను. ॥చాలు॥

2. చేరి యొరులకుఁబని – సేసి యలసే నేను
సారె నా యోగాభ్యా – సాన నలసేను,
ఆరసి నే నడుగఁగ – నన్యు లిచ్చే యీవులు
తారి పూర్వకర్మాది – దైవమే యిచ్చీని. ॥చాలు॥

3. అందు సంతోషమే ఫల – మిందు సంతోషమే ఫల
మందును మాయాకల్పిత – మిందును మాయే,
అందు నిందు శ్రీ వేంక – టాధీశుఁడే కర్త
అంధైతేఁ బరతంత్రు – డిందునే స్వతంత్రుఁడ. ॥చాలు॥

ప॥ : విరతి = వైరాగ్యము, .

1. వడబడి = శ్రమపడి. 2. ఈవులు = త్యాగములు, దానములు : తారి = సమీపించి.

భావము : నా వైరాగ్యమే నాకు సకలవిధ సంపదలతోగూడిన సామ్రాజ్యమై యున్నది. ఇదే నాకు చాలును. ఇతరరాజ్యములతో నాకు పనిలేదు. విరక్తుడనై నివృత్తిమార్గమున నడచు నేను నాకై నాలో జేసికొనవలసిన పని (ఆత్మవిచారము) ఎంతో కలదు.

ఇంతవరకు సంసారమే శాశ్వతమని భ్రమించి ఎంతో శ్రమించి ఇతర మానవుల యిళ్ళు వాకిళ్ళు గాచుచుంటిని. ఇప్పుడు నాకు జ్ఞానోదయమైనది. నా వైరాగ్య సామ్రాజ్యముయొక్క గొప్పతనమును గుర్తించితిని, నాలో అంతరాత్మగా నున్న పరమాత్మను గ్రహించితిని. ఆయనకు నివాసమైన హృదయమునే ఇప్పుడు లక్ష్యము జేసికొని కాచుకొని యున్నాను. ఇంతదనుక ఇతరులను సేవించి వారి రాజ్యము లేలుచుండిన నేను నాలోని

మనోరాజ్యమునే ఇప్పుడు పాలించుచున్నాను. ఇతరులకు పలుతెరగుల చాకిరిజేసి అలసిపోవుచుండిన నేను ఇప్పుడు చిత్తవృత్తి నిరోధాత్మకమైన నా యోగాభ్యాసముతోనే అలసిపోవుచున్నాను. నేను యాచింపగా ఇంతవరకు ఇతరులు నా కొసగుచుండిన సంపదలు ఇప్పుడు నా పూర్వకర్మాత్మకమైన దైవమే తనకు తానుగా ఇచ్చుచున్నది.

ఇంతవరకు నేను చేయుచుండిన పనికి ఫలము సంతోషమే. ఇప్పుడు నేనొనర్చు పనికి గూడ ఫల మదే. అదియు హరిమాయచే కల్పితమే. ఇది కూడా హరిమాయా విలాసమే. ఆ ప్రవృత్తిమార్గమునకును, ఈ నివృత్తిమార్గమునకును కర్త శ్రీ వేంకటేశ్వరు డొక్కడే. కాని ఆ మార్గములో నున్నంతవరకు నేను పరతంత్రుడనై యుంటిని. ఈ త్రోవలో కాలిడినతర్వాత స్వతంత్రుడనైతిని.

విశేషాంశములు : ప్రవృత్తిమార్గమునకును, నివృత్తిమార్గమునకును గల భేద మిచట నిరూపింపబడినది. పరసేవచే జీవించు ప్రవృత్తిమార్గస్థుడగు సంసారి సేవాధర్మము నాశ్రయించి పరతంత్రు డగుచున్నాడు. పరతంత్రవృత్తి దుఃఖభూయిష్ఠమైనది.

సేవాధర్మ మెంత గహనమైనదో చెప్పుచు భర్తృహరి యిట్లనెను.

మౌనాన్మూకః ప్రవచనపటుర్వాచకో జల్పకో వా
ధృష్టః పార్శ్వే భవతి చ వసన్ దురతోఽ ప్యప్రగల్భః ।
క్షాన్త్యా భీరుర్యది న సహతే ప్రాయశో నాభిజాతః
సేవాధర్మః పరమగహనో యోగినా మప్యగమ్యః ॥

దీని భావమిది :- మౌనముగా నున్నచో మూగ యనియు, పటువుగా మాట్లాడినచో ప్రేలరియనియు, దగ్గరగా నున్నచో దిట్టయనియు, దూరముగా నున్నచో ప్రగల్భుడు గాడనియు, ఓర్పుతో నున్నచో భీరువనియు, ఓర్మిలేనిచో అభిజాతుడు గాడనియు సేవకుని ప్రభువులు నిందింతురు. కాన సేవాధర్మము మిగుల గహనమైనది. యోగులకు గూడ అగమ్యమైనది. విరక్తు డితరులపై ఆధారపడడు. అతడు తనలో అంతరాత్ముడైన హరిని మాత్రమే నమ్మును. కాన ఇతడు స్వతంత్రుడు. స్వతంత్రవృత్తి సుఖావహమైనది. సేవకుడుగూడ సంతోషమును గోరియే ఒరుల సేవించుచున్నాడు. కాని పరతంత్రుడై పడయు సుఖము నిజమైన సుఖము గాజాలదు. లోకములో సమస్తవస్తువులు భయముతో గూడినవి. వైరాగ్యమొక్కటే నిర్భయమైనదని భర్తృహరి నుడివెను.

సర్వం వస్తు భయాన్వితం భువి నృణాం వైరాగ్యమేవాభయమ్ ॥

మరియు ప్రవృత్తి, నివృత్తి మార్గములు రెండును హరిమాయావిలసితములే. కాని హరిని నమ్మినవాడు పరమపదముచేరి శాశ్వతసుఖము నొందును. నరుని నమ్మిన వాడు క్షణికభోగము లనుభవించినను చావుపుట్టుకల క్లేశమునుండి తప్పించుకొనలేడు. కాని విరక్తుడైన హరిసేవాపరుని మార్గమే శ్రేష్ఠమైనది. ✦... (సశేషం)

శ్రీమతే రామానుజాయనమః
శ్రీమదప్పయ్యదీక్షితేన కృతః

వరదరాజస్తవః

వ్యాఖ్యాత - డా॥ కె. లక్ష్మీనారాయణ, నెల్లూరు.

ఊరుసౌందర్యము సాటిలేనిది

శ్లో॥ ఊరోః కిమన్యదయతాముపమానభావం
వామస్య దక్షిణమముష్య చ తం విహాయ ।
రమ్భాదయస్సదృశ ఇత్యుచితం కిమేతత్
యస్యోర్వశీ సుభగ! సాஉపి విభూతిలేశః ॥ 56

ప్రతిపదార్థము : సుభగ! = సుందరమైన దివ్యరూపముగల వరదరాజస్వామీ!, ఊరోః = నీ ఊరువునకు (తొడభాగమునకు), వామస్య ఊరోః = నీ ఎడమ ఊరువునకు, దక్షిణమ్ = కుడి ఊరువును, విహాయ = విడచి, అముష్య చ = దానికిని (కుడి తొడభాగమునకు), తమ్ = దానిని (ఎడమతొడభాగమును), విహాయ = విడచి, అన్యత్ కిమ్ = మఱియొక ఏ వస్తువు, ఉపమానభావమ్ = పోలికగా నుండుటను, అయతామ్ = పొందును? యస్య = ఏ ఊరువునకు, సా = ప్రసిద్ధురాలైన, ఊర్వశీ అపి = ఊర్వశియను అప్సరః కాంత కూడ, విభూతిలేశః = నీ సంపదలో చిన్న అంశము మాత్రమే అయి ఉన్నదో అట్టి ఊరువునకు, రమ్భా + ఆదయః = అరటిబోదె మొదలైనవి, సదృశః = సమానమైనవి, ఇతి ఏతత్ = అనెడు ఈ మాట, ఉచితం కిమ్ = తగునా ఏమి?

తాత్పర్యము : సహజసుందరుడైన వరదరాజస్వామియొక్క కుడి, ఎడమ ఊరువులు సౌందర్యమున ఒకదానితో నొకటి పోల్చుటకు మాత్రమే తగియున్నవి గాని, వాటికి సాటియైనది మఱియొకటి లేదు. అప్సరస్త్రీలలో అత్యంత సౌందర్యవతిగా పురాణములలో ప్రసిద్ధురాలైన ఊర్వశికూడ శ్రీమన్నారాయణుని విభూతులలో (సంపదలలో) ఒక చిన్న భాగమే అయి ఉన్నదికదా! అట్టి స్థితిలో భగవానుని ఊరువులకు రంభాదులను (అరటిబోదెలు మున్నగువాటిని) ఉపమానములుగా చెప్పుట యుక్తము కాదు. స్వామి ఊరుయుగళము అనుపమ సౌందర్య విభ్రాజమానమని భావము.

తత్త్వవేది : శ్రీ వేంకటేశ్వరస్వామియొక్క దివ్యచరణారవిందద్వంద్వమును ప్రస్తుతిస్తూ ప్ర॥భ॥ అణ్ణన్‌స్వామివర్యులు "ప్రాప్తౌ పరస్పరతులామతులాన్తరౌ తే శ్రీవేఙ్కటేశ! చరణౌ శరణం ప్రపద్యే" - స్వామీ! నీ శ్రీపాదములు ఒకదానికి మఱియొకటి తప్ప, వాటికి సాటియైనది ఇంకొకటి లేదని కీర్తిస్తారు. ఆ క్రమంలో శ్రీదీక్షితులు వరదరాజుని సుందరములైన ఊరువుల సొగసు అసమానమైనదని అభివర్ణిస్తున్నారు.

యస్య సా ఊర్వశీ అపి విభూతిలేశః : ఊర్వశియంతటి సౌందర్యవతి సైతము శ్రీమన్నారాయణుని సంపదలో ఒక చిన్నభాగము మాత్రమే. "సా" అను పదము ప్రసిద్ధిని తెలుపుచున్నది. అతిలోకసౌందర్యనిధులైన అప్సరస్త్రీలందరిలోను అత్యంత సౌందర్యవంతురాలిగా పురాణములలో పేర్కొనబడుటచే ప్రసిద్ధురాలైనదని భావము.

"పాదోఽస్య విశ్వా భూతాని, త్రిపాదస్యామృతం దివి" - (పురుషసూక్తం) అని శ్రుతి ప్రవచించిన విధముగా భగవానుని విభూతులు రెండు. 1. లీలావిభూతి, 2. నిత్యవిభూతి. "త ప్రజాస్సృజేయేతి" - ఛాం.6.2.3 అని ఉపనిషత్తు చెప్పినట్లు, పరమాత్మయొక్క లీలారూపమైన సంకల్పముచే జీవుల కర్మలననుసరించి ఏర్పడిన పాంచభౌతికమైన బ్రహ్మాండజాలమంతయు లీలావిభూతి. ఈ బ్రహ్మాండ సముదాయ మంతయు భగవద్విభూతిలో పాతిక భాగము, కాగా, మిగిలిన ముప్పాతిక భాగము నిత్యవిభూతి. అనగా "తమసః పరస్తాత్" అని చెప్పబడినట్లు విరజానదికి ఆవలనున్న పరమ ప్రాప్యమైన పరమపదము. ఈ సమస్తము 'అజో నిత్యశ్శాశ్వతోఽయం పురాణః' అని వేదమాత ప్రస్తుతించిన పురుషోత్తముని నుండి ఉద్భవించిన ఆయన సొత్తు. కనుక, జగత్తులోని సకల చరాచరములు అయన సంపదలోని అల్పాంశములే. ఈ క్రింది భాగవతసూక్తి ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది-

శ్లో॥ యస్య బ్రహ్మాదయో దేవా వేదా లోకాశ్చరాచరాః ।
నామరూపవిభేదేన ఫల్గ్వ్యాచ కలయా కృతాః ॥ - భాగ.8.3.22

- బ్రహ్మాదిదేవతలు, వేదములు, లోకములు, చరాచరములు కూడ అత్యల్పమైన అంశములతోనే ఆయా నామరూపములు కలవారుగా సృజింపబడినారు. జగత్తు సకలము ఆయన అంశముల సముదాయమేనని భావము. ఆచార్యయామునులు దీనిని మఱింత విశదీకరిస్తారు తమ స్తోత్రరత్నంలో-

శ్లో॥ "కస్యాయుతాయుతశతైకకలాంశకాంశే ।
విశ్వం విచిత్రచిదచిత్ప్రవిభాగవృత్తమ్ ॥" -12

- ఆశ్చర్యకరమైన బహువిధ స్వరూపరూపములుగల చేతనాచేతనములతో నిండియున్న ఈ విశ్వమంతయు పురుషోత్తముని వేలకోట్ల అంశములలో ఒకానొక అంశమువలననే ఏర్పడినది.

లోకంలో సుసంపన్నములైన ద్రవ్యములన్నియు తన తేజస్సుయొక్క అంశము వలననే సంభవించునని కృష్ణపరమాత్మ స్వయముగా ఇట్లు ప్రబోధించినాడు-

శ్లో॥ యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।
తత్తదేవావగచ్ఛత్వం మమ తేజోఽంశసమ్భవమ్ ॥ భ.గీ.10.41

ఇట్లు అప్సరఃకాంతలలో శ్రేష్ఠురాలైన ఊర్వశి భగవద్విభూతిలో ఒక చిన్న భాగము మాత్రమే అనుట యుక్తము.

ఊర్వశీ వృత్తాంతము శ్రీమద్భాగవతమున ఇట్లు ప్రసక్తమైయున్నది. వైకుంఠవాసుడు తానే నారాయణ, నరరూపములతో గురువుగను, శిష్యునిగను అవతరించి బదరికాశ్రమమునందు తపస్సు చేసికొనుచు యోగనిష్ఠుడైయున్నాడు. ఆయనయొక్క తపోనిష్ఠను భగ్నము చేయవలెనని ఇంద్రుడు రంభ మున్నగు అప్సరోభామినులతో వెడలినాడు. రంభాదులు బదరికాశ్రమమునందు విహరించుచు తమ రూపవిభ్రమ విలాసాదులతో శ్రీహరి మనస్సును చంచలమొనర్చుటకు పూనుకొన్నారు.

శ్లో॥ విజ్ఞాయ శక్రకృతమక్రమమాదిదేవః
ప్రాహ ప్రహస్య గతవిస్మయ ఏజమానాన్ ।
మాభైష్ట భోమదన! మారుత! దేవవధ్వో!
గృహ్ణీత నో బలిమశూన్యమిమం కురుధ్వమ్ ॥ భాగ. 11.4.8

– ఇంద్రుని ప్రయత్నమును గమనించిన ఆదిదేవుడైన దామోదరుడు తనను చూచి భయముతో వణికిపోవుచున్న వారందరితో నవ్వుచు ఇట్లు పలికినాడు – ఓ మన్మథా! ఓ మలయపవనుడా! దేవకాంతలారా! భయపడకండి. మీరు నా అతిథులు. మీరు నా ఆతిథ్యాన్ని స్వీకరించి దీనిని సార్థకం చేయండి, అని అందరితో పలికినాడు.

ఇంద్రాదులు సిగ్గుతో తలలు వంచుకొని శ్రీహరిని పలువిధాలుగా కీర్తించారు. పిమ్మట వారికి సేవచేయుచున్న అద్భుతసౌందర్యమూర్తులైన తరుణీమణులను పలువురను దర్శింపజేసినాడు. వారి రూపసంపదకు అచ్చెరువొందిన దేవతాగణమంతయు మోహ పరవశమైనది. అపుడు మాధవుడు వారితో – ఓయీ! మీరు వీరిలో ఒక సుందరిని వరించి మీతోపాటు దేవలోకమునకు తీసికొని వెళ్ళండి – అని అనుగ్రహముతో పలికినాడు.

శ్లో॥ "ఊర్వశీమప్సరశ్శ్రేష్ఠాం పురస్కృత్య దివం యయుః ।" –భాగ. 11.4.15

– అప్సరఃకాంతలందిరలో శ్రేష్ఠురాలైన ఊర్వశిని దేవతలు తమతోపాటు అమరావతికి తీసికొని వెళ్ళినారు.

మఱియు ఊర్వశి శ్రీమన్నారాయణుని దివ్యదేహమునుండి సాక్షాత్తుగా ఉద్భవించినట్లు దేవీభాగవత పురాణము వివరించుచున్నది –

రంభాదుల ప్రయత్నమును గ్రహించిన రమాపతి వారి సౌందర్యగర్వమును అణచుటకై చేతిగోటితో తన తొడను మీటినాడు. వెంటనే ఆయనయొక్క ఊరువునుండి లోకోత్తర సౌందర్యంతో విరాజిల్లే రూపవతియైన ఒక యువతి ఉద్భవించినది. ఊరువు

నుండి జనించుటవలన ఆమె **ఊర్వశి** అను పేరు పొందినది. తాను పంపిన సుందరీమణులను తలదన్నే అద్భుతసౌందర్యరాశిని ఆవిర్భవింపజేసిన భగవానుని మహత్త్వమును, సర్వకారణత్వమును, సకలవిభూతిమత్త్వమును తెలిసికొన్న ఇంద్రుడు తాను చేసిన అకృత్యమునకు సిగ్గుపడి ఆయనకు ప్రణమిల్లినాడు. తదుపరి, శ్రీహరి తాను ఉద్భవింపజేసిన అందాలబరిణెను కూడ ఇంద్రునికి కానుకగా యిచ్చినాడు. ఇట్లు ఒప్పులకుప్ప అయిన ఊర్వశి భగవానుని విభూతులలో చిన్నపాటి భాగమై యున్నదనుట వలన ఆమెకు ప్రభవస్థానమైన దేవదేవుని ఊరువులయొక్క అనుపమ సౌందర్యమెట్టిదో వివరింప నవసరములేదని భావము.

మఱియు, "కారణగుణాః కార్యే సఙ్క్రామన్తి" అను న్యాయమును బట్టి, కార్యభూతురాలైన ఊర్వశియే అసమాన సౌందర్యముతో విలసిల్లుచున్నందున ఆమెకు జన్మహేతువైన స్వామి ఊరువు సౌందర్యఖనియని గ్రహింపవలెనని తాత్పర్యము.

రమ్భాదయః : పరమసౌందర్యవతియైన ఊర్వశియే పద్మనాభుని నుండి ఉద్భవించిన విభూతులలో ఒకటి అగుటవలన అంతకన్న తక్కువవారైన రంభాది అప్సరః కాంతలను వరదుని ఊరువుతో ఉపమించుట ఉచితము కాదు. ఇట్లు చెప్పుట – నానార్థకమైన రంభాశబ్దమునకు ఊర్వశీశబ్దసాన్నిధ్యముచే అప్సరస్త్రీ అను అర్థమును గ్రహించుటవలన ఏర్పడిన చమత్కారాభాసము మాత్రమే. రంభాద్యప్సరఃకాంతలతో ఊరువులకు సాదృశ్యము ఉచితము కాదనుట సర్వసమ్మతమే.

ఇక ప్రకరణముననుసరించి యిచట రంభాదిశబ్దమునకు అరటిబోదెలు మున్నగునవి యని చెప్పుటయే కవిహృదయమని భావింపనగును. ఆదిశబ్దమే ఏనుగు తొండము మొదలైనవాటిని ఉపమానవస్తువులుగా గ్రహించవచ్చును. కదళీకాండము, గజతుండము ఊరువులకు ఉపమానములనుగా చెప్పుట కవిలోక సంప్రదాయము.

పై రెండును పార్వతీదేవియొక్క సుందరోరువులకు ఉపమానములు కావని కవికులగురుని ఈ శ్లోకరత్నము నిచట గుర్తుచేసికొనవచ్చును –

శ్లో॥ నాగేన్ద్రహస్తాస్త్వచి కర్కశత్వాత్ ఏకాన్తశైత్యాత్ కదలీవిశేషాః ।
లబ్ధ్వాఽపి లోకే పరిణాహి రూపం జాతాస్తదూర్వోరుపమానబాహ్యాః ॥

– కుమార. 1. 36.

– ఏనుగు తొండములు, అరటిబోదెలును, వృత్తాకారముగలవియే అయినను గరుకుతనము వలన, చల్లదనము వలనను పార్వతీదేవి ఊరువులకు ఉపమానములు కాజాలకున్నవి.

✦ ... (సశేషం)

'ఇరేనాసెండ్లర్'

రెండవ ప్రపంచయుద్ధ సమయంలో నాజీల బారి నుండి యూదు బాలలను కాపాడటమేకాక, ఎప్పటికైనా ఆ బాలలు తమ కుటుంబాలను కలుసుకునే అవకాశం ఉండొచ్చని భావించి, వారి అసలు పేర్లు, కొత్త పేర్లు వివరాలతో కచ్చితమైన రికార్డ్‌ను తయారుచేసి దాచిపెట్టిన **'మహిళా షిండ్లర్'** ఇరేనా సెండ్లర్. రెండవ ప్రపంచ యుద్ధం సృష్టించిన భయోత్పాతాల నుండి వెలువడిన అత్యంత విశిష్ట, ఉదాత్త వ్యక్తులలో ఆమె ఒకరు. ఆమె పిల్లలను సూట్‌కేస్‌లలో, అంబులెన్స్‌లలో, శవపేటికలలో, మురుగు గొట్టాలలో, పెద్ద సంచులలో, ఇంకా పనిముట్ల పెట్టెలలో దాచి, నాజీల కన్నుకప్పి రవాణా చేసింది. ఊహ తెలిసిన పిల్లలకు వారి రక్షకురాలు **'జొలాంటా'** అని ఎరుగుదురు. ఇది ఇరేనా సెండ్లర్ సంకేత నామం.



రెండవ ప్రపంచయుద్ధ సమయంలో ఆమె వేలాది మంది యూదు బాలలను కాపాడింది. కానీ, ఇటీవలి వరకు ఆమె కనపరచిన అసాధారణ దయాళుత్వం, ధీరోదాత్తత ఏ మాత్రం గుర్తింపుకు నోచుకోక మరుగునపడి ఉండిపోయాయి. చివరకు జర్మన్‌లు ఆమెను నిర్బంధించే నాటికి, ఆ రోమన్ కేథొలిక్ సామాజిక కార్యకర్త 2,500 మంది యూదు శిశువులను, పిల్లలను ఏకాగ్రతా శిబిరాలకు పంపబడకుండా కాపాడగలిగింది. భారీ బందోబస్తు మధ్య కావలికాయబడుతున్న వార్సాలోని యూదుల నివాస ప్రాంతం నుండి బయటకు తెచ్చి, వారి ఆనవాళ్లను రెండు గాజు జాడీలలో గోప్యంగా దాచి, తన పొరుగువారి తోటలోని యాపిల్ చెట్టు క్రింద పూడ్చి పెట్టింది.

ఆమెను గెస్టపో (నాజీల జర్మనీలోని తీవ్రవాద పద్ధతులకు పేరెన్నికగన్న రహస్య పోలీస్ వ్యవస్థ) వారు కొట్టారు. ఆజన్మాంత శిక్ష విధించారు - మరణశిక్ష కూడా ప్రకటించారు. కానీ, ఇరేనా తన స్థైర్యాన్ని కోల్పోకుండా, రహస్యాలు బహిర్గతం కాకుండా జీవించింది. ఆమె 2008లో వార్సాలోని తన అతి సాధారణమైన అపార్ట్‌మెంట్‌లో తన 98వ ఏట మరణించింది. ఎటువంటి మహిళ ఆమె? ఆమెకు పొగడ్తలంటే గిట్టేవికావు కానీ, ఆమెను 'ధీరోదాత్తురాలు' అంటే అది ఏ మాత్రం అతిశయోక్తి కాదు. మతం,

దేశం వంటి వాటితో సంబంధం లేకుండా కష్టాలలో ఉన్నవారిని రక్షించటమే మన కర్తవ్యం అనే భావంతోనే తనను పెంచారని ఆమె చెప్తూండేది. 'ధీరోదాత్తురాలు' అనే పదం అంటే తనకు చికాకు అని, దానికి వ్యతిరేక పదమే వాస్తవమని అంటుండేది. తాను చేయవలసినంత చేయలేదని తనను తన మనస్సాక్షి వేధిస్తూంటుందని అంటుండేది. తనలో ఎల్లప్పుడూ రగులుతూండే మంచి చేయాలనే తపనకు తన తల్లిదండ్రులు, ముఖ్యంగా వార్సా సమీపంలోని ఒక చిన్న బస్తీలో పోలిష్ వైద్యుడైన తన తండ్రి నుండి సంక్రమించిందని అంటుండేది. ఆయన రోగులలో అత్యధికులు నిరుపేద యూదులు. ఇరేనాకు ఇరవై ఏడేళ్ల వయసప్పుడు ఆయన టైఫస్ అంటువ్యాధి ప్రబలి ఉన్న కాలంలో మరణించాడు.

1939 సెప్టెంబర్‌లో జర్మన్‌లు పోలాండ్‌ను ఆక్రమించేనాటికి, ఇరేనా వార్సాలోని సాంఘిక సంక్షేమ విభాగంలో సీనియర్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తుండేది. నగరంలోని బీదాబిక్కికి ఆహారాన్ని, ఆర్థిక సాయాన్ని అందించటం ఆమె బాధ్యత. యూదులపైన నాజీలు విరుచుకుపడటం మొదలవ్వటంతో వారి అసలు మూలాలను దాచిపెట్టేందుకు ఆమె ప్రభుత్వ సాయాన్ని కల్పితమైన క్రైస్తవ నామాలు పెట్టబడిన, జాతికారణంగా పీడితులైన వారికి కూడా అందేటట్లు విస్తృతం చేసింది. 1940 శరదృతువులో జర్మన్ అధికారులు వార్సా ఘెట్టోను ఏర్పాటుచేసేటప్పటికి పరిస్థితి నాటకీయంగా విషమించింది. దాదాపుగా 4,40,000ల మంది యూదులు, అంటే నగర జనాభాలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది, చుట్టూ ఒక ప్రహరీ నిర్మించబడి ఉన్న 16- బ్లాక్‌ల ఆవాసంలోకి తరమబడ్డారు. అది ఒక బహిరంగ చెఱసాల. రిచర్డ్ పెండ్లెబెరి ప్రకారమైతే యూదులను ట్రెబ్లింకా మృత్యు శిబిరానికి పంపబోయే ముందు విడిగా ఒంటరిగా ఉంచేందుకు అనుకూలమైనదిగా ఉంది.

ధీరోదాత్తుడు : 'షిండ్లర్స్ లిస్ట్' అనే సినిమాలో లియామ్ నీసన్ అనే నటుడు ఆస్కార్ షిండ్లర్ పాత్రలో నటించటం ద్వారా ఆస్కార్ షిండ్లర్ ప్రముఖుడయ్యాడు. వ్యాధి, ఆకలి వీధుల్లో పడ్డాయి. అక్కడ ప్రతి నెలా ఐదువేల మంది మరణించారు. 1942 జూలైలో నాజీలు ఆపరేషన్ రైన్‌హార్డ్‌ను ప్రారంభించారు. దానిలో 250,000 మంది యూదులను ఘెట్టో నుండి ట్రెబ్లింకాకు పంపారు. తుది పరిష్కారం మొదలైంది. ఇరేనా భయపడిపోయింది. ఆమె తాను సాయపడాలనుకొని, తమ దేశపు యూదులకు సాయం చేసేందుకు ప్రవాస-పోలిష్ ప్రభుత్వం సృష్టించిన జెగోటా అనే రహస్య సంస్థలో చేరింది. 1942 చివరి నాటికి, ఆమె దాని పిల్లల విభాగానికి అధిపతిగా నియమింపబడింది. అసాధారణమైన ఆమె కృషి మొదలవ్వబోయింది. అత్యంత ప్రమాదకర పరిస్థితులలో, ఆమె కాపాడగలిగినంత మంది ఘెట్టో పిల్లలను మృత్యు ముఖం నుండి కాపాడింది.

ఘెట్టోను చేరటమెలా అన్నదే ఆమె తొలి సమస్యగా ఉండేది - లోపలికి,

బయటకు కదలికలను జర్మన్‌లు బాగా కట్టుదిట్టం చేశారు. నగరపు అంటువ్యాధుల విభాగం వారి నుండి అధికారిక అనుమతి పత్రం పొందటంతో ఆమెకు ఈ అవరోధం తొలగిపోయింది. ఘెట్టోలోని అంటువ్యాధులు వెలపలికి వ్యాపించకుండా నిరోధించటానికి అనే సాకుతో ఆమె నిత్యం సందర్శించగలిగింది. ఆమె లోపల ఉన్నప్పుడు పీడితులతో సంఘీభావం చూపేందుకు, నివాసితులలో కలిసిపోయేందుకు యూదులందరికీ తప్పనిసరైన డేవిడ్ పసుపు నక్షత్రం ధరించేది.

ఇరేనా దాదాపు పాతిక మంది కుట్రదారులతో ఒక నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసింది. కొందరికేమో పిల్లలను బయటకు చేరవేసేపని, మరికొందరికేమో వారికి ఘెట్టోకు బయట ఇళ్లు వెతికే పని, ఇక మూడవ బృందానికేమో తప్పించుకు వచ్చిన యువత కోసం వందల కొద్దీ తప్పుడు పత్రాలను సృష్టించటం లేదా సాధించటమే పని. ఆమె ఘెట్టో నుండి రహస్యంగా పిల్లలను బయటకు చేరవేయటమనేది తెలివైన పనే కాదు, తెగించిన పరిస్థితులలో అసాధారణమైన సాహసం కూడా. బయటకు వెళ్లే అంబులెన్స్‌లోకి ఎక్కించే రోగిని పడుకోబెట్టిన స్ట్రెచర్ క్రిందవైపు ఒక బిడ్డను కట్టేయడం సాధారణంగా అనుసరించే ట్రిక్. ఘెట్టో సరిహద్దు మీద ఉండి రెండు వైపులకు తెరుచుకొనే తలుపులున్న పాత న్యాయాలయం, చర్చ్‌ల గుండా కొందరిని తప్పించేవారు. మరికొందరిని మురుగు కాలువల గుండా తీసికెళ్లేవారు. మరీ చిన్నవాళ్లనైతే కొన్నిసార్లు సూట్‌కేస్‌లలోను, పెట్టెలలోను పెట్టి పోర్టర్‌ల ట్రాలీలమీద బయటకు పంపేసేవారు. శవపేటికలు, బాడీ బ్యాగ్‌లు, బంగాళ దుంపల సంచులు వంటివన్నీ పిల్లలను దాచిపెట్టాయి.

ఇరేనా మొదట అనాథలను బైటపడేసేందుకు దృష్టి పెట్టింది. కాని తుది పరిష్కారపు భయం పెరుగుతుండటంతో, ఘెట్టోలోని పిల్లలందరికీ ఆశ్రయం కల్పించటం జరిగింది. ఇరేనా సెండ్లర్ అంత్యక్రియలవద్ద ఆ చోటంతా దుఃఖితులతో నిండిపోయింది. పిల్లలు మృత్యుముఖాన ఉన్నారని తెలుస్తున్నప్పటికీ వారిని తప్పించటానికి తల్లిదండ్రులను ఒప్పించటానికి చాలా కష్టపడాల్సి వచ్చేదని ఆమె తరచుగా అంటూండేది. 'వాళ్లు బ్రతికే ఉంటారని మీరేమైనా హామీ ఇస్తారా?' అని ఆమెను అనేక మంది ఆవేదనపూరితులైన తల్లులు అడిగేవారు. దానికి 'లేదు, కాని వారు ఇక్కడే ఉంటేమాత్రం తప్పకుండా చస్తార'నేది ఆమె ఇచ్చే స్థిరమైన జవాబు. 'మీరు నన్ను నమ్మవద్దు, కానీ మీరింకేమి చేయగలరు?'

కొన్నిసార్లు, ఆమెకు వారిని ఒప్పించే ఓపిక నశించినపుడు, వెళ్లిపోయి మళ్లీ ఒప్పించే ప్రయత్నాలు మొదలుపెట్టేందుకు మర్నాడు తిరిగి వచ్చేది; కానీ అప్పటికి ముందు రాత్రే ఆ కుటుంబం ట్రెబ్లింకాకు పంపబడి ఉండేది. కాని వేలమందిని హృదయ విదారకమైన ఎడబాటుకు సిద్ధం చేయటం జరిగింది. 'పిల్లలు తల్లిదండ్రులను వదలి వెళ్లేటప్పటి ఏడ్పులు ఇప్పటికీ నాకు కలల్లో వినిపిస్తూంటాయ'ని అంటూండేది ఇరేనా. అలాంటి పిల్లలలో ఎల్జబైటా ఫికోవ్స్కా ఒకరు. తల్లి ఆ పిల్లను ఇరేనాకు అప్పగించేటప్పటికి

ఆమె కొద్ది నెలల పసిగుడ్డు. ఒక మెకానిక్ ఆమెను ఒక పరికరాల పెట్టెలో పెట్టి, దానిని తన లారీ వెనక భాగంలో ఇటుకల గుట్ట మధ్యలో పెట్టి ఆమెను బయటకు చేరవేశాడు.

మళ్లీ ఎల్జబైటా తన తల్లిని ఎన్నడూ చూడలేదు; ఇరేనాకు ఆ పిల్ల తల్లి ఇచ్చిన ఆమె పేరు, పుట్టిన తేదీలను చెక్కి ఉన్న వెండి చెంచా ఒక్కటే ఆమె ఒకప్పుడు ఘెట్టోలో ఉండేదనటానికి ఒకే ఒక ఋజువు. నేటికీ ఇంకా జీవించి ఉన్న ఎల్జబైటా ఇప్పుడు తనకు ముగ్గురు తల్లులని అంటుంది – తనకు జన్మనిచ్చిన తల్లి, తాను ఘెట్టో నుండి తప్పించుకున్న తర్వాత తనను అక్కున చేర్చుకున్న పోలిష్ మహిళ, ఇంకా తనను మృత్యు ముఖం నుండి రక్షించిన మాతృమూర్తి ఇరేనా. ఎక్కువ మంది పిల్లలను క్రొత్త గుర్తింపులతో అనాథాశ్రమాలకు, కాన్వెంట్‌లకు పంపారు లేదా ప్రైవేట్ ఇళ్లలో ఉంచారు. వారిని దాచిన చోట్లలో దాడులు జరిగినప్పుడు వారి యూదు ప్రార్థనలకు బదులు క్రైస్తవ భక్తిగీతాలు ఆలపించటం నేర్పారు. పోలండ్‌లో యూదునికి ఆశ్రయమిస్తే మరణమే శిక్ష ఐనప్పటికీ, 'నా నుండి బిడ్డను తీసికొనేందుకు ఏ ఒక్కరూ నిరాకరించలేద'ంటుంది ఇరేనా.

ఆమె తాను కాపాడిన వారి వివరాలను, వారిని ఎక్కడకు పంపినదీ జాగ్రత్తగా వివరాలు నమోదు చేసి ఉంచింది. ఈ సంకేత రూపంలోని సమాచారం టిస్యూ పేపర్ మీద వ్రాసి ఉంచింది. ఒకేలాంటి పట్టికలను రెండు గాజు జాడీలలో దాచి, వాటిని జర్మన్ సైనిక బారక్‌ల ఎదురుగా ఒక ఆపిల్ చెట్టు క్రింద పాతిపెట్టింది. ఇదేమంత భద్రమైన పనికాదు; క్రొత్తగా తప్పించుకొని వచ్చిన వారి పేరు చేర్చవలసి వచ్చిన ప్రతిసారీ ఆ జాడీలను త్రవ్వి తీయాల్సి వచ్చేది. ఐతే, వాటిని ఎవ్వరూ కనిపెట్టలేదు. ఐనప్పటికీ, జర్మన్‌లకు ఇరేనా కార్యకలాపాల గురించి తెలిసిపోయింది. గెస్టపో అక్టోబర్ 1943లో ఆమెను అరెస్ట్ చేసి, నాజీలు ఏకాగ్రతా శిబిరంగా మార్చిన వార్సాలోని పేరుగాంచిన పవాయిక్ చెరసాలకు తరలించారు. అక్కడ, ఆమెను ప్రశ్నించిన వ్యక్తి దోషరహితమైన పోలిష్ భాష మాట్లాడే డాంబికమైన జర్మన్ యువకుడు. ఆమె జెగోటా రహస్య కార్యకలాపాలను బహిర్గతపరచేందుకు నిరాకరించినపుడు, ఆమె కాళ్లు, చేతులను విరిచేశాడు.

మరణశిక్ష విధించబడింది – అప్పటికే తనను బందీగా పట్టుకొన్న వారిని ఆమె తనకు మరణశిక్ష విధించమని కోరుకుంది – ఇరేనాను అర్ధ చేతనావస్థలో చెరసాల నుండి ఫైరింగ్ దళం కాల్చి చంపుతుందని భావించి అడవికి తరలించారు. ఆమెను అడవిలో వదిలేసినప్పటికీ, ఫైరింగ్ దళం ఊసే లేకపోయింది. ఆమె మరణశిక్ష అమలును పర్యవేక్షించే పని అప్పగించబడ్డ వ్యక్తిని, రహస్య కార్యకలాపాలు సాగించే ముఠా విజయవంతంగా ప్రలోభపెట్టి, ఆమె మరణాన్ని ప్రకటిస్తూ వార్సా అంతటా గోడ పత్రికలు వెలసినప్పటికీ, ఆమెను రక్షించింది.

ఇరేనా మిగిలిన యుద్ధసమయాన్ని దాక్కొని గడిపింది. కాని అది ముగిసిన వెంటనే, తప్పిపోయిన పిల్లలను తమ కుటుంబాలకు చేర్చేందుకు అవసరమైన ముఖ్య సమాచారమున్న గాజు జాడీలలోని టిస్యూ జాబితాలను ఆమె యూదుల ప్రతినిధులకు అందచేసింది. కానీ పాపం ఆ మారణహోమంలో అనేక కుటుంబాలు నాశనమై పోయాయి. ఆమె రక్షించిన పిల్లలలో మిగిలినవాళ్లు వాళ్ల అసలు తల్లిదండ్రులను మరచిపోయినందున – పెంపుడు తల్లిదండ్రులతో ఉండదలిచారు. క్రొత్త జీవితం ప్రారంభించేందుకు దాదాపు 500 మందిని ఇజ్రాయెల్‌కు తీసికెళ్లారు. అనేక మంది పోలిష్ దేశస్థులను బలిగొన్న యుద్ధజ్వాలలకు ఆహుతై పోయిన ఆమె రక్షించిన మరో 500 మంది పిల్లలేమయ్యారో అజ లేకపోయింది. మరి ఇరేనా? ఆమె పెళ్లి చేసికొని ఇద్దరు పిల్లలను కన్నది. కాని, యూదులపట్ల సానుభూతిలేని యుద్ధానంతరపు కమ్యూనిస్ట్ పోలెండ్‌లో ఆమె ధీరోదాత్త కార్యాలు ప్రచురణకు నోచుకోలేదు. పైగా పాలకులు అధికారికంగా కళ్లెట్టిచేశారు. కాని, ఆమె రక్షించిన పిల్లలు పెరిగి పెద్దవాళ్లౌతుండగా ఆమె విజయాలు అందరి దృష్టిని ఆకర్షించటం మొదలైంది. 1983లో, ఇరేనాను ఇజ్రాయెల్‌లో యూదులుకాని వారికి యూదులు ప్రకటించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'Righteous Among the Nations' అని గౌరవించారు. ఆ ఉత్సవంలో, ఆమె రక్షించిన బాలలలో ఒకరైనా తెరెసా కెర్నర్ అనే వైద్యురాలు, తాను సురక్షితమైన ఇళ్లకు తరలివెళ్లేందుకు అనేకసార్లు ఇరేనా ఏవిధంగా సాయపడిందీ, ఆ తర్వాత యుద్ధం ముగిశాక, రెండేళ్లపాటు తనకు ఇంటిని ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసికొంది. చివరకు 2003లో కమూనిస్ట్ పరిపాలనానంతర పోలెండ్ కూడా ఇరేనాను అత్యున్నత పౌరసత్కారంతో గౌరవించింది. 2007లో ఆమె పేరు నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించబడింది. ఐనా, ఇరేనా కంటే చాలా తక్కువ మంది యూదులను కాపాడినప్పటికీ, అవార్డ్‌ను గెలుచుకున్న పుస్తకం, సినిమా ద్వారా అజరామరం కావించబడ్డ జర్మన్ పారిశ్రామికవేత్త ఆస్కార్ షిండ్లర్‌తో పోలిస్తే ఆమె ప్రొఫైల్ చిన్నదిగానే మిగిలిపోయింది.

గెస్టపో వారు ఆమెకు చేసిన గాయాల కారణంగా ఆమె చివరి సంవత్సరాలు చక్రాల కుర్చీలోనే గడిచిపోయాయి. ఆమె మరణించటానికి కొద్ది మాసాల ముందు ఆమె 'రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, మానవజాతి ఒక విషయాన్ని అవగతం చేసికొన్నట్లు అనిపిస్తున్నది. అలాంటిది మరోసారి జరగదు' అన్నది. 'మానవజాతి ఏమీ అర్థం చేసుకోలేదు. మతపరమైన, గిరిజన, జాతీయవాద యుద్ధాలు కొనసాగుతాయి. ప్రపంచం రక్తసముద్రంలోనే కొనసాగుతుంది.' కాని, ఆమె మరో మాట అన్నది : **ప్రేమ, సహనం, నిరాడంబరత** ఉంటే ఈ ప్రపంచం మరింత మెరుగ్గా ఉండగలుగుతుంది. ఆ మూడు ఇరేనా సెండ్లర్‌లో పుష్కలంగా ఉన్నాయి. ✦

జమిలి వేలుపు

– డా॥ పాపినేని శివశంకర్, గుంటూరు

అభ్రంకషంబైన యాలపోతు నితండు – త్రుంచినాఁ డీతండు పెంచినాడు
సాధుసమ్మతముగా సామజంబు నితండు – గాచినాఁ డీతండు ద్రోచినాడు
బర్హిర్ముఖార్థమై పర్వతేశు నితండు – దాల్చినాఁ డీతండు వ్రాల్చినాఁడు
ఫణపరంపర తోడి పన్నగేంద్రు నితండు – మెట్టినాఁ డీతండు చుట్టినాఁడు
నేఁడు నాఁడును నాఁడును నేఁడు మనకుఁ
జూపఁ జెప్పంగఁ జెప్పంగఁ జూపఁ గలిగె
ననుచుఁ గొనియాడు సంయమిజనుల కొదవె
రజతగిరి మీఁద హరిహరాధనంబు –నాచన సోమన, ఉత్తర హరివంశము

ఒకానొకప్పుడు శ్రీకృష్ణుడు కైలాసపర్వతం మీద గొప్ప తపస్సు చేశాడు. శివుడు సాక్షాత్కరించాడు. కృష్ణుడు తనను మనసార స్తుతించగా శివుడు ప్రేమగా అతని చెయ్యి పట్టుకొని ఆదరించాడు. అది తిలకిస్తున్న దేవ మునులకు పక్కపక్కనే ఉన్న శివకేశవులు హరిహరాత్మకమైన ఒకే దేవతగా తోచారు. వారిట్లా ఆ **'జమిలి వేల్పు'**ను (జంటగా ఉన్న దేవత) స్తుతించారు. అభ్రంకషము = ఆకాశాన్ని ఒరుసుకొంటున్నది; ఆలపోతు = ఎద్దు; సామజము = ఏనుగు; బర్హిస్సు = అగ్ని; బర్హిర్ముఖులు = అగ్నిద్వారా యజ్ఞాల్లో సమర్పించేవి స్వీకరించేవాళ్లు, దేవతలు; ఫణపరంపర = పడగల వరుస; పన్నగ+ఇంద్రుడు = పాములకు రేడు; సంయమిజనులు = మునులు, రజతగిరి = వెండికొండ.

పై సీసపద్యం తొలి భాగాల్లోని 'ఇతండు' కృష్ణుడు (హరి). మలి భాగాల్లోని 'ఈతండు' శివుడు (హరుడు). ఆ హరిహరులు చేసి మహత్కార్యాలను వర్ణించటమే పద్యంలోని విషయం. హరి – మబ్బంత ఎత్తున్న ఎద్దును ఖండించాడు. అంటే వృషభాసురుడిని ఖండించాడు. హరుడు – వృషభాన్ని పెంచి పోషించాడు. శివుడి వాహనం నందీశ్వరుడే గదా!

హరి – సజ్జనులంతా మెచ్చుకొనేటట్టు ఏనుగును కాపాడాడు. అంటే గజేంద్రుడిని మొసలిబారి నుండి రక్షించాడు. హరుడేమో ఏనుగును కూల్చాడు. అంటే గజాసురుడిని వధించాడు. హరి – దేవతల కోసం పర్వతశ్రేష్ఠుడిని తలదాల్చాడు. అంటే దేవదానవులు పాలసంద్రాన్ని చిలికేటప్పుడు కవ్వమైన మందరగిరిని మునిగిపోకుండా మోశాడు. హరుడేమో పర్వతరాజును వంచాడు. అనగా త్రిపురాసుర సంహార సమయంలో మేరు పర్వతాన్ని విల్లుగా దాల్చి, వంచాడన్నమాట. హరి – పలు పడగల పాపరేడును (సర్పరాజు) కాలితో తొక్కాడు. అనగా కాళీయ సర్పాన్ని కాలితో మర్దించాడు. హరుడు – సర్పరాజును చుట్టుకొన్నాడు. వాసుకి శివుడి కంఠహారం గదా! శివకేశవులుగా అవతారాలు వేరైనా

తామిద్దరూ ఒకటే. ఈనాడు చూపటానికి, ఆ పురాణ కాలాన కూడా అట్లాగే అని చెప్పటానికి, నాడు చెప్పటానికి, నేడు చూపటానికి సాధ్యమైంది గదా! అంటూ హరిహర మహిమను కొనియాడుతున్నారు మునులు. ఆ విధంగా వారు వెండి కొండ మీద శివకేశవులను పూజించారు. ('విష్ణురూపాయ నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు' అన్నాడు తిక్కన.)

జగత్కల్యాణ కారకుడైన హరిహరులకు తత్త్వభేదం లేదు. కాని లేని భేదం ఉన్నట్టుగా కల్పించటమే ఈ పద్యంలో కవి చేసిన చమత్కారం. ఒకరు వృషభాన్ని త్రుంచితే యింకొకరేమో పెంచుతారు. ఒకరు ఏనుగును కాపాడితే యింకొకరేమో తునుమాడారు. ఒకరు పర్వతాన్ని తాల్చితే యింకొకరేమో వాల్చారు. ఒకరు సర్పాన్ని మెట్టితే యింకొకరేమో చుట్టారు. ఇద్దరి పనుల మధ్య ఎంత భేదం ఉంది! అయితే నిజానికిది విరోధాభాసమే గాని వాస్తవ విరోధం గాదు. ఎట్లాగంటే కేశవుడు చేసిన వృషభాసుర వధ, గజేంద్ర మోక్షం, మందరగిరి ధారణ, కాళియ మర్దనం – ఇవన్నీ లోకోపకార కృత్యాలే. అట్లాగే శివుడు చేసిన నందీశ్వర సంరక్షణ, గజాసుర సంహారం, మేరు ధనుర్ధారణ, సర్పాలంకరణ – అవన్నీ లోకకల్యాణ దాయకాలే. ఇద్దరి పనుల పరమార్థం ఒకటే. కనుక వారి మధ్య ఏ విభేదమూ లేదు.

ఇక ఈ మహా మునులు శివకేశవులు అటువంటి మహత్కార్యాలు చేసిన నాడూ ఉన్నారు, ఈనాడూ ఉన్నారు. కనుక అలనాటి విశేషాలన్నీ ఆనాడు భక్తులకు చూపించే భాగ్యం కలిగింది. ఈనాడు చెప్పే భాగ్యం కలిగింది. ఆనాటికి ఈనాటికి గల వాసిని స్ఫురింపజేస్తూ నాడు, నేడు, చూపు, చెప్పు అనే మాటల్ని వ్యత్యస్తం (తారుమారు) చేస్తూ రచించటమే ఈ ఎత్తుగీతిలోని సొగసు. ఇది శబ్ద చమత్కారం. క్రీ.శ. 1340 ప్రాంతంలో జీవించిన నాచన సోమన్న, ఎఱ్ఱనకు కుడి ఎడమగా సమకాలికుడు. హరిహరరాయ, బుక్కరాయల ఆస్థానంలో ఉన్నట్టు తెలుస్తుంది. ఎఱ్ఱన హరివంశము రచిస్తే ఇతర ఉత్తర హరివంశము రచించాడు. **'భారత పరాంశమని యింపారగఁ జెప్పుదురు బుధులు హరివంశము'** (ఎఱ్ఱన). భారతానికి తర్వాత భాగమైన ఈ హరివంశాన్ని, **'బుధరాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారత కథానంతరంబున'** ప్రారంభిస్తున్నట్టు సోమన పేర్కొన్నాడు. తిక్కనకు శిష్యుడు కాకపోయినా అభిమాని అయ్యుంటాడు. తిక్కన భారతాన్ని హరిహరనాథుడికి అంకితం చేశాడు. అదేవిధంగా నాచనసోమన తన గ్రంథాన్ని హరిహరనాథుడికే అంకితమిచ్చాడు. **'సకలభాషాభూషణ, సాహిత్యరసపోషణ, సంవిధాన** చక్రవర్తి, సంపూర్ణకీర్తి, నవీనగుణసనాథ, నాచన సోమనాథ ప్రణీతము' అని తన కవితా గుణాలు చెప్పుకొన్నాడు సోమన. పై విధమైన శబ్దార్థ చమత్కారాల్లో, వక్రోక్తి మొదలైన అలంకార ప్రయోగాల్లో, యుద్ధ వర్ణనల్లో అతని నూతన కవితా గుణాలు ప్రస్ఫుటమవుతాయి. అయితే భావగాంభీర్యంలో సోమన ఎఱ్ఱనకు సాటిరాడు. ✦

శ్రీమయూరమహాకవివిరచితః

సూర్యదణ్డకః

బాలానన్దినీవ్యాఖ్యా 4/4

– ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

దినకర! తే క్షరన్మాక్షికం మన్త్రమష్టాక్షరం యే సమాచక్షతే తాననల్పాన్ స్వయంభూతజల్పాన్ అజల్పాకకత్వాన్న కల్పామహే జ్ఞాతు మజ్ఞా నిరజ్ఞాన- వైజ్ఞానిక – జ్ఞాత – భూయస్సమజ్ఞానిధే! మే హృది జ్ఞానవిజ్ఞాన మూఢాశయాజ్ఞాన భిజ్ఞాత! దేవాన్త రాజ్ఞాపి దూరే త్వదాజ్ఞావిధేయస్య, విజ్ఞాపనే మే రసజ్ఞా కృతా మాస్త్వవజ్ఞానవజ్ఞాత – వన్దారువిజ్ఞాపన! – జ్ఞాపనీయార్థమాజ్ఞాఽ వివేకస్య వైజ్ఞానికం మాం విధాతుం ప్రతిజ్ఞా ప్రతిజ్ఞానిధే! తేఽస్తు, దివ్యం పరం వస్తు వేదే ధృతం మేఽస్తు; న త్వాం నమేద్యస్తు తం దుర్విధిశ్చాస్తు యే త్వాం హృది స్థాపయిత్వా చ నత్వాఽర్చయిత్వా చ దత్వా నివేద్యాని, మత్వాశయప్రీతిమత్త్వాయ చ త్వా మమత్వానుపేతాశ్చ నీత్వా తవ ధ్యాయకత్వాధికారం, పఠిత్వా మనుం తే, నటిత్వా ముదం తే విదిత్వా మహత్త్వానుబద్ధం గణం సంపదామప్యయిత్వాత్ర కృత్వా తపో దుశ్చరం, సంప్రహృష్యన్తి తేషాం విశుష్యన్త్వరం ఘోరసర్వాపదస్తేషు కశ్చిన్మహేన్ద్రస్సునిశ్చీయతే తేషు మేధాధిపః కోఽపి సంలక్ష్యతే తత్సమూహే శశాఙ్కం సమూహే స్థితమ్, తేషు గణ్యో హుతాశః సపుణ్యోదయస్తత్సభాసత్సు సత్స్వేక ఏవానిలస్తద్గతాశానువర్తీస పాశాయుధ- స్తన్నివేశాశ్రయస్సోఽపి నాగేశ్వరస్తత్పురస్కారచుఞ్చుస్స వాచస్పతి – స్సర్వగీర్వాణ – తత్తత్పద – స్థూల – లక్షాయ సర్వేప్సితార్థార్పణే కల్పవృక్షాయ, సర్వాపరోక్షాయ, సర్వాన్తరీపప్రకాశైకదక్షాయ సర్వాపదుద్ధారణే బద్ధదీక్షాయ, సంరబ్ధ సంక్రుద్ధమన్దేహశిక్షాయ, తుభ్యం సమస్తాన్తరాత్మన్మమాత్మానమద్యార్పయే, ద్వాదశాత్మ – న్ననాత్మజ్ఞ – మాత్మజ్ఞ – రక్షాకరాద్వైవ రక్షాభివీక్షాభి – రుక్షాధిరూఢాలికాక్షాకృతే! వాసరాణాం పతే!

వ్యాఖ్యానము :- దినకర = ఓ! సూర్యదేవా! క్షరన్మాక్షికమ్ = తేనెను స్రవించుచున్న, తే అష్టాక్షరం మన్త్రమ్ = నీ అష్టాక్షరమంత్రాన్ని, యే = ఎవరు, సమాచక్షతే = జపిస్తారో, అనల్పాన్ = మహాత్ములు, స్వయంభూతజల్పాన్ = స్వయంగా (అనాయాసంగా) ఆవిర్భవించిన వాగ్వైభవం గల, తాన్ = వారిని, అజల్పాకకత్వాత్ = (వారు) అధికంగా మాటలాడనివా రవడంవల్ల, అజ్ఞాః = అజ్ఞులమైన మేము, జ్ఞాతుమ్ = తెలిసికొనుటకు, న కల్పామహే = సమర్థులము కాము.

నిరజ్ఞాన = అజ్ఞానము తొలగిపోయిన,వైజ్ఞానిక = విశిష్టజ్ఞానవంతులచేత, జ్ఞాత = తెలియబడిన, భూయః సమజ్ఞానిధే = అధికమైన కీర్తికి నిధి యైనవాడా? జ్ఞాన = ఆత్మజ్ఞానమునందు, విజ్ఞాన = శిల్పాదిజ్ఞానమునందు, మూఢాశయ = మూఢమైన మనస్సుగల, అజ్ఞ = మూఢులచేత, అనభిజ్ఞాత = గుర్తింపబడనివాడా! తవ = నీయొక్క, ఆజ్ఞావిధేయస్య = ఆజ్ఞకు విధేయుడ నైన, మే = నా యొక్క, హృది = హృదయమునందు, దేవాన్తరాజ్ఞాపి = ఇతరదేవతల ఆజ్ఞ కూడ, దూరే = దూరము నందు ఉండును. ఇతరదేవతల ఆజ్ఞను నేను పాలించను అని అర్థం. విజ్ఞాపనే = నీకు విజ్ఞాపనం చేసికొనడమునందు (కొనుటకు) మే రసజ్ఞా = నా నాలుక, కృతా = ప్రవర్తింపచేయబడినది. హే! అనవజ్ఞాతవన్దారువిజ్ఞాపన! = నమస్కరించే స్వభావం గల భక్తుల విజ్ఞాపనమును తిరస్కరించనివాడా! అవజ్ఞా = నా విజ్ఞాపన విషయంలో అనాదరము, మాస్తు = నీకు లేకుండుగాక.

ప్రతిజ్ఞానిధే = ప్రతిజ్ఞకు నిధియైనవాడా! అవివేకస్య = వివేకశూన్యుడనైన యొక్క, జ్ఞాపనీయార్థమ్ = విజ్ఞాపన చేసికొనవలసినదానికొరకు, విజ్ఞాపనచేసి కొనుటకు, తే ఆజ్ఞా = నీ ఆజ్ఞ, మామ్ = నన్ను, వైజ్ఞానికమ్ = విజ్ఞానం కలవానినిగా, విధాతుమ్ = చేయుటకు ప్రతిజ్ఞా అస్తు = ప్రతిజ్ఞ అగుగాక. వేదే ధృతమ్ = వేదమునందు ధరింపబడిన (ప్రతిపాదింపబడిన), దివ్యం పరం వస్తు = దివ్యమైన పరవస్తువు, (త్వదభిన్నమైన) (నీకంటే వేరుగా లేని) పరమాత్మరూపమైన వస్తువు, మే = నాకు, అస్తు = అగుగాక; సాక్షాత్కరించుగాక.

యః తు = ఎవడు, త్వామ్ = నిన్ను, న నమత్ = నమస్కరించడో, తమ్ = వానిని గూర్చి, వానికి, దుర్విధిః = చెడ్డవిధి, అస్తు = అగుగాక; యే = ఏ నీ భక్తులు, త్వామ్ = నిన్ను, హృది స్థాపయిత్వా = హృదయములో నిలుపుకొని, నత్వా చ = నమస్కరించి, అర్చయిత్వా = పూజించి, నివేద్యాని చ = నివేదింపతగిన పదార్థాలను, దత్వా = ఇచ్చి, మమత్వానుపేతాః = మమకారం లేనివారై, ఆశయప్రీతి మత్త్వాయ = తమ మనఃప్రీతికొరకు, త్వా = నిన్ను, మత్వా = తలచి, తే మనుమ్ = నీ మంత్రమును, పఠిత్వా = పఠించి, (తమను), తవ ధ్యాయకత్వాధికారమ్ = నిన్ను ధ్యానం చేయడానికి తగిన అధికారమును (యోగ్యతను), నీత్వా = పొందించి, తే = నీయొక్క, ముదమ్ = సంతోషమును, అనుగ్రహమును, విదిత్వా = తెలిసికొని, నటిత్వా = నీవు అనుగ్రహించినందుకు ఆనందముతో నటించి, మహత్త్వానుబద్ధమ్ = మహత్త్వంతో కూడిన (అత్యధికమైన), సంపదామ్ = సంపదల, గణమ్ అపి = గణమును కూడ, అయిత్వా = పొంది, అత్ర = ఇహలోకంలో, దుశ్చరమ్ = ఇతరులెవరికీ చేయ శక్యం కాని, తపః = తపస్సు, కృత్వా = చేసి, సంప్రహృష్యన్తి = ఆనందిస్తారు. తేషామ్ = వాళ్లయొక్క,

ఘోరసర్వాపదః = ఘోరమైన ఆపదలు అన్నీ, అరమ్ = శీఘ్రంగా, విశుష్యన్తి = ఎండిపోవును. తేషు = అలాంటి నీ భక్తులలో, కశ్చిత్ = ఒకడు, సునిశ్చీయతే = నిశ్చయింపబడతాడు. తేషు = వారిలో, కోఽపి = ఒకడు, మేధాధిపః = శుక్రుడుగా, సంలక్ష్యతే = చూడబడతాడు. తత్సమూహే = వాళ్ల సముదాయంలో, ఒకనిని, శశాఙ్కమ్ = చంద్రుడుగా, స్థితమ్ = ఉన్నవానినిగా, సమూహే = ఊహింతును. సుపుణ్యోదయః = మంచి పుణ్యోదయం గల, హుతాశః = అగ్ని, తేషు గణ్యః = నీ భక్తులలో లెక్కపెట్టదగిన వాడు. సత్సు = సత్పురుషులైన, తత్సభాసత్సు = ఆ భక్తుల సభాసదులలో, అనిలః = వాయువు, ఏక ఏవ = ఒకడు. సః పాశాయుధః = ఆ వరుణుడు, తద్గతాశానువర్తీ = ఆ భక్తులు వెళ్లిన దిక్కును అనుసరించి వెళ్లేవా డవుతాడు. సః నాగేశ్వరః = ఆ ఆదిశేషుడు లేదా వాసుకి, తన్నిదేశాశ్రయః = వాళ్ల (భక్తుల) ఆదేశాలను పాలించేవాడేగా ఉంటాడు. సః వాచస్పతిః = ఆ బృహస్పతి, తత్పురస్కారచుఞ్చుః = వాళ్ల పురస్కారము చేత ప్రసిద్ధ డవుతాడు. వాళ్లను గౌరవిస్తాడు. నీ భక్తులకు మాత్రమే ఆ యా దేవతాస్థానాలు (అధికారాలు) లభిస్తాయి అని భావం.

సర్వగీర్వాణ = సమస్తదేవతలకు, తత్తత్పదస్థూలలక్షాయ = ఆ యా పదములు ఇచ్చేవాడవు, సర్వేప్సితార్థార్పణే = అందరికీ లేదా అన్ని కోరికలూ తీర్చుటలో, కల్పవృక్షాయ = కల్పవృక్ష మైనవాడవు, సర్వాపరోక్షాయ = అందరికీ ప్రత్యక్షంగా కనబడువాడవు, సర్వ = సమస్తమైన, అన్తరీప = ద్వీపముల, ప్రకాశ = ప్రకాశింప చేయడంలో, ఏకదక్షాయ = సమర్థుడైన ఒకే ఒక దేవుడవు, సర్వాపదుద్ధారణే = సకలభక్తులను లేదా సమస్తమైన, ఆపదలనుండి ఉద్ధరించడమునందు, బద్ధదీక్షాయ = దీక్ష వహించిన వాడవు, సంరబ్ధసంక్రుద్ధమన్దేహశిక్షాయ = కోపించిన మన్దేహు లను అసురుల శిక్షను చేసేవాడవు, మన్దేహాసురులను శిక్షించేవాడవు (మందేహాసురు లను అసురులు గుంపులు గుంపులుగా వచ్చి సూర్యోదయ సమయంలో సూర్యరథాన్ని అడ్డుకొంటారనీ, ఆ సమయంలో సూర్యుణ్ణి ఉద్దేశించి ద్విజులు పైకి చల్లిన అర్ఘ్యజలాంజలులు వజ్రాయుధములై వారిని సంహరిస్తాయని వేదంలో చెప్పబడింది) అయిన, తుభ్యమ్ = నీకు, సమస్తాన్తరాత్మన్! = అందరికీ అంతరాత్మయైన ఓ! ఆదిత్యా! అద్య = ఇప్పుడు, మమ ఆత్మానమ్ = నా ఆత్మను, నన్ను, అర్పయే = అర్పిస్తున్నాను, ద్వాదశాత్మన్! = పన్నెండు స్వరూపాలు గలవాడా! ఆత్మజ్ఞరక్షాకర! = నీ స్వరూపాన్ని తెలుసుకొన్నవారిని రక్షించేవాడా! ఉక్షాధిరూఢాలికాక్షాకృతే! = వృషభారూఢు డైన ఫాలనేత్రు డైన పరమేశ్వరుని ఆకారమైనవాడా! వాసరాణాం పతే! = దినాధిపతీ! అనాత్మజ్ఞమ్ = ఆత్మజ్ఞానం లేని నన్ను, అద్యైవ = ఇప్పుడే, అభివీక్షాభిః = నీ చూపులచేత, రక్ష = రక్షించుము.

మూలమ్ :- దేవ! సాక్షాత్పరం బ్రహ్మ వీక్షామహే త్వాం పరోక్షామరేక్షా -

విలమ్బ - ప్రయాస - ప్రతీక్షా చ యన్నైవ, తార్క్ష్యాధిరూఢామ్బుజాక్షాయసే చ, త్వమక్షేమ రాతేర్మమ క్షేమలాభాయ; హంసాధిరూఢం విధిం సావరోధం నినంసామి సంసారవిధ్వంస హేతో - ర్భవన్మణ్డలే యం యమిచ్ఛామ్యహం దేవమృచ్ఛామి పూర్త్యై మదిచ్ఛాసమం తత్తదాకారతః, కోకశోకాతిరేకాయనీకార! నిస్తన్ద్రశోకాపహర్తాసి, మే సౌఖ్యస్యకర్తాసి, లోకాధికర్తా, త్వమేకః పరః, కుత్ర శమ్భుః, క్వచామ్భోజనాభిః, క్వ చామ్భోజపీఠః, క్వ జమ్భాహితః, కుత్ర చామ్భుఃపతిః, కుత్ర వాన్యే సురా ఇత్యశేషామరాన్వేషణం నైవ కర్తుం క్షమే; సోఽహ మీక్షేఽపరోక్షేఽత్ర తానేవ సర్వామరానద్య సర్వామరాకార! తే మణ్డలే; సర్వదేవాత్మనస్తే ప్రసాదేన సర్వాణ్యభీష్టాని సిధ్యన్తు మే. కిం బహూక్త్యా భవత్పాదభక్త్యా మహత్యా భవామ్యుత్సుకోఽహం తయా, భక్తిరేవాస్తు సా భక్తిరుద్వేల సంపత్తిదాత్రీ భవిత్రీ, మమారోగ్యకర్త్రీ తరిత్రీ చ దీర్ఘాయురున్మేషయిత్రీ, యశో దిక్షు దాత్రీ చ ధాత్రీవ మాం పాలయిత్రీ, ధరిత్రీం తవేమాం దశాన్తే చ సా ప్రాపయేన్మహ్యమన్తే పదం తేజసా దాస్యతే; తేన సా భూయసా భక్తిరాశాస్యతే; పామరాన్ కామయే నామరాన్ సేవితుమ్.

వ్యాఖ్యానము :- దేవ = దేవా! పరం బ్రహ్మ = పరబ్రహ్మయైన, త్వామ్ = నిన్ను, సాక్షాత్ వీక్షామహే = ప్రత్యక్షంగా చూస్తున్నాము. యత్ = ఎందువలన అనగా, పరోక్షామరేక్షా = పరోక్షు లైన దేవతలను చూడడంలో, విలమ్బ = ఆలస్యము, ప్రయాస = ప్రయాస, నిరీక్షా చ = వేచి ఉండడమూ కూడ, నైవ = మాకు లేదు. అక్షేమరాతేః = క్లేశములకు మిత్రుడ నైన, మమ = నాకు, త్వమ్ = నీవు, క్షేమలాభాయ =క్షేమం పొందుటకు, తార్క్ష్యాధిరూఢామ్బుజాక్షాయసే = గరుత్మంతుని అధిరోహించిన మహావిష్ణువు అగుచున్నావు. సర్వదేవతాస్వరూపుడ వైన నిన్ను ప్రత్యక్షంగా చూడడంచేత దేవత లందరినీ చూచి నట్లే గాన నువ్వే నాకు మహావిష్ణువు అని అర్థం. సంసారవిధ్వంసహేతోః = సంసారబాధావినాశంకొరకు, భవన్మణ్డలే = నీ మండలంలో, హంసాధిరూఢమ్ = హంసను అధిష్ఠించిన, సావరోధమ్ = భార్యయైన సరస్వతీదేవితో కూడిన, విధిమ్ = బ్రహ్మదేవుణ్ణి, నినంసామి = నమస్కరింపగోరుచున్నాను.

మదిచ్ఛాసమమ్ = నాకోరికకు తగిన, యం యం దేవమ్ = ఏ యే దేవుణ్ణి, పూర్త్యై = నా ఇచ్ఛ పూర్తి అగుటకు, అహమ్ = నేను, ఇచ్ఛామి = కోరుతానో, ఆ దేవుణ్ణి, తత్తదాకారతః = ఆ యా ఆకారాలలో, ఋచ్ఛామి = నీ మండలంలో పొందుతున్నాను. చూచుచున్నాను. హే! కోకశోకాయనీకార! = చక్రవాకపక్షుల శోకమును తొలగించు పగలును చేయువాడా! మే = నాయొక్క, నిస్తన్ద్రశోకాపహర్తా = నన్ను బాధించడానికి జాగరూకములై ఉన్నా శోకాలను అపహరించేవాడవు, అసి = అయి ఉన్నావు. సౌఖ్య కర్తా అసి = నాకు సౌఖ్యం ఇచ్చేవాడవై ఉన్నావు. త్వమ్ ఏకః = నీ వొక్కడవే, పరః = శేష్ఠుడవైన, లోకాధికర్తా = లోకములపై అధికారం కలవాడవు. శమ్భుః = శివుడు, కుత్ర

= ఎక్కడ, అమ్భోజనాభిః = విష్ణువు, క్వ = ఎక్కడ, అమ్భోజపీఠః = పద్మాసనుడైన బ్రహ్మ; క్వ చ = ఎక్కడ; జమ్భాహితః = ఇంద్రుడు, క్వ = ఎక్కడ, అమ్భఃపతిః చ = వరుణుడు, కుత్ర = ఎక్కడ; అన్యే సురాః = ఇతర దేవతలు, కుత్ర వా = ఎక్కడుంటారు. ఇతి = ఇట్లు, అశేషామరాన్వేషణమ్ = మిగిలిన సమస్తదేవతల అన్వేషణమును, కర్తుమ్ = చేయుటకు, నైవ క్షమే =సమర్థుడను కాను.

సః అహమ్ = అట్టి నేను, సర్వామరాకార! = సమస్తదేవతాస్వరూపుడ వైన ఓ! భాస్కరా! అత్ర = ఇక్కడ, తే మణ్డలే ఏవ = నీ మండలమునందే, తాన్ సర్వామరాన్ = ఆ దేవతాశ్రేష్ఠులందరినీ, అద్య = ఇప్పుడు, అపరోక్షే = ప్రత్యక్షంగా, ఈక్షే = చూచుచున్నాను, సర్వదేవాత్మనః = సర్వదేవతాస్వరూపుడ వైన, తే = నీయొక్క, ప్రసాదేన = అనుగ్రహంచేత, మే = నా యొక్క, సర్వాణి అభీష్టాని = అన్ని కోరికలు, సిధ్యన్తు = సిద్ధించుగాక. బహూక్త్యా కిమ్ = చాల చెప్పడంచేత, ఏమి ప్రయోజనము! అహమ్ = నేను, తయా = ఆ, మహత్యా = గొప్పదైన, భవత్పాదభక్త్యా = నీ పాదములపై భక్తిచేతనే, భక్తిని పొందుటకై, ఉత్సుకః అస్మి = చాల ఆసక్తి కలవాడనై ఉన్నాను. భక్తిః ఏవ = నీ పాదభక్తియే, అస్తు నా కుండు గాక. సా భక్తిః = ఆ భక్తి, ఉద్వేలసంపత్తిదాత్రీ = అత్యధికమైన సంపదను ఇచ్చేదిగా, భవిత్రీ = కాగలదు. మమ = నాకు, ఆరోగ్యకర్త్రీ = ఆరోగ్యం చేసేది అవుతుంది. తరిత్రీ = తరింపచేసేది, దీర్ఘాయుః = దీర్ఘాయుర్దాయమును, ఉన్మేషయిత్రీ = వికసింపచేసేదీ, ఇచ్చేదీ, దిక్షు = దిక్కులయందు, యశఃదాత్రీ = కీర్తిని వ్యాపింపచేసేదీ, ధాత్రీవ = పెంపుడుతల్లి వలె, మామ్ = నన్ను, పాలయిత్రీ చ = పాలించేదీ కూడ అవుతుంది. సా = ఆ భక్తి, దశాన్తే = జీవితాంతము నందు, ఇమామ్ = ఈ, తవ ధరిత్రీమ్ = నీ లోకమును, ప్రాపయేత్ = పొందించును. అన్తే = అంతమునందు, మహ్యమ్ = నాకు, తేజసా = తేజస్సుతో కూడిన, పదమ్ = స్థానమును, దాస్యతే = ఇవ్వగలదు. తేన = ఆ కారణంచేతనే, భూయసా = అధికంగా, సా భక్తి, ఆశాస్యతే = కోరబడుచున్నది. పామరాన్ = పామరులైన, అమరాన్ = దేవతలను, సేవితుమ్ = సేవించుటకు, న కామయే = కోరను

మూలమ్ :- సోఽమరాధీశ్వరోఽప్యామరానశ్వరైశ్వర్యభఙ్గప్రవృత్తం పురా లోక విద్రావణం రావణం హన్తుమేవావతీర్ణస్త్వదీయాన్వయే రామనామా - త్రిధామా హరిర్యుద్ధసీమాన - ముచ్చణ్డధామా సమాగత్య భీమాన్ సమాహత్య కల్పాన్త - జీమూత - కల్పా - నసృక్పానతః ప్రాప్తదర్పానసుగ్రాససర్పానదర్పాశయస్తం జగత్పాలనోత్పాది తస్ఫారసన్నాహ ఏవ, ప్రపన్నాగ్రహం పట్టసప్రాసహస్తం పురస్తాత్సమీకే విహస్తం ప్రహస్తం సమాకల్ప్య సానుప్లవం మృత్యుసోపప్లవం సప్లవఙ్గావలీకః ప్లవఙ్గాభిషఙ్గా పిశఙ్గాతితుఙ్గాఖిలాఙ్గాతిభీమం పురస్తాదపాస్తాయసస్తమ్భవర్ణం రణే కుమ్భకర్ణం చ కృత్వా

ధనుర్వృష్టి - నిష్యూత - నైష్ఠుర్యవద్బాణ - నిర్ఘాత - నిష్పాత -నిష్పాదిత - ప్రాణనిభ్రంశ - ధైర్యో, దినభ్రంశ - విభ్రామ్యద్భ్రాన్తర - ధ్వాన్త - సచ్ఛాయ - కాయాతికాయాది - రక్షోనికాయాధి - కాయామ - మాయాగవీపాటనోద్గాఢ - రూఢాద్భుత - ప్రౌఢి - సంపత్సమాలీఢ - కౌశారికాడమ్బరం జృమ్భయిత్వా, క్షయం లమ్భయిత్వా సదమ్భాన్ పరాభూత - జమ్భాహితాం శ్చాపరానాశరాన్ యుద్ధసన్నద్ధ - మౌద్ధత్య - దుర్ధర్ష - ముచ్ఛృఙ్ఖల - క్రోధవహ్ని - స్ఫులిఙ్గోద్గమ - క్రూర - తారావలీ - ఘోర - నారాచ - ధారా - కఠోరాక్షిభిర్దుర్నిరీక్షం రణక్షోణి - విక్షోభ - దక్షోరు - రక్షో భటాక్షౌహిణీ - క్లప్తరక్షోపకణ్ఠం, పురఃపఙ్క్తికణ్ఠం, కరశ్రేణినిశ్రేణి కారూఢ - ఘూర్ణద్గదా - భిణ్డివాల - త్రిశూల - క్షురప్రాసి - దీప్రాంచలప్రాస - బాణాస - బాణాది - నానాయుధాక్రాన్త - దిక్చక్రమ్.

వ్యాఖ్యానము :-. సః = ఆ, అమరాధీశ్వరోఽపి = దేవతల అధిపతి యైన, విష్ణువు కూడ, పురా = పూర్వమునందు, ఆమర = దేవతలకు సంబంధించిన, అనశ్వర = నాశము లేని, ఐశ్వర్య = ఐశ్వర్యముయొక్క, భఙ్గ = భంగమునందు, ప్రవృత్తమ్ = ప్రవర్తించినవాడు, లోకవిద్రావణమ్ = లోకములను భయంచేత పారిపోయే టట్లు చేసినవాడు, అయిన, రావణమ్ = రావణుని, హన్తుమేవ = సంహరించుటకే, త్వదీయాన్వయే = నీ వంశమునందు, అవతీర్ణః = అవతరించినవాడు. రామనామా త్రిధామా = రాము దను పేరు గల, మూడు లోకాలలో స్థానంగల, ఉచ్చణ్డధామా = తీవ్రమైన తేజస్సు గల, హరిః = విష్ణువు, యుద్ధసీమానమ్ = యుద్ధభూమిని గూర్చి, సమాగత్య = వచ్చి, కల్పాన్తజీమూతకల్పాన్ = కల్పాంతమునందలి మేఘములతో సమానులు, అసృక్పానతః = రక్తపానముచేత, ప్రాప్తదర్పాన్ = పొందబడిన దర్పం గలవారు, అసుగ్రాససర్పాన్ = ప్రాణాలను మింగే సర్పములైన, ప్రాణాలను తీయడంలో సర్పాలవంటివాళ్లు అని అర్థం; భీమాన్ = భయంకరులైన రాక్షసులను, సమాహత్య = సంహరించి (కూడ), అదర్పాశయః = దర్పంలేని మనస్సు కలవాడై, జగత్పాలనోత్పాదిత స్ఫారసన్నాహః ఏవ = జగత్తును పాలించుటకు పుట్టింపబడిన (చేయబడిన) గొప్ప సన్నాహం (యుద్ధసన్నద్ధత్వం) కలవాడగుచునే, సప్లవఙ్గావలీకః =వానరపంక్తులతో కూడినవాడై, సమీకే = యుద్ధమునందు, ప్రపన్నాగ్రహమ్ = పొందబడిన పట్టుదలకలవాడు, పట్టసప్రాసహస్తమ్ = పట్టసములు ప్రాసలు హస్తములందు గలవాడు, సానుప్లవమ్ = అనుచరులతో కూడినవాడు అయిన, ప్రహస్తమ్ = ప్రహస్తు దను రావణామాత్యుని, విహస్తమ్ = ఓడిపోయినవానినిగాను, మృత్యుసోపప్లవమ్ = మరణోపద్రవం చెందినవానినిగాను (మరణించినవానినిగాను), సమాకల్ప్య = చేసి,

ప్లవఙ్గాభిషఙ్గ = వానరుల సంబంధంచేత (వానరులందరూ వానిపై ఎక్కడంచేత)

ఆపిశఙ్గ = పసుపుపచ్చగా ఉన్న, అతితుఙ్గ = చాల ఎత్తైన, అఖిలాఙ్గ = సమస్తమైన దేహంతో, అతిభీమమ్ = చాల భయంకరు డైనవాడు; రణే = రణ రంగమునందు, పురస్తాత్ = ఎదుటకు వచ్చినవాడు అయిన, కుమ్భకర్ణం చ = కుమ్భకర్ణుని కూడ, అపాస్త = దూరంగా విసరివేయబడిన, ఆయసస్తమ్భవర్ణమ్ = ఇనుప స్తంభంవంటిరంగు గలవానినిగా, కృత్వా = చేసి, (లేదా కృత్త్వా = ఛేదించి) అనగా కుంభకర్ణుణ్ణిఛేదించి వానిని ఇనుపదూలం దూరంగా పడవేసి నట్లు పడవేసి అని అర్థం. ధనుర్యష్టి = ధనుర్దండమునుండి, నిష్యూత = విడవబడిన(చిమ్మబడిన), నైష్ఠుర్యవద్బాణ = నైష్ఠుర్యం గల బాణాల, నిర్ఘాతనిష్పాత = పిడుగుల వంటి పడడములచేత, నిష్పాదిత = చేయబడిన, ప్రాణవిభ్రంశ = శత్రుప్రాణవినాశనము నందు, ధైర్యః = ధైర్యం కలవాడై,

దినభ్రంశ = సాయంకాలమునందు లేదా రాత్రియందు, విభ్రామ్యత్ = ఆకాశంలో సంచరించుచున్న (ఎగురుచున్న), అభ్రాన్తరధ్వాన్త = మేఘమధ్యము లందలి లేదా ఆకాశమధ్యమునందలి, చీకట్లతో, సచ్ఛాయ = సమానమైన కాంతి గల, కాయ = శరీరాలు గల, అతికాయాది = అతికాయుడు మొదలైన, రక్షోనికాయ = రాక్షస సమూహముల, అధికాయామ = అతిదీర్ఘమైన, మాయాగ = మాయ లనే వృక్షాల లేదా పర్వతాల, వీ(వి)పాటన = చీల్చివేయడంలో, ఉద్గాఢ = అత్యధికమైన, రూఢ = పెంపొందిన, అద్భుతప్రౌఢి = ఆశ్చర్యకర మైన ప్రౌఢత్వము యొక్క, సంపత్ = సంపత్తుచేత, సమాలీఢ = వ్యాప్తమైన, కౌఠారికాడమ్బరమ్ = కుఠారధరుని ఆడంబరం వంటి ఆడంబరాన్ని, జృమ్భయిత్వా = విజృంభింపచేసి, అతికాయాదులు ప్రయోగించిన మాయావృక్షాదులను ఛేదించి అని భావం. సదమ్భాన్ = ఆటోపంతో కూడినవాళ్లు, పరాభూతజమ్భాహితాన్ = దేవేంద్రుణ్ణి కూడ ఓడించిన వాళ్లు అయిన, అపరాన్ ఆశరాన్ = ఇతర (మిగిలిన) రాక్షసులను కూడ, క్షయం లమ్భయిత్వా = క్షయం పొందించి, సంహరించి (ఉన్న రాముడు)

'యుద్ధసన్నద్ధమ్' మొదలైన 'పఙ్క్తికణ్ఠమ్' అనుదానికి విశేషణాలు. యుద్ధ సన్నద్ధమ్ = యుద్ధానికి సన్నద్ధుడు, ఔద్ధత్యదుర్ధర్షమ్ = ఔద్ధత్యంతో ఎదిరింప శక్యం కానివాడు, ఉచ్ఛృఙ్ఖల = అడ్డు లేని, క్రోధవహ్ని = క్రోధాగ్నినుండి, స్ఫులిఙ్గ = నిప్పునెరసుల, ఉద్గమ = బయల్వెడలుటచేత, క్రూర = క్రూరమైన, తారావలీ = కంటిలోని గుడ్ల పంక్తు లనే, ఘోరనారాచధారా = భయంకరమైన నారాచబాణాల ధారలచేత, కఠోర = కఠినమైన (భయంకరమైన), అక్షిభిః = నేత్రాలతో, దుర్నిరీక్షమ్ = చూడడానికి శక్యంకాకుండా ఉన్నవాడు, రణక్షోణి = రణభూమియొక్క (ని), విక్షోభ = క్షోభింపచేయడంలో, దక్ష = సమర్థులైన, ఉరు = గొప్పవైన, రక్షోభటా– క్షౌహిణీ = రాక్షసభటుల అక్షౌహిణులచేత, క్లప్తరక్ష = ఏర్పరుపబడిన రక్షణ గల, ఉపకణ్ఠమ్ = సమీపప్రదేశాలు కలవాడు, కరశ్రేణి

= హస్తపంక్తు లను, నిశ్రేణికా = నిచ్చెనయందు, ఆరూఢ = ఎక్కిన (ఉన్న), ఘూర్ణత్ = తిరుగుచున్న, గదా = గద, భిణ్డివాల = భిండివాల మనే ఆయుధం, త్రిశూల = త్రిశూలము, క్షురప్ర =క్షురప్రము, అసి = ఖడ్గము, దీప్రాంచలప్రాస = మెరుస్తూన్న అంచులు గల ప్రాస, బాణాస = ధనుస్సు, బాణాది = బాణము మొదలైన, నానాయుధాక్రాన్త = అనేక విధాలైన ఆయుధాలచేత ఆక్రమింపబడిన, దిక్చక్రమ్ = దిక్కుల చక్రము (అన్నిదిక్కులూ కలవాడు)

మూలమ్ :– ఆరూఢవన్తం మహాన్తం రథం స్వప్రయుక్తాని మత్తారి – విత్రాస – దాన – ప్రవృత్తాని తత్తావదాగ్నేయ – వాయవ్య – మన్త్రాది – మన్త్రానువిద్ధాని, శస్త్రాణి భిన్దాన – మిన్ద్రాగ్ని – బృన్దారకోత్సారణై – రాశుగై – ర్దారుణై – రాహవాజయ్య – మక్షయ్య – చణ్డాస్త్రవర్షం, స్వతోఽ ప్యాహితోత్కర్ష – ముద్వీక్ష్య నిర్జేతుమేనం సమర్థేతర – స్తజ్జయార్థే విచిన్త్యాకులః స్వాన్తసంతాపమేవానుసన్ధాయ హన్తాయ – మగ్రే నిహన్తా కపీనా – మహన్తా – మనన్తాం – సమభ్యేత్యహం తావదేనం నిహన్తా కథం వేతి తాం తోరణే శ్రాన్త ఏవ స్థితశ్చాపయష్టిమవష్టభ్యదోర్భ్యామహృష్టాశయః స్వస్య కష్టాం దశామేక్ష్య తస్మిన్ రణే.

వ్యాఖ్యానము :– (ఈ ద్వితీయాంతాలు కూడ 'పంక్తికణ్ఠమ్' = అనుదానికి విశేషణాలు) మహాన్తమ్ = గొప్ప, రథమ్ = రథమును, ఆరూఢవన్తమ్ = ఎక్కినవాడు, స్వప్రయుక్తాని = తనచేత (రామునిచేత) ప్రయోగింపబడినవి, మత్తారి = మదించిన శత్రువులకు, విత్రాసదాన = భయం కలిగించుటయందు, ప్రవృత్తాని = ప్రవర్తించు నవీ, తత్ = ప్రసిద్ధమైన, తావత్ = అంతటి, అన్ని, ఆగ్నేయవాయవ్య మన్త్రాది = ఆగ్నేయమంత్రము, వాయవ్యమంత్రము, మొదలైన, మన్త్రానువిద్ధాని = మంత్రము లతో కూర్చబడిన, శస్త్రాణి = శస్త్రములను, ఇన్ద్రాదిబృన్దారకోత్సారణైః = ఇంద్రుడు మొదలైన దేవతలను దూరంగా పారిపోవు నట్లు చేసి, దారుణైః = భయంకరము లైన, తీవ్రములైన, ఆశుగైః = బాణాలతో, భిన్దానమ్ = భేదించివేయుచున్నవాడు, ఆహవాజయ్యమ్ = యుద్ధమునందు జయింపశక్యం కానివాడు, అక్షయ్యచణ్డాస్త్రవర్షమ్ = అక్షయములైన తీవ్రము లైన అస్త్రములను వర్షించుచున్నవాడు, స్వతోఽ పి = తనకంటె కూడ (రామునికంటె కూడ), ఆహితోత్కర్షమ్ = ఉంచబడిన (చూడ బడిన) ఉత్కర్ష (ఆధిక్యం) కలవాడు అయిన, పఙ్క్తికణ్ఠమ్ = దశకంఠుని, పురః = ఎదుట, ఉద్వీక్ష్య = చూచి, సమర్థేతరః =అసమర్థుడై, తజ్జయార్థే = వానిని జయించు విషయంలో, విచికిత్సాకులః = సంశయముతో వ్యాకులుడై, హన్త! = ఆహా! అయ్యో! అగ్రే = నా ఎదుటనే, కపీనాం హన్తా = వానరులను చంపుచున్న ఇతడు, అనన్తామ్ = అనంతమైన, అహన్తామ్ = అహంకారమును, అభ్యేతి = పొందుచున్నాడు; అహం తావత్ = నేనైతే, ఏనమ్ =

వీనిని, కథం వా = ఎట్లు, నిహన్తా = చంపగలవాడను, ఇతి = అని, స్వాన్తచిన్తామేవ = మనస్సులో చింతనే, అనుసన్ధాయ = కూర్చుకొని, పొంది, తస్మిన్ రణే = ఆ రణమునందు, స్వస్య = తనయొక్క, కష్టాం దశామ్ = కష్టమైన అవస్థను, ఏక్ష్య = చూచి, అహృష్టాశయః = సంతోషించని మనస్సు కలవాడై, శ్రాన్తః = అలసిపోయినవాడై, తాం చాపయష్టిమ్ = ఆ ధనుర్దండమును, దోర్భ్యామ్ = బాహువులచేత, అవష్టభ్య = ఆనుకొని, ఊతగా చేసికొని, తోరణే ఏవ = ద్వారమునందే, స్థితః = రాముడను పేరుతో ఉన్న హరి నిలబడి ఉండెను.

మూలమ్ :- పఙ్క్తికణ్ఠం రణోచ్చణ్డ - ముత్కణ్ఠయిష్యస్యలం - చిన్తయా పీడితస్వాన్తయా చిన్తయాదిత్యమాదిత్యవంశధ్వజాభీష్టసంసిద్ధయే, సైష ధాతా, పురాణాం చ జేతా, విజేతా చ దేవద్విషాం దేవనేతా చ, తాపాధినేతాఽమ్బునేతా చ యక్షాధినేతా, స్వయం సర్వదేవాకృతిః, సర్వదేవాత్మకః, సర్వలోకేశ్వరః, సర్వచక్షుర్మయః, సర్వతేజోమయః, సర్వరక్షాకరః, సర్వసంపత్కరః, సర్వదిక్పావనః, సర్వమౌనిస్తుతః, సర్వవిద్యామయః, సర్వమేతజ్జగచ్చక్రమేతన్మయత్వేన సంభావనీయం త్వయా, వేదమాతుః పరా దేవతేయం, పరం వేదమన్త్రాన్తరస్థం, మహామన్త్ర మారాధయన్తస్య మన్త్రానుభావం విదన్తో జనాస్తం త్వమారాధయాదిత్యమన్త్రేణ శత్రుం రణే జేష్యసీతి త్వదీయం మహామన్త్రమష్టాక్షరం, శిష్టమిష్టప్రదం కుమ్భజేనోపదిష్టం గృహీత్వా త్రిరాచమ్య జప్త్వా చ నత్వాపి హత్వా దశగ్రీవ - ముద్గ్రీవ - మాయోధనోద్గ్రీవ - సుగ్రీవ - సేనాభి - రుగ్రీభవన్ ఖణ్డితగ్రీవ - మాకల్ప్య, సీతాం పునః ప్రాప్య సాక్షాన్మహోక్షధ్వజ - బ్రహ్మదేవాగ్రణీపూర్వ దేవాభితోష్టూయమానో విమానోపరి ద్యోతమానో, దధానో ముదం సేవ్యమానోఽమరై - స్తామయోధ్యాపురీ - వీథిమధ్యావనీం సానుమధ్యాసితం వృద్ధసిద్ధర్షిభిః ప్రాప్యతత్రాధిగత్యైవ పిత్రాలయం స్వస్య మాత్రాశిషా సాతిమాత్రాశయప్రీతి -రారబ్ధపట్టాభిషేకో వసిష్ఠాదిభిః సీతయా సాక - మారూఢభద్రాసనో రామభద్రాభిధానో హరిః, తజ్జయస్యాపి, తద్విక్రమస్యాపి మూలం తవారాధనమ్.

వ్యాఖ్యానము :- (ఇవి అగస్త్యుడు వచ్చి రామునితో అన్న మాటలు) ఆదిత్యవంశధ్వజ! = సూర్యవంశానికి ధ్వజమువంటి ఓ! రామా! పీడితస్వాన్తయా = పీడించబడిన మనస్సుగల, చిన్తయా = చింతతో, అలమ్ = చాలును; చింతించకుము. రణోచ్చణ్డమ్ = యుద్ధంలో తీవ్రస్వభావం గల, పఙ్క్తికణ్ఠమ్ = దశకంఠుణ్ణి, ఉత్కణ్ఠయిష్యసి = తీసివేయబడిన కంఠాలు గలవానినిగా చేయగలవు. ఆదిత్యమ్ = ఆదిత్యుణ్ణి, సంసిద్ధయే = కార్యసిద్ధికొరకు, చిన్తయ = ధ్యానించుము. సః ఏషః = ప్రసిద్ధు డైన ఈ ఆదిత్యుడు, ధాతా = బ్రహ్మదేవుడు; పురాణాం జేతా చ = పురములను జయించినవాడు; రుద్రుడు. దేవద్విషామ్ = దేవతల శత్రువులైన రాక్షసులకు (ను) విజేతా చ = జయించినవాడు.

విష్ణువు; దేవనేతా = దేవేంద్రుడు, తాపాధినేతా = నరకప్రభువు, యముడు, అమ్బునేతా = వరుణుడు, స్వయమ్ = తానే, సర్వదేవాకృతిః = సకల దేవతాస్వరూపుడు, సర్వదేవాత్మకః = సర్వదేవాత్మకుడు. సర్వలోకేశ్వరః = సకల లోకములకు ఈశ్వరుడు, నియమించువాడు. సర్వచక్షుర్మయః = సకలప్రాణినేత్ర స్వరూపుడు. సర్వతేజోమయః = సకలతేజఃస్వరూపుడు. సర్వరక్షాకరః = అందరి రక్షణము చేసేవాడు. సర్వసంపత్కరః = అన్ని సంపదలు ఇవ్వగలిగినవాడు.

సర్వదిక్పావనః = అన్ని దిక్కులను పవిత్రింపచేయువాడు. సర్వమౌనిస్తుతః = మునులందరిచేతా స్తుతింపబడువాడు. సర్వవిద్యామయః = సకలవిద్యాస్వరూపుడు. సర్వమ్ = సమస్తమైన, ఏతత్ జగత్ = ఈ జగత్తు, ఏతన్మయత్వేన = ఈ సూర్యస్వరూపమే అయి ఉన్నది అని, త్వయా = నీచేత, సంభావనీయమ్ = భావింపదగినది. ఇయమ్ = ఇది, ఈ ఆదిత్యుడు, వేదమాతుః = వేదమాతకంటె కూడ, పరా = ఉత్తమమైన, దేవతా = దేవత. అస్య = ఈ ఆదిత్యునియొక్క, మన్త్రానుభావమ్ = మంత్రముయొక్క ప్రభావమును, విదన్తః = ఎరిగిన, జనాః = జనులు, వేదమన్త్రాన్తరస్థమ్ = వేద మంత్రాల మధ్యలో ఉన్న, మహామన్త్రమ్ = గాయత్రీమంత్రమును, లేదా సూర్యాష్టాక్షరీమంత్రమును, ఆరాధయన్తి = ఆరాధి స్తూంటారు. త్వమ్ = నీవు, ఆదిత్యమన్త్రేణ = ఆదిత్యమంత్రంతో, తమ్ = ఆ ఆదిత్యుణ్ణి, ఆరాధయ = ఆరాధించుము. రణే = యుద్ధమునందు, శత్రుమ్ = నీ శత్రువైన రావణుని, జేష్యసి = జయించగలవు,

ఇతి = అని పలికి, కుమ్భజేన = అగస్త్యునిచేత, ఉపదిష్టమ్ = ఉపదేశించబడిన, శిష్టమ్ = శ్రేష్ఠమైన, ఇష్టప్రదమ్ = ఇష్టములను ఇచ్చే, త్వదీయమ్ = నీకు సంబంధించిన, అష్టాక్షరం మహామన్త్రమ్ = ఎనిమిదక్షరాలు గల మహామంత్రాన్ని, గృహీత్వా = గ్రహించి, త్రిః = మూడు పర్యాయాలు, ఆచమ్య = ఆచమనం చేసి, జప్త్వా చ = ఆ మహామంత్రం జపించి, నత్వాపి = నీకు నమస్కారం కూడ చేసి, ఆయోధనోద్గ్రీవమ్ = యుద్ధమునకు అభిముఖుడైన, ఉద్గ్రీవమ్ = ఛేదించినా కూడ మళ్లీ మొలుస్తూన్న కంఠాలు గల, దశగ్రీవమ్ = దశగ్రీవుణ్ణి, ఉద్గ్రీవసుగ్రీవసేనాభిః = ఉత్కంఠతో మెడ లెత్తి చూస్తూన్న సుగ్రీవుని సేనలతో కూడి, ఉగ్రీభవన్ = ఉగ్రమూర్తి కలవా డగుచు, హత్వా = సంహరించి, సీతామ్ = సీతను, పునః = మరల, ప్రాప్య = పొంది, సాక్షాత్ = ప్రత్యక్షంగా, మహోక్షధ్వజ = వృషభధ్వజు డైన పరమేశ్వరుడు, బ్రహ్మా = బ్రహ్మదేవుడు, దేవాగ్రణీ = దేవనాయకుడైన దేవేంద్రుడు, పూర్వ = మొదలైన, దేవతాభిష్టూయమానః = దేవతలచేత మాటిమాటికి అత్యధికముగా స్తుతింపబడుచు, విమానోపరి = పుష్పకవిమానంమీద, ద్యోతమానః = ప్రకాశించుచు, ముదం దధానః = ఆనందవంతుడై, అమరైః = దేవతలచేత, సేవ్యమానః = సేవింపబడుచు, వృద్ధసిద్ధర్షిభిః = వృద్ధులచేత, సిద్ధులచేత, ఋషులచేత, అధ్యాసితమ్

= అధిష్ఠింపబడిన, సానుమ్ = పర్వతముయొక్క చరియ అయిన, ఇది రూపకము. అయోధ్యాపురమధ్యభూమి సిద్ధులు, ఋషులు నివసించు పర్వతసానువువలె అతిపవిత్ర మైనది అని భావం. అయోధ్యాపురీవీథిమధ్యావనిమ్ = అయోధ్యాపుర వీథిమధ్యయం దున్న ప్రదేశమును, అనగా దశరథమహారాజు ప్రాసాదమున్న, ప్రదేశమును, ప్రాప్య = పొంది, చేరి, తత్ర = అక్కడ, పిత్రాలయమ్ = తండ్రి గారి భవనమును, అధిగత్య ఏవ = చేరగానే,

స్వస్య = తనయొక్క, మాత్రాశిషా = తల్లుల ఆశీస్సుచే, సాతిమాత్రాశయప్రీతిః = అత్యధికమైన మానసప్రీతి (ఆనందం) కలవాడై, రామభద్రాభిధానః = రామభద్రు డను పేరుతో ఉన్న, హరిః = మహావిష్ణువు, వసిష్ఠాదిభిః = వసిష్ఠుడు మొదలైన మునులచేత, ఆరబ్ధపట్టాభిషేకః = ప్రారంభింపబడిన సామ్రాజ్యపట్టాభిషేకం గలవాడై, సీతయా సాకమ్ = సీతతో, ఆరూఢభద్రాసనః = అధిష్ఠించబడిన మంగళకరమైన సింహాసనం కలవాడైనాడు. సింహాసనం అధిష్ఠించి రాజ్యపాలనం నిర్వహించాడు. తజ్జయస్య అపి = ఆ రాముడు చేసిన శత్రుజయానికి, తద్విక్రమస్యాపి = ఆతని పరాక్రమమునకు, తవ ఆరాధనమ్ = నీ (నిన్ను) ఆరాధనయే (ఆరాధించుటయే), మూలమ్ = ప్రధానకారణము.

మూలమ్ :- **తత్త్వదారాధనప్రీతిరేవాస్తు మే; త్వం పితా మే త్వమేవాసి మాతా చ మాతామహస్త్వమ్, సఖా మే త్వమేవాసి, బన్ధుర్గురుస్త్వం హి మే, త్వాం ప్రపద్యే త్వదేకాశ్రయస్త్వాం ప్రశంసామి సంసారవిచ్ఛిత్తయే; త్వాం వినాఽన్యం న సేవే;త్వయి స్వాన్తమాస్తే; త్వయి న్యస్తభారోఽస్మి, సత్యం వదామి, త్వదారాధకానామ్; సమారాధయే త్వాం దిదృక్షాపరస్తేఽక్షరక్షేమహేతోస్త్వదాయత్తమేవాస్తు చిత్తం చ మే త్వం పరం దైవతమ్. త్వన్మయానేవ దేవానహం భావయే; త్వం భవామ్భోనిధేర్మాం సముత్తారయ; త్వం మమోద్ధిన్ది తద్దైన్యముద్భటమ్; త్వత్ప్రసాదోఽస్తు మే; త్వం ధనం చాక్షయమ్; త్వత్కృతారోగ్యభాగ్యో భవేయమ్. త్వయా ముక్తిసంపత్ప్రదేయా చ కాలాత్యయే, త్వం వయో దేహి దీర్ఘం, త్వదభ్యర్చనాయాస్తు దీర్ఘం వయః సప్తసప్తే! నమస్తే దినేశాయ చణ్డత్విషే చణ్డధామ్నే నమస్తుభ్యమాదిత్య! తుభ్యం నమః సర్వలోకాత్మనే దేవ! తుభ్యం నమఃసర్వదేవాత్మనే దేవ, తుభ్యం నమః సర్వదేవాత్మనే దేవ, తుభ్యం నమః సర్వదేవాత్మనే దేవ! తుభ్యం నమో నమః.**

వ్యాఖ్యానము :- తత్ = ఆ కారణంవల్ల, మే = నాకు, త్వదారాధనప్రీతిరేవ = నిన్ను ఆరాధించుటయందు ప్రీతియే, అనగా నిన్నే ఆరాధించడంలో ప్రీతి, అస్తు = ఉండుగాక. త్వమ్ = నీవే, మే = నాయొక్క, పితా = తండ్రివి, తమేవ = నీవే, మాతా చ అసి = తల్లివి కూడ అయి ఉన్నావు. త్వమ్ = నీవే, మాతామహః = మాతామహుడవు, త్వమేవ = నీవే, మే = నా, సఖా అసి = స్నేహితుడవు అయి ఉన్నావు. త్వమ్ = నీవే, మే

= నా, బన్ధుః = బంధువు, గురుః = గురువు, త్వదేకాశ్రయః = నీవు ఒక్కడవే ఆశ్రయంగా గల నేను, త్వామ్ = నిన్ను, ప్రపద్యే = శరణు పొందుచున్నాను.. సంసారవిచ్ఛిత్తయే = నా సంసారం తొలగిపోవడానికై, త్వామ్ = నిన్ను, ప్రశంసామి = స్తుతిస్తున్నాను. త్వాం వినా = నిన్ను కాదని, అన్యమ్ = ఇతరుణ్ణి ఎవనినీ, న సేవే = సేవించను. స్వాన్తమ్ = నా చిత్తము, త్వమ్ = నీపైననే, ఆస్తే = ఉన్నది. త్వయి = నీపైననే, న్యస్తభారః అస్మి = ఉంచబడిన భారం కలవాడను అయిన ఉన్నాను. భారం ఉంచాను. త్వదారాధకానామ్ = నీ ఆరాధన చేసేవాళ్లకు, సత్యం వదామి = సత్యం చెపుతున్నాను.

అక్షరక్షేమహేతోః = వినాశం లేని శాశ్వతమైన క్షేమం కొరకు, తే దిదృక్షాపరః = నిన్ను సాక్షాత్కరించుకొనవలె నని ఆసక్తి గలవాడనై, త్వామ్ = నిన్ను, సమారాధయే = ఆరాధించుచున్నాను. మే చిత్తం చ = నా చిత్తం కూడ, త్వదాయత్తమేవ = నీకే అధీనమై, అస్తు = ఉండుగాక. త్వమ్ = నీవే, పరమ్ = అత్యుత్కృష్టమైన, దైవతమ్ = దేవతవు. అహమ్ = నేను, దేవాన్ = దేవతలందరినీ, త్వన్మయానేవ = నీ స్వరూపంలోనే ఉన్నావారినిగా, భావయే = భావించుచున్నాను. త్వమ్ = నీవు, మామ్ = నన్ను, భవామ్భోనిధేః = సంసారసముద్రమునుండి, సముత్తారయ = తరింపచేయుము, పైకి తీయుము. త్వమ్ = నీవు, మమ = నాయొక్క, అత్యుద్భటమ్ = చాల తీవ్రమైన, తత్ దైన్యమ్ = ఆ దైన్యమును, ఉద్భిన్ధి = భేదించుము. మే = నాకు, త్వత్ప్రసాదః = నీ అనుగ్రహం, అస్తు ఉండుగాక. త్వమ్ = నీవే, అక్షయం ధనమ్ = నా క్షయం లేని ధనమ్, త్వత్కృతారోగ్యభాగ్యః = నీచేత చేయబడిన (కలిగింపబడిన) ఆరోగ్య మను భాగ్యం కలవాడను, భవేయమ్ = అగుదునుగాక. త్వయా = నీచేత, కాలాత్యయే = నా జీవనకాలం గడచి నప్పుడు, ముక్తిసంపత్ = మోక్ష మను సంపద, ప్రదేయా = ఇవ్వదగినది. త్వమ్ = నీవు, దీర్ఘం వయః = దీర్ఘ మైన వయస్సును, దేహి = ఇమ్ము. దీర్ఘం వయః = నీవు అనుగ్రహించిన ఆ దీర్ఘాయుర్దాయము, త్వదభ్యర్చనాయ = నిన్ను పూజించడానికి, అస్తు = వినియోగింప బడుగాక.

సప్తసప్తే! = సప్తాశ్వుడవైన ఓ ఆదిత్యా! దినేశాయ = దినములకు ఈశ్వరుడవు, చణ్డత్విషే = తీవ్రమైన కాంతి కలవాడవు అయిన, తే = నీకు, నమః = నమస్కారము. ఆదిత్య! = ఓ ఆదిత్యా!, చణ్డధామ్నే = తీక్ష్ణమైన కాంతిగల, తుభ్యమ్ = నీకు, నమః = నమస్కారము. దేవ! = దేవా, ప్రకాశించువాడా! సర్వలోకాత్మనే = సకలలోకస్వరూపుడవైన, తుభ్యమ్ = నీకు, నమః = నమస్కారము. దేవ! = ఓ దేవా! సర్వదేవాత్మనే = సమస్తదేవతాస్వరూపుడ వైన, తుభ్యమ్ = నీకు, నమః = నమస్కారము. దేవ! = ఓ దేవా! సర్వదేవాత్మనే = సర్వదేవతాస్వరూపుడవైన, తుభ్యమ్ = నీకు, నమః = నమస్కారము, "భక్త్యతిశయంచేత తుభ్యం నమః సర్వదేవాత్మనే" అను వాక్యం మూడు పర్యాయాలు

ఉచ్చరించబడినది. దేవ! = దేవా! తుభ్యమ్ = నీకు, నమః నమః = నమస్కారము, నమస్కారము. మరీ మరీ నమస్కారము.

శ్లో॥ మయూరకవినా కృతః సకలలోకమోదావహః
విచిత్రపదసున్దరో విబుధదన్తితీక్ష్ణాఙ్కుశః ।
సురాసురపరిష్టుతాదిమవచోవపుర్దణ్డకః
సమస్తకుశలాప్తయే భవతు సజ్జనానాం చిరమ్ ॥

సూర్యదణ్డకః సంపూర్ణః

వ్యాఖ్యానము :- మయూరకవినా = మయూరకవిచేత, కృతః = రచింపబడినది, సకలలోక మోదావహః = సకలజనులకు ఆనందమును కలిగించేది, విచిత్రపదసున్దరః = విచిత్రపదములతో సుందరమైనది, విబుధదన్తితీక్ష్ణాఙ్కుశః = పండితు లనే ఏనుగులకు, తీక్ష్ణమైన అంకుశమూ, అర్థం చేసికొనలేని పండితమన్యులను అడుగడుగునా ముందుకు సాగకుండా చేసేది అని అర్థం. సురాసురపరిష్టుతాదిమ- వచోదణ్డకః = సురాసురులచేత స్తుతింపబడిన, ఆదిమవచోవపుస్సుయొక్క, అనగా అపౌరుషేయ మైన ప్రాచీనవాక్కు అయిన వేదముల స్వరూపమైన సూర్యుని, దణ్డకః = దణ్డకం, సజ్జనానామ్ = సజ్జనులకు, చిరమ్ = చిరకాలము, సమస్తకుశలాప్తయే = సమస్తకుశలముల ప్రాప్తికి, భవతు = అగుగాక. కుశలప్రాప్తిని కలిగించుగాక.

సూర్యదండకం సంపూర్ణం.

శ్రీః శ్రీః శ్రీః

ఆత్మజ్యోతి పాఠకులారా!

ఈ సూర్యదండకాన్ని కంఠహారంగా ధరించి ఆయురారోగ్యములు అనుభవింతురుగాక. - రామోరా.

✦ ✦ ✦



మహాభారతం - మానవ స్వభావ చిత్రణ

సందేహ - సమాధానమాల

- డా॥ అప్పజోడు వేంకట సుబ్బయ్య, కర్నూలు.

ధర్మవ్యాధుడు కౌశికుడికి చెప్పిన సత్యాహింసల ధర్మసూక్ష్మాలు – పుణ్య పాప కర్మ ఫలాలు

"అహింసా పరమో ధర్మః" అన్నది వేదం. **"సత్యం వద"** అన్నది వేదం.

కౌశికుడు నీవు హింసామార్గంలో ఉన్నావని అనగనే, ధర్మవ్యాధుడు ఏది హింసో? ఏది అహింసో? చెపుతూ "హింస సేయనివాఁడు లేఁడిజ్జగమున నొక్కఁడైనను" అన్నాడు. ఈ వాక్యాన్ని వివరిస్తూ రైతు భూమిని దున్నుతుంటే ఎన్నో ప్రాణులు అతని నాగలి కర్రుకు తగిలి చచ్చిపోతున్నాయి. అది హింసకాదా? అది హింస అని ప్రతి రైతు భూమిని దున్నటం మానివేస్తే మనిషికి తిండి ఎలాగ?

అంతేకాదు 'సలిలము లుర్వి అకసము సర్వము జంతుమయంబు' నీళ్ళలో, నేలమీద, ఆకాశంలో కోటానుకోట్ల సూక్ష్మజీవులున్నాయి. నీళ్ళు త్రాగినా, నేలమీద నడిచినా ఆ సూక్ష్మజీవుల్లో అనేకం చచ్చిపోతున్నాయి. అది హింస అని నీళ్ళు త్రాగటం, నేలమీద నడవటం, గాలి పీల్చటం మానివేస్తే మనిషి జీవించటం ఎలాగ?

అంతేకాదు. అహింసా వ్రతం పూని అడవుల్లో ఉన్న ఋషీశ్వరులు ఆహారంగా తీసుకునె కందమూల ఫలాల్లో మాత్రం ప్రాణం లేదా? వీటిలో ప్రాణం ఉందికదా అని తినకుంటే ఆ ఋషీశ్వరులు బ్రతకటం ఎలాగ? అందువల్ల హింసలేకుండా మానవుని జీవయాత్ర సాగటం అసాధ్యం.

అయితే మరి అహింస అంటే ఏమిటి? "తమతమ యోపినట్ల – హింస తెరువున కెడఁగల్గి యేఁగవలయు– నదియ చూవె యహింస నా నతిశయిల్లు" అని, అహింసకు నిర్వచనం చెప్పాడు ధర్మవ్యాధుడు. అంటే 'అహింసా పరమో ధర్మః' అని వేదం చెప్పినా– హింసకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండటమే అహింస. ఇదే ధర్మసూక్ష్మం. అయితే సాధ్యమైనంత వరకు అనే దానికి ప్రమాణం? అంతరాత్మే. ఇక సత్యం. కౌశికా! ఇందులో ఉన్న ధర్మ సూక్ష్మాన్ని కూడ తెలుసుకో అని 'భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చుఁ దద్భూత భయాస్పదంబగు ప్రభూతపు సత్యము బొంకునట్ల', 'ప్రాణాతురుడైనచోఁ బరిణయంబున యందును బల్కుబొంకు సత్యాతిశయంబ

యంద్రు మహితాత్మక యిట్టివి ధర్మసూక్ష్మముల్' – అని చెప్పాడు. అంటే – ప్రాణులకు మేలు చేయటానికి చెప్పే అసత్యమైనా సత్యమే అట. ప్రాణరక్షణకు, పెళ్ళి జరపటానికి చెప్పే అసత్యం సత్యం కంటె గొప్పదట. ధర్మసూక్ష్మాలు ఇలా ఉంటాయట. 'సత్యం వద' అని వేదం చెప్పిందికదా అని కొంపలు కూల్చే సత్యాలు – సత్యాలే అయినా – చెప్పకూడదు.

ఈ సందర్భంలో శ్రీమద్భాగవతంలో బలిచక్రవర్తికి శుక్రుడు చెప్పిన మాటలు– **'వారిజాక్షులందు, వైవాహికములందు, ప్రాణ విత్త మానభంగ మందు, చకితగోకు లాగ్ర జన్మరక్షణమందు బొంకవచ్చు నఘము వొంద దధిప!'** – అనే మాటలు – ఎవరికైనా గుర్తువస్తాయి. పుణ్యపాప కర్మఫలాలను గూర్చి ధర్మవ్యాధుడు కౌశికుడికి చెప్పిన మాటలు నేలమీది మానవులంతా మననం చేయదగినవి. జీవితంలో ఆచరించదగినవి. ✦

విజ్ఞాన వీచిక



ఆంధ్రనాయక శతక సౌందర్యము

- డా॥ కె. గిరిజాలక్ష్మి, నెల్లూరు.

సీ॥ బొచ్చెచేపకునైన మచ్చరంబున్నది-తాబేటికైన సత్త్వంబుగలదు
డీకొన్న నడవి పందికి గల్గు రోసంబు-దెరనోటి నరుడైన దెగువసేయు
బొట్టివానికినైన దిట్టతనంబుండు-బాపనికైన దర్పంబుగలదు
చుంచురాజునకైన శూరత్వమున్నది-ముసలికినైన చేపుష్టిగలదు

సిద్ధమా భీరుడవు నీవె బుద్ధినెంచ - గలికివై యేమి సేయగలవొకాని
చిత్రచిత్రప్రభావ! దాక్షిణ్యభావ! - హతవిమతజీవ! శ్రీకాకుళాంధ్రదేవ! 38

ఆంధ్రనాయకస్వామిలో దశావతారాల సందర్శనం కావిస్తున్నాడీ పద్యంలో పురుషోత్తమకవి. ఒక్కొక్క అవతారంలో ఆయన ప్రదర్శించిన శక్తియుక్తుల్ని ప్రస్తావిస్తూ, చివరి అవతారమైన కల్కిరూపంలో స్వామి ఏమిచేయగలవాడోనని అడుగుతున్నాడు కవి.

'బొచ్చెచేప' అంటే మత్స్యావతారం. దీనికి అసూయ ఉందిట. కాబట్టే సోమకాసురుడు వేదాలనెత్తుకుపోతుంటే వాటిని కాపాడి బ్రహ్మకప్పగించాడు. 'తాబేటికైన సత్త్వంబు గలదు' - కాబట్టే మహాకూర్మంగా అవతరించి, మందర పర్వతాన్ని భరించి, క్షీరసాగర మథనానికి ఆటంకం లేకుండా చేశాడు. 'అడవిపందికి రోషముంది' - కనుకనే భూదేవి నపహరించుకుపోతున్న హిరణ్యాక్షుణ్ణి సంహరించి, భూమిని సముద్ధరించాడు వరాహావతారమెత్తి. 'తెరనోటి నరుడు' - అంటే నరసింహస్వామి. ఆయనకెంతో సాహసముంది. కాబట్టే ప్రహ్లాదుణ్ణి పరిరక్షిస్తూ, హిరణ్యకశిపుణ్ణి పరిమార్చాడు. 'పొట్టివాడ'ంటే వామనుడు. ఆయనకు దిట్టతనముండబట్టి, త్రివిక్రముడై, బలిచక్రవర్తిని పాతాళానికి అణచివేశాడు. బ్రాహ్మణుడైన పరశురామునికి దర్పముంది కనుకనే అహంకరించిన క్షత్రియులను వధించాడు. 'చుంచురాజు' - చిన్నచిన్న కురులగల రాజు - శ్రీరాముడు. ఆయనకు శూరత్వముండబట్టే రావణాది రాక్షససంహారం చేశాడు. 'ముసలికినైన చేపుష్టి ఉన్నది' - ముసలం (రోకలి) కలవాడు 'ముసలి' - అంటే బలరాముడు. దాంతో శత్రుసంహారం కావించాడు. 'సిద్ధమాభీరుడవు' - అంటే నీవు సహజంగా గొల్లవాడివి. కాబట్టే గోసంరక్షణతోపాటు జీవ సంరక్షణ కూడా చేశావు.

ఈవిధంగా ఆ అవతారాలన్నింటిలోను ఎంతో ప్రశస్తికెక్కిన పనులు చేశావు. ఇక రాబోయే కల్కి అవతారంలో ఏం చేస్తావో ఏమిటో నని కవి సంశయంగా ప్రశ్నిస్తున్నాడు. అవతారాల పేర్లు ఎత్తకుండా, వాటి ప్రాశస్త్యాన్ని భంగ్యంతరంగా స్ఫురింపచేసే ఈ పద్యరచనా శిల్పం అనన్య సామాన్యం. ఇందులోని అచ్చతెనుగు భాషా సౌందర్యం ముచ్చట గొలుపుతుంది. ✦ ....(సశేషం)

ఆరోగ్యము -

శిశుపాలన

'కోమల సాహితీవల్లభ'

- డా॥ కోడూరు ప్రభాకరరెడ్డి, ప్రొద్దుటూరు

తల్లులకూ, కాబోయే తల్లులకూ.... అన్నిపాల కన్న తల్లిపాలు మిన్న

మూర్ఛ (Epilepsy) : మూర్ఛవ్యాధి పెద్దవాళ్ల కంటే పిల్లల్లో ఎక్కువగా చూస్తుంటాం. పిల్లల్లో వచ్చే ఎక్కువ శాతం మూర్ఛలు ఏ మాత్రం ప్రమాదకరం కాని జ్వరతీవ్రతతో వచ్చే మూర్ఛలే! కానీ మెదడు వాపు వ్యాధి, జన్మతః మెదడులో వచ్చే లోపాలు, పుట్టగానే సరిగ్గా శ్వాస ఆడక మెదడు దెబ్బతినడం మొదలైన ఎన్నో కారణాలవల్ల కూడా పిల్లల్లో మూర్ఛ రావచ్చు. తరచుగా వచ్చే మూర్ఛవ్యాధికి (Epilepsy) మందులు దీర్ఘకాలం వాడే అవసరముండవచ్చు. మందులు సరిగ్గా వాడడంతో దాదాపు 80 శాతంలో మూర్ఛలు రాకుండా నిరోధించవచ్చు. మూర్ఛను నివారించే మందులు కనీసం రెండేళ్ల వరకు వాడవలసివుంటుంది. ఈ మందులు ఒక్కసారిగా మానేయకుండా నిదానంగా మోతాదును తగ్గిస్తూరావాలి. C.T. స్కాన్ చేయించడంవల్ల మూర్ఛకు కారణాలైన మెదడువాపు, వివిధ విభాగాల నిర్మాణంలోని లోపాలు, రక్తపు గడ్డలు, చీము గడ్డలు, కంతులు (Tumors) మొదలైనవి తెలుసుకోవచ్చు. అయితే మెదడు పనితీరు. మూర్ఛలు క్రితం వచ్చాయో లేదో / ఇక ముందు వచ్చే అవకాశం వుందేమో తెలియాలంటే ఇ.ఇ.జి., ఎం.ఆర్.ఐ. వంటి వాటి వలన ఎక్కువ ఉపయోగం వుంటుంది. మూర్ఛవ్యాధికి వాడే మందులతో కొందరిలో వచ్చే దుష్ప్రభావాలు-

- గార్డినాల్ వల్ల మత్తుగా వుండడం, చదవులోను, ఆటలోను మందకొడితనం
- ఫినటాయిన్ వల్ల చిగుళ్ల వాపు, రక్తహీనత
- టెగ్రెటాల్ వల్ల రక్తహీనత
- వాల్ప్రొరిన్ వల్ల కాలేయవ్యాధులు నెలనెలా వైద్యుని సంప్రదించడం వల్ల ఈ దుష్ప్రభావాలను త్వరగా గుర్తించి అవసరమైన చికిత్స చేయించుకోవచ్చు.

పిల్లల్లో ఆస్మా (ఉబ్బసం) - కొన్ని వాస్తవాలు

తమ పిల్లలకు ఆస్మా వచ్చిందంటే చాలామంది తల్లిదండ్రులు నమ్మరు. పిల్లలకేమిటి -

ఆస్త్మా రావడమేమిటని ఆశ్చర్యపడుతుంటారు. నిజానికి ఈ సమస్య పెద్దల్లోకంటే పిల్లల్లోనే ఎక్కువ.

ప్రపంచవ్యాప్తంగా ఆస్త్మా బాధితులు 30 కోట్ల మంది వున్నారు. అందులో మనదేశంలో 2.3% బాధితులుంటే పిల్లల్లో 15-20% వున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రతి ఏటా 2.5 లక్షల మంది ఆస్త్మాతో చనిపోతుండగా ఒక్క మనదేశంలోనే 57,000 మంది చనిపోతున్నారు. బెంగుళూరులో 25-28% పిల్లలు ఎప్పుడో ఒకప్పుడు ఆస్త్మాతో బాధపడుతున్నట్లు తెలుస్తున్నది. దాదాపు మిగతా పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి. ఆస్త్మా బాధితుల సంఖ్య అయిదేళ్లలో రెట్టింపు అవుతుందని ఒక అంచనా.

ప్రపంచంలో దీర్ఘకాలం వేధించే జబ్బుల్లో అన్నింటికంటే ముందు నిలుస్తున్న సమస్యలు - అలర్జీ, ఆస్త్మా అయినా కూడా దీన్ని మనం సరిగ్గా గుర్తించటం లేదు. ఆస్త్మాను సరిగ్గా గుర్తించి, నిర్ధారించి, అవగాహనతో చికిత్స తీసుకుంటే ఇది పూర్తిగా నియంత్రణలో వుంటుంది. దీన్ని అదుపులో వుంటుకోవటం చాలా సులువు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం విలయం సృష్టిస్తుంది.

చాలామంది పిల్లికూతలు, ఆయాసం వంటివి వుంటేనే ఆస్త్మా అనుకుంటారు. అది పొరపాటు. ఆ లక్షణాలు గాలి గొట్టాలు సన్నగా అయిపోయి, గాలి సరిగాగ లోపలికి పోలేని ముదిరిపోయిన దశలో కనిపించే ప్రధాన లక్షణాలు. వీటన్నిటికన్నా ముందు తొలిదశలో కనిపించే ముఖ్యకారణం - దగ్గు! సాధారణంగా వచ్చే దగ్గు వారంలోపలే తగ్గిపోతుంది. అలా కాకుండా రెండు, మూడు వారాలైనా తగ్గకుండా దగ్గు వేధిస్తుంటే ఆస్త్మాను అనుమానించాలి. చర్మం మీద అలర్జీ వచ్చినప్పుడు దురదపెట్టినట్లే గాలి గొట్టాల్లో అలర్జీ వచ్చినప్పుడు దగ్గు మొదలవుతుంది. దాన్ని అశ్రద్ధ చేస్తే రానురాను గాలిగొట్టాలు వాచి, స్రావాలుచేరి, కఫం (sputum) తయారవుతుంది. ఇంకా ముదిరితే గాలిగొట్టాలు సన్నగా అయిపోయి పిల్లకూతలు వస్తాయి. కాబట్టి సాధారణ దగ్గుకు మందులు లొంగిపోయినా, ఆస్త్మాకు వాడే 'సాల్‌బుటమాల్' వంటి మందులకు వెంటనే తగ్గిపోయినా, పగటికంటే రాత్రిపూట దగ్గు ఎక్కువగా వస్తున్నా, శారీరక శ్రమ - వ్యాయామం తర్వాత అంటే ఆటలాడేటప్పుడు, నవ్వినప్పుడు దగ్గు ఎక్కువ అవుతున్నా, సీజన్ మారగానే దగ్గు ముదురుతున్నా, చల్లగాలి, పొగ, దుమ్ములతో దగ్గు ఎక్కువ అవుతున్నా - ఆస్త్మాను అనుమానించాలి.

కొన్ని సమస్యలను మొక్కగా వున్నప్పుడే వంచాలి. ఆస్త్మా కూడా అలాంటి సమస్యే! దీన్ని చిన్న వయసులోనే గుర్తించి నియంత్రించకపోతే యేళ్ల తరబడి వేధిస్తూ

ఉత్తరకాలంలో ఊపిరితిత్తులను పాడుచేస్తుంది. మళ్లీ బాగుచేయడానికి వీల్లేనంతగా ఊపిరితిత్తులు పాడయిపోతాయి. అందువల్ల ఆస్త్మాను ఎలాంటి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదు. పిల్లల విషయంలో మరీనూ.

ఆస్త్మా ఒక సంక్లిష్టమైన సమస్య. దీర్ఘకాలికంగా గాలిగొట్టాలు అతిగా స్పందిస్తూ వాచిపోయి. ఆ శ్వాసనాళాల్లో గాలిమార్గం (Airway) చిన్నగా అయిపోయి, శ్వాసప్రక్రియ క్లిష్టంగా మారటం దీని లక్షణం. దీనివల్ల శ్వాస తీసుకుంటున్నప్పుడు పిల్లికూతలు వస్తుంటాయి. కొందరికి మాత్రమే గాలిగొట్టాలు ఇలా వాచిపోతూ ఎందుకు స్పందిస్తాయి? అన్నదే కీలకం. దీనికి సమాధానంగా జన్యువులదే పాత్రగా నిర్ధారించారు. అలర్జీ, ఆస్త్మాలు చాలా వరకు జన్యుపరంగా వచ్చే సమస్యలు. వీళ్లలో చర్మం, ముక్కు అలర్జీలు కనిపిస్తాయి. అయితే ఆస్త్మా రావాటానికి జన్యువులతోపాటు మనచుట్టూ వుండే వాతావరణాంశాలూ కీలకమైన పాత్ర పోషిస్తాయి.ఆస్త్మాకు దోహదకారులైన జన్యులున్నప్పటికీ వీరికి అలర్జీ కారక వాతావరణాంశాలు తోడైనప్పుడే అది వ్యాధిరూపంలో బయటపడుతుంది. అంటే అగ్నికి ఆజ్యం తోడయినట్లన్నమాట. ఇందుకు ఇంట్లోనూ, బయటా వుండే అలర్జీ కారకాలను ముఖ్యంగా చెప్పుకోవాలి. వీటిల్లో గాలి ద్వారా వచ్చేవే ఎక్కువ, తిండి ద్వారా వచ్చేవి తక్కువ. రంగులు, సెంట్లు, దోమలు కాయిల్స్, మ్యాట్స్ (తివాచీలు), వాసనలు, రసాయనపదార్థాల వంటివన్నీ అలర్జీ కారకాలుగా పనిచేయవచ్చు. ఇక బయటైతే – వాహనాల పొగ, పరిశ్రమల కాలుష్యం, వ్యర్థాల వంటివి కారణం కావచ్చు. జన్యుపరమైన స్వభావం వున్నవాళ్లకు ఇలాంటి అలర్జీ కారకాలు తోడైతే అలర్జీ మార్పులు మొదలై ఆస్త్మాకు దారి తీస్తుంది. ఆస్త్మా దీర్ఘకాలం కొనసాగితే క్రమేణా గాలిగొట్టాలు దెబ్బతింటాయి.

✦ ... (సశేషం)

విదురనీతిసారం (25)

- మొవ్వ వృషాద్రిపతి, రేపల్లె.

తగినవేషంబు దనుఁదాన పొగడుకొనమి
నొచ్చియును గీడువలుకమి యిచ్చివగవ
కునికి దనకెంత నడవకయున్నఁబథము
దప్పకుండుట నడవడికొప్పుసేయు. 18

ప్రతివ్యక్తియు తనకున్నంతలో తగినవేషాన్ని ధరించటం మర్యాదాకరం. ఆడంబరంగా దుస్తులు ధరించి ఏదోవేషం వేయుమని కాదు. మంచి వస్త్రాలు – చిరుగనివి – పరిశుభ్రంగా వున్నవి వేసికొని శరీరాన్ని పరిశుభ్రంగా వుంచుకోవాలి. అదే ఒక వ్యక్తి నడవడికకు హుందాతనం తెచ్చిపెడుతుంది. ఎంతో వుండికూడా, చాలా విలువ తక్కువ వేషం ధరిస్తే లోక మాతనిని లోభిగా ముద్రవేస్తుంది. తనకున్నదానికన్న ఆడంబరంగా వేషం ధరిస్తే "మ్రింగటానికి మెతుకు లేదు – మీసాలకు సంపంగినూనె" అని అవహేళన చేస్తుంది. కనుక **సముచితమైన వేషం ధరించాలి.**

ఎంతటివాడైనా తన గొప్పతనాన్ని తానే పదిమందిముందు, పొగడుకోకూడదు. తనను తాను పొగడుకోవటం ఆత్మహత్యాసదృశం. తన గొప్పతనం నలుగురూ గుర్తించాలి. తానే చెప్పుకొంటే పరిహాసపాత్రుడౌతాడు. సొంతడబ్బా కొట్టుకొంటున్నాడనే నిందకు గురి అవుతాడు. అటువంటివారితో లోకం నోటితో మాట్లాడుతూ నొసలితో వెక్కిరిస్తుంది.

తాను బాధపడినా ఇతరులను నిందించకూడదు. తాను చేసిన కర్మనుసారంగా కష్టసుఖాలు కలుగుతాయని వేదాంతవిదులు చెబుతారు. **తన కర్మకు తానే కర్త.** ఇతరులను నిందించి ఏమి ప్రయోజనం? అటువంటి వ్యక్తి గొప్పతనాన్ని లోకం నిదానంగానైనా గుర్తిస్తుంది. ఇతరులను నిందించినా మనకు కలిగినబాధ పోదుకదా! ఉదాత్త గంభీరంగా వుంటే ఉత్తముడనే పేరువస్తుంది.

కొందరు, మొగమోటమితో వచ్చినవారిని, కాదనలేక దానం చేస్తారు. 'అయ్యో! ఇంత యిచ్చానే! అంత ఇచ్చానే!' అని మానసికంగా బాధపడతారు. అలాంటివారికి ఇచ్చిన ఫలంకూడా దక్కకుండా పోతుంది. అన్నా! ఒక శివాలయం వుంది. ఒక ధనవంతుడు కొన్ని లక్షలు వెచ్చించి ఆ ఆలయం ఎదుట సహస్రస్తంభమండపం కట్టించాడు. అందరూ చూచి మెచ్చుకొంటుంటే ఉబ్బితబ్బిబ్బైనాడు. ఆ రాత్రి ఒంటరిగా పండుకొని

'అయ్యో! ఎంతో కష్టపడి సంపాదించిన ధనం ఇలా ఖర్చుపెట్టానే?' అని లోలోన బాధపడ్డాడు. రెండవనాడు స్వామివారి రథం తిరువీథి ఉత్సవానికి బయలుదేరింది. సరిగా ఆ మండప సమీపానికి వచ్చేటప్పటికి రథం కదలలేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఒక్క అంగుళం కూడా ముందుకుపోలేదు. స్వామి అర్చకముఖంగా 'తానా మండపం చూడదలచుకోలేదనీ – అడ్డంగా తెర కడితే రథం వెళుతుందనీ' ఆనతిచ్చాడు. మండపం వైపు రథానికి తెరలడ్డంగట్టారు. రథం వెళ్ళిపోయింది. స్వామి నిరాకరించిన మండపం పాడుబెట్టారు. ఆ ఫలంకూడా కట్టించి నతనికి దక్కలేదు. అటువంటివారికి మానసికవ్యథ మిగులుతుంది. తద్వారా అనారోగ్యం సంప్రాప్తిస్తుంది. ఇచ్చినదానిని దాత వెంటనే విస్మరించాలి. లోకం గుర్తుంచుకొంటుంది.

కొంతమంది సంపన్నులుగా ఉన్నప్పుడు ధర్మబద్ధంగా న్యాయసమ్మతంగా ప్రవర్తిస్తారు. ధనంపోయి జీవనం కూడా దుర్భరమవుతుందనుకోండి. అప్పుడే ధర్మబద్ధంగా వుండాలి. జరగటంలేదుకదా! అని అపమార్గంలో ప్రవర్తిస్తే అపకీర్తిభాజనుడౌతాడు. నలుగురిదృష్టిలో చులకనవుతాడు. **ఉన్నంతలో గుట్టుగా – రహస్యంగా ధర్మమార్గంలో కుటుంబాన్ని పోషించుకొన్నవాడే ఉత్తమగృహస్థు.**

అన్నా! ఈ పైని చెప్పిన లక్షణాలు ఉత్తమ శీలవంతునిగా నిర్ణయిస్తాయి. గౌరవ మర్యాదలను కట్టబెడతాయి. ✦ ... (సశేషం)

బాలల భాగవతకథలు

డా॥ కె.ప్రభాకర్ రెడ్డి, ప్రొద్దుటూరు.

క్షీరసాగరమథనం

లోకాలన్నీ కాంతిదప్పి రాక్షసుల రాయిడీ ఎక్కువగా ఉంది. ఇంద్రాది దేవతలను వెళ్ళగొట్టి దానవులు అమరావతిని ఏలుతున్నారు. దేవతలు బ్రహ్మతో కలిసి విష్ణుమూర్తి చెంతకు వెళ్ళి కాపాడమని వేడుకున్నారు. "మీకు సమయం వచ్చేవరకు బలం వచ్చేంత వరకు వేచి ఉండండి. ప్రస్తుతం దానవులతో సఖ్యంగా ఉండి, వారి సహాయంతో క్షీరసాగరాన్ని మథించండి. అందువల్ల మీకు సర్వసంపదలు సమకూరుతాయి" అన్నాడు శ్రీహరి. అప్పుడు దేవతలు దైత్యుల దగ్గరికి వెళ్ళి "మనం అక్కచెల్లెండ్ర బిడ్డలం, మనలో మనకు శత్రుత్వమెందుకు? సఖ్యతతో అన్యోన్య సహాయం చేసుకొందాం!" అన్నారు. దానికి దైత్యులు అంగీకరించారు. దేవతలు మందరపర్వతాన్ని వేడుకొని దాన్ని క్షీరసాగరానికి తీసుకొని రావటానికి ఇబ్బంది పడ్డారు. అప్పుడు శ్రీహరి ఆజ్ఞతో గరుత్మంతుడు ఆ పర్వతాన్ని క్షీరసాగరానికి చేర్చాడు. దాన్ని కవ్వంగా చేసుకొని వాసుకిని ప్రార్థించి వానిని తరిత్రాడుగా చేసుకోదలిచారు. గరుడుడు పైకి తీయటానికి ఎంత ప్రయత్నించినా వాసుకి చుట్టలుగా క్రింద మిగులుతూనే ఉంది. గరుడుడు భంగపడ్డాడు. దేవతలు, గరుడుడు పరమశివుని ప్రార్థించారు. శివుడు చేయిచాపి వాసుకిని వానపాముగా కొనవేలితో పైకెత్తి కొండకు చుట్టాడు. దేవతలు, రాక్షసులు మందరపర్వతంతో క్షీరసాగరాన్ని మథించసాగారు. దేవతలు వాసుకి తోకను, దానవులు శిరస్సును పట్టుకొన్నారు. కొంచెంసేపు చిలకగానే పర్వతం కూలి సాగరంలో దిగబడింది. దేవతలు భగవంతుని ప్రార్థించారు. శ్రీమహావిష్ణువు కూర్మరూపం దాల్చి పర్వతం క్రిందచేరి దాన్ని పైకి లేవనెత్తాడు. సాగరాన్ని మథించగా దానినుండి హాలాహలమనే విషం పైకి ఉప్పొంగింది. దేవతలు, రాక్షసులు కకావికలుగా అటూ ఇటూ పరిగెత్తారు. శివుని శరణువేడారు. ఆయన భవాని అనుమతి తీసుకున్నాడు. మ్రింగేది గరళమైనా అది పరోపకారార్థం కాబట్టి మంగళసూత్రాన్ని మదిలో నమ్మిన ఆ సర్వమంగళ సరేనంది. తన కుక్షిలోని ముజ్జగాలకు హాని జరగకుండా ఆ గరళాన్ని కంఠంలోనే నిలిపి శివుడు నీలకంఠుడయ్యాడు. మథనం కొనసాగింది. కామధేనువు ఉద్భవించింది. యజ్ఞాలకు అవసరమని మహర్షులు దాన్ని స్వీకరించారు. ఐరావతమనే నాలుగు దంతాల తెల్ల ఏనుగు బయల్వెడలింది. దాన్ని ఇంద్రుడు తీసుకున్నాడు. ఉచ్చైశ్రవం అనే తెల్లగుర్రాన్ని కూడా ఇంద్రుడు తీసుకోబోగా విష్ణువు దాన్ని రాక్షసరాజు

బలికి ఇప్పించాడు. కల్పవృక్షాన్ని, పారిజాతవృక్షాన్ని ఆతిథ్యం పేరిట ఇంద్రుని భార్య శచీదేవి తీసుకుంది. చల్లని చంద్రుడు ఉదయించాడు. దాన్ని గరళం మ్రింగిన శివునికి శిరోభూషణంగా సమర్పించారు. మైకం కలిగించే వారుణిని రాక్షసులు వశం చేసుకున్నారు. ఆ తర్వాత పద్మాసనం మీద శ్రీమహాలక్ష్మి ఉదయించింది. వైజయంతిమాలను ఆమె శ్రీహరి మెడలో వేసి వరించింది. దివ్యతేజంతో సువర్ణపాత్రలో అమృతంతో ధన్వంతరి ఉదయించాడు. వెంటనే దానవులు అతని మీదికి ఉరికి అమృతభాండాన్ని బలవంతంగా లాక్కొని పారిపోయారు. దేవతలు గోలపెడుతూ వాళ్ళను తరుమబోగా విష్ణువు వాళ్ళను వారించి మోహినీరూపం దాల్చి అమృతాన్ని దేవతలకు పంచిపెట్టారు. ✦

సంస్కృతభాషాపూర్ణిమ

अव्ययानि स्मरामः

'अनु'

अनु इति **अव्ययं / गतिसंज्ञकः / कर्मप्रवचनीयः / उपसर्गः** येषु अर्थेषु उपयुज्यते ते अर्थाः सोदाहरणम् एवं सन्ति –

पश्चादर्थे – अनुसरति। **कृपायाम्** – अनुकम्पा। **ज्ञाने** – अनुभवः। **सान्त्वने** – अनुनयः। **सेवने** – अनुजीवी। **इच्छायाम्** – अनुरोधः। **सादृश्ये** – अनुकरोति। **आचरणे** – अनुष्ठानम्। **प्रश्ने** – अनुयोगः। **आदेशे** – अनुशास्ति। **अङ्गीकृतौ** - अनुमोदते। **मार्गणे** – अन्वेषणा। **प्रोत्साहने** – अनुगृणाति। **आनुकूल्ये** – अनुकूलः। **पश्चात्तापे** – अनुशयः। **आनुपूर्व्ये** – अनुक्रमः। **प्रसाधने** – अनुलिम्पति। **उपकारे** – अनुगृह्णाति। **सातत्ये** – अनुस्मृतिः। **अलोचने** – अनुसन्धानम्। **अन्वये** – अनूपमम्। **अधीष्टे** – अनुब्रूहि। **सम्बन्धे** – अनुबन्धः। **लक्षणे** – वृक्षमनु। **इत्थम्भूताख्याने** – मातरम् अनु। **भागे** – मामनु। **वीप्सायाम्** – अनुदिशम्। **सहार्थे** – नदीमनु सेना। **हीने** – अन्वर्जुनं योद्धारः। **हेतौ** – शाकल्यस्य संहिताम् अनुप्रावर्षत्। **सामीप्ये** - अन्विन्द्रप्रस्थं कुरुक्षेत्रम्। **आयामे** – अनुगङ्गं वाराणसी। **योग्यतायाम्** – अनुरूपम्।

'अनिमिषम्' 'अनिमिषा'

एतत् अव्ययद्वयं क्रमशः **जागरूकतया** अथवा **निमेषं विना, अतिजागरूकतया** अथवा **निमेषं विना** च इत्यर्थयोः भवति। तथाहि –

> 'ऋधक् यतो **अनिमिषं** रक्षमाणा' (ऋ.वे.७.६१.३)
> द्विचक्रिका **अनिमिषं** चालनीया।
> 'मित्रः कृष्टीर**निमिषा**ऽभि चष्टे' (ऋ.वे.३.५९.१)
> वैदिकैर्भाव्यम् **अनिमिषा**। विरोधिनः वेदनाशाय प्रवर्तन्ते।

अवधेयम् –

अनिमिषिमनिमिषा इत्यनयोः **चादिषु (१.४.५७)** अन्तर्भावात् **अव्ययत्वम् (१.१.३७)**। लोके **अनिमिषम्** इति **क्रियाविशेषणत्वेन** अप्युपयुज्यते।

వేమన తాత్త్వికత - మనస్తత్త్వ విశ్లేషణ

మానవ స్వభావము - గుణదోష విమర్శనము - వ్యక్తిత్వవికాసము

(19)

-డా॥ వై.భానుభవాని, గుంటూరు.

తప్పులెన్నువారు తండోపతండంబు
ఉర్విజనులకెల్ల నుండు తప్పు
తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరు
విశ్వదాభిరామ వినుర వేమ.

ఈ భూమిపైనున్న ప్రతి మనిషి తెలిసో తెలియకో ఎప్పుడో ఒకసారైనా ఏదో ఒక తప్పు చేయడం సర్వసాధారణం. అది చిన్నతప్పు కావచ్చు, పెద్దతప్పు కావచ్చు. కాని చేసిన తప్పును గుర్తించి, అంగీకరించి, సరిదిద్దుకోవడం, పునరావృతం కాకుండా చూసుకోవడం మనీషి లక్షణం. (మనీషి = బుద్ధిమంతుడు)

అలాకాకుండా గురివెందగింజ (గురువింద గింజ) సామెతగా తన తప్పులను గుర్తించకుండా, ఎదుటివారిలో తప్పులు వెదకి, వారిని తెగనాడటం అతి మామూలు వ్యక్తుల పద్ధతి. సంస్కారహీనుల నైజమిది. ఏదేమైనా తమగురించి ఆలోచించుకోకుండా ఎదుటి తప్పులను ఎత్తిచూపాలనుకునేవారు, చూపేవారు ఈ భూమిపై అధిక సంఖ్యలో ఉన్నారు. ఇది ఆహ్వానించదగిన పరిణామం కాదు. ప్రతివారు ఆత్మవిమర్శ చేసుకోవడం అవసరమన్నది వేమన అభిప్రాయం. తప్పు చేయడం సహజమైనా, పదేపదే తప్పులు దొర్లకుండా ఎవరిని వారు తీర్చిదిద్దుకోవలసిన అవసరాన్ని ఈ పద్యం తెలియచేస్తున్నది.

తనకు గలుగు పెక్కు తప్పులు నుండగా
ఓగునేరమెంచు నొరుల గాంచి
చక్కిలంబు జూచి జంతిక నగినట్లు
విశ్వదాభిరామ వినురవేమ.

తన తప్పులు దాచిపెట్టుకుని చెడ్డవాడు ఇతరుల తప్పులను వెదికే ప్రయత్నం చేస్తాడు. చక్కిలము తన యందలి వంకరలను వదలిపెట్టి జంతిక యందలి వంకరలు చూసి ఎగతాళి చేసినట్లుగా ఉంటుంది ఈ దుర్మార్గుల చర్య. కానివారు మాత్రం ఇదేమీ పట్టించుకోరు. అనగా తప్పులు ఎత్తిచూపటం తప్ప మరోరకమైన ఆలోచన వీరికి రాదన్నమాట. ఇటువంటి మనస్తత్వం సమర్థనీయం కాదని వేమన ఉద్దేశ్యం.

ఇటువంటి ప్రవర్తనవల్ల అల్పత్వం సూచితమౌతుంది. ఎదుటివారి మనస్సు నొచ్చుకుంటుంది. తోటివారు దూరమౌతారు.

ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు
కాల్చి యతుక వచ్చు క్రమముగాను
మనసు విరిగెనేని మరి కూర్పవచ్చునా
విశ్వదాభిరామ వినుర వేమ.

ఎదుటివారి మాటతీరుతో, ప్రవర్తనతో ముక్కలైన మనస్సును తిరిగి అతికించటం సాధ్యం కాదు. అనగా సానుకూలంగా మార్చలేము. ఇనుము వంటి లోహాలనైతే ఒకటి రెండుసార్లు కాల్చి సాగగొట్టి అతికించవచ్చును. కాని మనసు లోహం కాదుగదా. కాబట్టి పరిస్థితిని అంత దూరం తెచ్చుకోకూడదని సారంశం.

మాటలాడ నేర్చి మనసు రంజిలజేసి
పరగ బ్రియము చెప్పి బడలకున్న
నొకరి చేతి సొమ్ములూరక వచ్చునా
విశ్వదాభిరామ వినురవేమ.

ఇతరులనుండి వివిధ సందర్భాలలో సొమ్ము రాబట్టాలంటే మెప్పించే విధంగా మాట్లాడి వారి మనస్సును ఆకట్టుకోవాలి. వారికి నచ్చేవిధంగా నైపుణ్యంగా మాట్లాడాలి. ఆ విధంగా కష్టపడితేనే ధనప్రాప్తి. లేకపోతే చివాట్లు ప్రాప్తిస్తాయి. ఈ పద్యం లౌక్యమెరిగి నడుచుకోవాలనే విషయాన్ని బోధిస్తున్నది. నోరు మంచిదవ్వాలన్న హితోక్తిని చెప్తున్నది.

పరగరాతి గుండు బగుల గొట్టగవచ్చు
గొండలన్ని పిండి గొట్టవచ్చు
కఠినచిత్తు మనసు కరిగింపగారాదు
విశ్వదాభిరామ వినురవేమ.

పైన చెప్పిన అంశాలలో మొదటి రెండు కష్టసాధ్యాలేగాని అసాధ్యాలు కావు. కాని మూడవదైన కఠినాత్ముని మనస్సును మార్చటం మాత్రం ఎవరికిని సాధ్యం కాదు. అనగా వాడి హృదయంలో సున్నితత్వం ఏ పరిస్థితుల్లోనూ కల్గించలేము. భర్తృహరి సుభాషిత త్రిశతిలో కూడ మూర్ఖులగురించి ఇటువంటి అభిప్రాయమే చెప్పాడు. ఇంకొక్క అడుగు ముందుకు వేసి అసాధ్యములైన కుందేటికొమ్ము, ఇసుకనుండి తైలం సాధించవచ్చు నన్నాడు. కాని మూర్ఖుడిని మార్చటం అసాధ్యమని అన్నాడు. ఇలా చెప్పటానికి కారణం విషయతీవ్రతను, జటిలతను తెలియచేయటానికే. వేమన వేరొక చోట వంకరగా ఉన్న కర్రను గాల్చి వంకర తీయవచ్చునన్న మాటను కూడ కఠినాత్ముల మనసునుగూర్చి చెప్పే విషయంలో ఉపయోగించాడు. నిజానికి కర్రను కాలిస్తే వంకర పోవడమేమో గాని కర్ర కాలిపోవడం ఖాయం. మరి ఇలా చెప్పడానికి కారణం ఆ జటిలతను తెలియపర్చేందుకే యై ఉంటుంది.

మూర్ఖుల మనస్సుకు మాటకు నిలకడ ఉండదనేది మరొక అంశం. నీళ్ళమీద వ్రాస్తే ఆ వ్రాత నిలబడదు. ఆ వ్రాతవల్ల ఉపయోగం ఉండదు. ఆ పనికి ఏ పరమార్థం ఉండదు. మూర్ఖుడి ఆలోచనా విధానం కూడా అలాంటిదే. దానికి మంచి, చెడు తెలియదు. ఎప్పుడు ఎలా తోస్తే అలా మాట్లాడటం మూర్ఖత్వపు నైజం.

నీటిలోని వ్రాత నిలువక యున్నట్లు
పాటి జగతి లేదు పరములేదు
మాటి మాటికెల్ల మాఱును మూర్ఖుండు
విశ్వదాభిరామ వినురవేమ.

ఇంతకూ ఆ మూర్ఖుడు ఎవరంటే –

మాటజెప్ప వినని మనుజుడు మూర్ఖుడు
మాట విన్న నరుడు మానుడగును
మాట వినగ జెప్ప మానుట కూడదు
విశ్వదాభిరామ వినురవేమ. (మానుడు–మంచివాడు, మాన్యుడు)

ఎదుటివారి మాటను చొరనివ్వకుండ, తనమాటే వేదవాక్కు అనేవిధంగా ప్రవర్తించేవాడే మూర్ఖుడు. ఎదుటివారి మాట విని ఉచితానుచితాలను గూర్చి ఆలోచించేవాడు మాన్యుడు. ఎదుటివారి మాటను నిరాకరించకూడదు. కాని విని సరియైన సమాలోచన, నిర్ణయం చేయగలగాలి. "కల్ల, నిజము తెలిసిన మనుజుడే పో నీతిపరుడు" అన్న పద్యపాదం కూడా ఇదే భావాన్ని స్పష్టం చేస్తుంది. ఒక వ్యక్తి తన వ్యక్తిత్వానికి పదును పెట్టి వికసింపచేసుకోవాలంటే ఇంతకంటే గొప్ప మార్గనిర్దేశం ఏముంటుంది?

ఆడితప్పువారలభిమానహీనులు
గోడెఱుగని కొద్దివారు
కూడికీడుసేయు గ్రూరుండు తలపోయు
విశ్వదాభిరామ వినురవేమ.

ఆత్మాభిమానం లేనివారే అడుగడుగునా చెప్పిన మాటను నిలబెట్టుకొనకుండా అబద్ధాలాడతారు. ఇతరులకు కలిగే బాధను గుర్తించలేని అల్పులతో కలిసి కీడుచేయా లనుకునేవాడు క్రూరుడు. ఈ రెండు లక్షణాలు ఒకదానికొకటి ఆత్మబంధువుల్లాంటివి. అందుకే ఏకత్ర తటస్థిస్తాయి. కాని ఇవి గొప్ప విషయాలేం కావు. మిక్కిలి గర్హణీయాలు. వీటిని దూరంగా ఉంచటం గొప్ప వ్యక్తిత్వానికి సంకేతం. ఒక్కమాటలో చెప్పాలంటే వ్యక్తిత్వ వికాసానికి సోపానాలు వేమన పద్యాలు. (అలాంటివే ఇతర శతకాలలోను ఉన్నాయి.) ✦

తిక్కన కీచకవధ

ప్రక్షిప్త నిక్షిప్తములు (24)

- డా॥ చింతలపూడి వేంకటేశ్వర్లు, ఇడుపులపాడు.

నర్తనశాల :

అంతనాసమయమున వారుచేరిన నర్తనశాల వివేకమనెడు వెలుగులేని మూర్ఖుని యెడందవలె గాఢాంధకారమయమట. పరకీయప్రేమకువలె బొడగట్టదట. దుర్గమారణ్యము నకువలె నిర్మానుష్యమట. లోభిసంపదవలె ననుభవింపదగనిదట. చదువని శాస్త్రమునకు వలె ప్రవేశింప వీలుకానిదట. కలలో పొందిన పదార్థమునకువలె స్పష్టపడదట. బాలిశు రాజ్యమునకువలె జారచోరులకాటపట్టట. దుర్జయులగు యిద్దరిమధ్య జరుగనున్న యుద్ధమెంత ఘోరముగ జరిగినను దానిపొడ మూడవవ్యక్తికి తెలియబోదనుట యీ వర్ణనము పరమార్థము. అంతియగాక భీముడు భంజింపనున్న కీచకు హృదయకుహర లక్షణములు తెలియజేయుట కవి యాశయమై యుండవచ్చును.

లోనికి ప్రవేశించు మార్గమెద్దియో తెలియరాని విధమున చీకటిచే కట్టబడినట్లు పిరికివారు ప్రవేశింపవీలులేని ఆయింట భీముడొకపరి పరిసరములబరికించి భార్యచేతి నందుకొని మదమత్త మాతంగమువలె నిజబాహుబల గర్వంబు మార్గంబు జూపుచుండ నిశ్చింతుడై ప్రవేశించెను. లోనికిజని తన్మధ్యప్రదేశంబునగల విరాటనందన లీలాపర్యంకము గనుంగొని దానికొకింత దూరమున ద్రుపదనందననునిచి తానాతల్పంబుపై బరుండె. ఇచట తిక్కన వెలయించిన శార్దూలము నిజముగ ధ్వాంతాకారితమై చదువరుల భయ పెట్టును, గాంఢ్రించును, మీదబడును.

అంతట నానాభరణధరణశీలుండును నానాభరణ భూషితుండయి మదన వికారంబున మేనుప్పొంగ నుత్కంఠాసవపానమత్తుడయి సింగంబున్నగుహకు సింధురం బెఱుంగక యేతెంచునట్లతిరయంబున నా రంగాగారముజేరవచ్చెను. ఉద్వృత్తాంగజోన్మాదుడై యుత్కంఠ తారస్థాయిని జేర బాహుగర్వ ఘనసంతమసాంధమైన స్వాంతంబున నహంకృతి దారిజూప నిశ్శంకుడై లోనికిప్రవేశించెను. భీమాలంకృతమగు సెజ్జగాంచి లేమాలంకృతంబ యని భావించి యత్యంత ముదావహంబగుడు రయంబున గేలుసాచి భాషింప గడంగె.

కిమ్మీరవైరియును కోపముప్పొంగియు నవికార నిగూఢనిజప్రకారుడై కీచకుడేమి

చేయునో చూతమని కదలకపరుండి వినదొడంగెను. పగవాడు పజ్జజేరినను పవనసుతుచేత పరిహాసమొనరింప జేయుటయందు హాస్యరస పోషణమునకంటె ప్రతినాయకునియెడ నాయకుని నిర్లక్ష్యము వ్యక్తముజేయుట ముఖ్యము. ఆసక్తి యుత్కంఠమగు తరుణము హాస్యరసము రేఖామాత్రముగా జిలికించిన చదువరులయెడందల కొకింతయాటవిడుపు.

అచట రూపాభిమాని పలికిన ప్రతిపలుకును అతని చిత్తవృత్తికి దర్పణము బట్టునదే. మానినులెల్లరు నతని రూపమునుజూచి మరుసాయక బాధితమానసులై తమతమ ధనంబులెల్ల దెచ్చి యతగానికి లంచమిత్తురట. కాని యిపుడు తానే వేడుకపడి మనోహ రంబులగు వస్తునికరంబును సైరంధ్రికి లంచమీయదెచ్చెనట. అతనినిగాంచి మనసుపడిన తరుణి తక్కొరుని కన్నెత్తి చూడదట. అతని యందచందముల మెచ్చని యెలనాగ, వచ్చి పైబడని మదిరాక్షి లేదట. అతని విలాసములు గుర్తించిన యింతి కంతుబారి దప్పించికొన లేదట. అతని వివేకవచోవిలాసంబున కానందించిన యంగన యనంగానలదగ్ధమానస గాక మానదట. అతని మాటలు మగువలమానసంబులకురులై తీరునట. కాగా సైరంధ్రి యోర్తుమాత్ర మాబాధలెల్ల దనపాలుజేసెనట. ఆమె కొఱకు తానంతవఱకెంతటి వంతల కెఱయయ్యెనో తెలియజెప్పి వలపుపలుకుల నామెసర్వమునుగొలిచి కొలువసాగెనాధృష్టుడు.

మూలముననింకొక విషయము కలదు. 'ఆకస్మాన్మాంప్రశంసంతి సదాగృహగతా స్త్రియః సువాసాదర్శనీయశ్చ నాన్యోస్తి సదృశఃపుమాన్' తనయింటికేతెంచి రతిసుఖము నొందిన స్త్రీలెందరో నీవంటి చూపరులైన, చీనిచీనాంబరములు ధరించిన మగవారెవ్వరును లేరని తనను ప్రశంసించెదరట. వెలుగున్నట్లయిన నీ పలుకులయవసరము పడదు. గాఢాంధకారమగుట కీచకుడట్లు చెప్పుకొనవలసి వచ్చినది.

అంతట నతివగతి నటించు నాయనిలసూతి మనమున నిస్సీయని తనప్రియ తన నిగూఢభాషణౌచితి నెఱుంగవలయునను తలంపున తరుణీకంఠము ననుకరించి మృదుభాషణంబులాడినాడు. కీచకముఖ్యుడు తన్నుదాబొగడుకొనుట యతని చిత్తవృత్తికి తగినదట. తనవంటి యతివ యెందువెదకినను దొరకదను సంగతి యతనికితెలియకట్లు పలికెనట. తనయొడలుజేరుచో నతనియొడ లెట్టియనుభూతి బొందునో యనుభవించిన తరువాతగాని తెలియదట యితరవనితలతో తన్ను బోల్చి తాను చేసినతప్పు. తనసంగతి బొందిన వెనుక మఱియే యితరవనితల పొంతకు పోజాలడట. ఆతని చిత్తభవ వికారము లెల్లయు నొక్కయుదుటున ఫలించునట. ఎంతటి ధీరోదాత్తునకైనను అంతకుమించి యోర్చు కొనరాని ఘట్టమది. ప్రియాంగనాలింగనాతురుండగు నాదుర్వ్రిదగ్ధునకందలి శ్లేష స్ఫురింపక పోవుట సహజము. సైరంధ్రి యిట్టి మోసమెద్దేని యొనరించునోయని ముందుగనే

శంకించియు నామెపై తనకున్న మక్కువ గ్రుక్కద్రిప్పనీయక నెకాయెకి నచటికీడ్చుకువచ్చిన వచ్చిన కామాంధునకీ శ్లేషల విశ్లేషణమునకవకాశము లభించునా! తన జన్మము తరించనున్న దనుకొనుచుండెనేగాని తరింపనున్నదని గ్రహింపలేకపోయినాడు. మానవమనస్తత్వ పఠన విద్యాపారగుడగు తిక్కన చిక్కని శాంత శృంగారముల పాకముపట్టి హాస్యమను సుగంధద్రవ్యముజేర్చి, పాఠక హృదయరసనలువ్విళ్ళూరు సమయౌచిత్యమునెఱింగి సరి పాకమున రౌద్రవీరముల జేర్చి భయానకముతో కలియద్రిప్పి భీభత్సము సృష్టించి వ్యాసుని హృదయము నావిష్కరించినాడు. ఇట్టి రసపుష్టిచేతనే 'నన్నయ చెప్పినట్లు కవివృషభులు మహాకావ్యమని చెప్పికొనుటకు తిక్కన యీ ఘట్టమును నిర్మించి నన్నయగౌరవమును కాపాడినాడు' అని ప్రశంసించినాడు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ.

అప్పటికిని యవి తనయిష్టంపు చెలి నిష్ఠురోక్తులుగనే భావించు సింహబలు నెమ్మనముద్వేగము నొందునట్లు నిశ్శబ్దరోషాట్టహాసమొనరించి యొక్కుమ్మడి నతని తలవట్టి వంచినాడు దుర్వారోద్యమబాహువిక్రమరసాస్తోకప్రతాపస్ఫురద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుడగు భీముడు. అతడును దీటగు చేవగలవాడగుట నెదుటిశక్తి ననుమానింపక బెట్టదల్చికొని కోపాటోపదీప్తాంగుడై మున్ను సైరంధ్రి తనపతియని చెప్పిన గీర్వాణాకృతుడితడేయని తలంచి పోరదలకొనెను. పవననందను బాహులబట్టి యవనిబడవైచి లేచి నిలబడినాడా బలగర్వితుడు. అంత భీముండును దెబ్బదిన్న కోడెత్రాచువలె లేచి ప్రకోప రభసాతిశయంబు నంగంబులుబొంగ గీచకుబట్ట నతండును బలోన్మాదంబున భీముని బట్టెను. ఇరువురును సమానులై కొంతతడవు భయంకరమైన మల్లయుద్ధంబు సలిపిరి. అందువారి మానసములు ప్రవర్తిలిన విధము నిట్లుటంకించినాడు కవి. ✦ ... (సశేషం)





ఓం పతంజలయే నమః

యోగసూత్రాలు

(24) – చింతగుంట సుబ్బారావు, చీరాల.

అధ్యాయం 2 – యోగము – యోగసాధన

సూత్రం 10 :– తే ప్రతిప్రసవహేయాః సూక్ష్మాః ।

These obstacles or Klesas have a dormant form, a fully developed form and the intermediary forms. When they are in the elementary state of dormancy, they can be made incapable of germination by reducing the mind to its prime cause, that is, making the mind disappear altogether because it no longer has any duties to do for the accomplished Yogi. But first they have to be brought down to dormancy from their fully activated state.

ఈ క్లేశాలన్నిటికీ సూక్ష్మదశనుండి స్థూలదశవరకు, నిద్రాణస్థితి నుండి పూర్ణచైతన్యస్థితివరకు, మధ్యలో గల విభిన్న స్థితులతో చాల దశలున్నాయి. సూక్ష్మదశ లేక నిద్రాణస్థితిలో ఉన్నప్పుడు ఈ క్లేశాలను నిర్బీజం చేయవచ్చు. అంటే, ఇవి మనోగతాలు కనుక, పూర్ణయోగికింక మనస్సుతో పనిలేదు కనుక, మనస్సు అన్నది దానంతట అదే అంతర్ధానం అయిపోతుంది. కాని, ఈ క్రమపరిణామంలో మొదట ఈ క్లేశాలను వాని సూక్ష్మనిద్రాణస్థితికి పూర్ణచైతన్యస్థితినుండి చేర్చవలెను కదా!

సూత్రం 11 :– ధ్యానహేయాస్తద్వృత్తయః ।

The behavioral operations of these obstacles which are the mind's conduct can be thrown out by mediatation. Patanjali seems to suggest that **Kriya-Yoga** or the Yoga of action, explained earlier together with meditation will gradually reduce these obstacles until they become subtle or Sookshma. And then through **dhyaana-yoga** or meditation without the help of Kriya-yoga, they can be totally destroyed which implies destruction of the yogi's mind or manas.

Both the aphorisms 10 and 11 together, read with the earlier ones, suggest that the Samskaaras or Vaasanas persist in a subtle form until the mind or manas itself vanishes, when they too die away with the mind. The process is likened by Swami Prabhavananda of Sri Ramakrishna Math to washing a dirty cloth, first, loosening the dirt with soap and, then, washing it clean with water, where 'soap-wash' stands for Kriyaa-yoga and water, the practice of meditation. It is not that, when soap is applied, no water is used but that more soap and first enough water while after the soap is washed away, water was profusely used to clean away particles of dirt still hanging on the cloth.

ఈ క్లేశాలు మనోవృత్తులు : వీనిని ధ్యానం ద్వారా శుద్ధిచేయవచ్చు. మొదటి దశలో క్రియాయోగంతో వానిని దుర్బలం చేసి సూక్ష్మస్థితికి చేర్చి, తరువాత ధ్యానయోగంతో ఆ సూక్ష్మస్థితిలోని క్లేశబీజాలను కూడా తొలగించవచ్చు. అంటే మొదటి దశలో క్రియాయోగ సంబంధమైన నియమ నిష్ఠలు, శాస్త్రాధ్యయనం, భగవదర్పణభావం, ఇవన్నీ అమిత శ్రద్ధతో చేస్తూ ధ్యానం చెయ్యవలెనని అర్థం. ఎట్లాగంటే, మురికిబట్టను శుభ్రంగా ఉతికే టప్పుడు మొదట సబ్బును బాగా పట్టించి, అందుకు అవసరమైనంత నీటినే వాడుతూ, ఆ తర్వాత నీటినెక్కువగా ఉపయోగించి సబ్బునూ దానితో మురికినీ కూడా వదిలించి, ఆపై శుభ్రమైన నీటితో ఇంకా బట్టనంటి ఉన్న సూక్ష్మాతిసూక్ష్మమైన మాలిన్యకణాలను కూడా పోగొట్టినట్లు, అంటారు శ్రీరామకృష్ణమఠానికి చెందిన స్వామి ప్రభవానంద. ఎందుకంటే, ఈ మాలిన్యరేణువులు కేవలం సబ్బుతో వదలవు. వీటివంటివే మనస్సును పట్టి ఉండే వాసనలు లేక సంస్కారాలు అనబడే దశలోని పంచక్లేశాలు. క్రియాయోగమూ ధ్యానయోగము రెండూ అవసరమే. మొదటి దశలో క్రియాయోగం హెచ్చుగాను, రెండవ దశలో ధ్యానయోగం అధికంగానూ ఉండాలి. అప్పుడు సాధకుని మనస్సు నశిస్తుంది. దానికి కర్తవ్యాలు లేవు కదా మరి! ఈ మాయ తప్పుకోగానే, ఆతడు పూర్ణయోగి అవుతాడు.

సూత్రం 12 :– క్లేశమూలః కర్మాశయో దృష్టాదృష్టజన్మవేదనీయః ।

These five obstacles are rooted in actions known and unknown of this birth or earlier ones. These actions of the past or present life do fructify into experience either in this life or in the lives to come : They take the form of Vaasanas or Samskaaras or tendencies and form the root of these Klesas or obstacles which are five in number as listed earlier : 1. avidya, 2. asmita, 3. raaga, 4. dvesha, and 5. abhinivesa (vide aphorism 3). It is therefore that the yogic aspirant must, by arduous austerities called kriyaa-yoga or the yoga of action and by persistant **dhyaana-yoga** or the yoga of meditation, destroy these roots, thereby destroying the mind.

3వ సూత్రంలో చెప్పబడిన పంచక్లేశాలు : 1. అవిద్య, 2. అస్మిత, 3. రాగ, 4. ద్వేష, 5. అభినివేశ, అన్నవి కర్మవలన యేర్పడేవి, కనుక వీని వ్రేళ్ళు కర్మలో సుప్రతిష్ఠితమై ఉంటాయి. ఇవి వాసన లేక సంస్కారరూపంలో ఉండి ఈ జన్మలోనో, రాబోయే జన్మలలోనో ఫలించి, జీవుడు అనుభవించక తీరనివవుతాయి. అందుచేతనే యోగసాధకుడు మొదట కర్మయోగం ద్వారాను, తర్వాత ధ్యానయోగం ద్వారాను క్షీణింపజేసి నశింపజేయవలసి ఉన్నది.

✦ ... (సశేషం)

శ్రీ బెల్లంకొండరామరాయ కవివిరచిత

దినకరవ్యాఖ్యాసహిత వేదాన్తముక్తావళ్యంతర్గతా

'ముండకోపనిషత్'

ఇటీవలె పుస్తకరూపం సంతరించుకొన్నది. వెల. రూ.400/-. కావలసినవారు సంప్రదించగలరు. 9440115411

శ్లో॥ తన్తూనుద్వమతి స్వయం గిళతి వా కావూర్ణనాభిర్యథా
భూతా న్యుత్సృజతి ప్రసంహరతి చ స్వస్మిన్ స్వయం బ్రహ్మ తత్ ।
భూమ్యామోషధివజ్జగద్భవతి చ బ్రహ్మణ్యథో లీయతే
దేహాన్మూర్ధజలోమవచ్చితిభృతో లోకోఽక్షరాజ్జాయతే ॥ 86

వ్యా. యయా బ్రహ్మ పశ్యతి సా పరా విద్యేత్యుక్తమ్. నైతద్యుక్తం బ్రహ్మణ ఏవాభావాదితి వాదినం ప్రతి కార్యలిఙ్గకానుమానేన బ్రహ్మ సాధయామ్యస్తీత్యాహ. **తన్తూనితి**. యథా కౌ భువి ఊర్ణనాభిర్లూతాకీటః స్వయమేవ తన్తూనుద్వమతి ఉత్పాదయతి గిళతి వా భక్షయతి చ. తత్తథా బ్రహ్మ స్వయమేవ. భూతాన్యుత్సృజతి స్వస్మిన్నేవ ప్రసంహరత్యుపసంహరతి. విలాపయతీత్యేతత్. అనేనోర్ణనాభిదృష్టాన్తేన భూతానాం నిమిత్తకారణముపాదానకారణం చ బ్రహ్మైవేతి సిద్ధమ్. యేన జగదస్తీత్యభ్యుపగతం తేనావశ్యం బ్రహ్మాస్తీత్యభ్యుపగన్తవ్యమ్. జగతో బ్రహ్మకార్యత్వాదితిభావః నను బ్రహ్మ జగతో నోపాదానం తదభిన్నత్వాత్స్వరూపవదితి శఙ్కాయాం తదనుమానస్య వ్యభిచారం దర్శయితుం దృష్టాన్తాన్తరమాహ. భూమ్యామితి – భూమ్యామోషధివజ్జగద్బ్రహ్మణి భవతి. అథో తతః భూమ్యామోషధివజ్జగద్బ్రహ్మణి లీయతే. నను జగన్న బ్రహ్మోపాదానకం తద్విలక్షణత్వాత్. యద్యద్విలక్షణం తత్తదుపాదానకం న భవతి యథా ఘటః తన్తువిలక్షణో న తన్తూపాదానక ఇతిశఙ్కాయాం తదనుమానస్య వ్యభిచారం దర్శయతి. చితిభృతః చేతనాద్దేహాత్. మూర్ధజలోమవత్. కేశవల్లోమవచ్చ. అక్షరాద్బ్రహ్మణస్సకాశాల్లోకో జాయతే. తస్మాదస్తి జగతో నిమిత్తముపాదానం చ బ్రహ్మ నిర్నిమిత్తత్వానుపపత్తేర్జగత ఇత్యభిప్రాయః. 86 ✦ ... (సశేషం)

ఉమాకల్యాణము

మహాకవిశ్రీకాలిదాసవిరచిత

కుమారసమ్భవమహాకావ్యమ్

వ్యాఖ్యాత - రామోరా.

అవతారిక :- నవదుకూలనివాసినీ గృహీతదర్పణా పార్వతీ భూయిష్ఠం బభౌ -

శ్లో॥ క్షీరోదవేలేవ సఫేనపుఞ్జా
పర్యాప్తచన్ద్రేవ శరత్త్రియామా।
నవం నవక్షౌమనివాసినీ సా
భూయో బభౌ దర్పణమాదధానా॥ **26**

పదవిభాగము :- క్షీరోదవేలా, ఇవ, సఫేనపుఞ్జా, పర్యాప్తచన్ద్రా, ఇవ, శరత్త్రియామా, నవమ్, నవక్షౌమనివాసినీ, సా, భూయః, బభౌ, దర్పణమ్, ఆదధానా।

అన్వయక్రమము :- నవక్షౌమనివాసినీ నవం దర్పణమ్ ఆదధానా సా సఫేన పుంజా క్షీరోదవేలా ఇవ, పర్యాప్తచన్ద్రా శరత్త్రియామా ఇవ (చ) భూయః బభౌ।

ప్రతిపదార్థము :- నవక్షౌమనివాసినీ - నూతనమైన తెల్లని పట్టుబట్టలను ధరించినదియు, నవమ్ - క్రొత్తదైన, దర్పణమ్ ఆదధానా - అద్దమును పట్టుకొని చూచుకొనుచున్నదియును అగు, సా - ఆ పార్వతీదేవి, సఫేనపుంజా - నురగతోకూడిన, క్షీరోదవేలా ఇవ - పాలసముద్రపు చెలియలి కట్టవలెను, పర్యాప్తచన్ద్రా - పూర్ణచంద్రుడు కల, శరత్త్రియామా ఇవ - శరత్కాలపురాత్రివలెను, భూయః - మిగుల, బభౌ - ప్రకాశించెను.

తాత్పర్యము :- నూతనమైన తెల్లని పట్టుబట్టలను ధరించినదియు, క్రొత్తదైన అద్దమును పట్టుకొని చూచుకొనుచున్నదియు అగు ఆ పార్వతీదేవి - 1) నురగతోకూడిన పాలసముద్రపు చెలియలి కట్టవలెను 2) పూర్ణచంద్రుడుగల శరత్కాలపు రాత్రివలెను - మిగుల ప్రకాశించెను.

విభక్తులు / క్రియలు :- 1. నవక్షౌమనివాసినీ - **...నివాసినీ**, ...నివాసిన్యౌ, ...నివాసిన్యః, ఈకారాన్తః స్త్రీలింగో నవక్షౌమనివాసినీశబ్దః, ప్ర.ఏ. 2. నవమ్ - **నవమ్**, నవే, నవాని అకారాన్త నపుంసకలింగో నవశబ్దః, ద్వి.ఏ. 3. దర్పణమ్ - **దర్పణమ్**, దర్పణే, దర్పణాని అకారాన్త నపుంసకలింగో

దర్పణశబ్దః, ద్వి.ఏ. 4. ఆదధానా – **ఆదధానా**, ఆదధానే, ఆదధానాః ఆకారాన్తః స్త్రీలింగ ఆదధానాశబ్దః, ప్ర.ఏ. 5. సా – **సా,** తే, తాః దకారాన్తః స్త్రీలింగస్తచ్ఛబ్దః, ప్ర.ఏ. 6. సఫేనపుంజా – **...పుంజా**, ...పుంజే, ...పుంజాః ఆకారాన్తః స్త్రీలింగస్సఫేనపుంజాశబ్దః, ప్ర.ఏ. 7. క్షీరోదవేలా – **...వేలా**, ...వేలే, ...వేలాః ఆకారాన్తః స్త్రీలింగః క్షీరోదవేలాశబ్దః, ప్ర.ఏ. 8. పర్యాప్తచన్ద్రా –**...చన్ద్రా**, ...చన్ద్రే, ...చన్ద్రాః ఆకారాన్తః స్త్రీలింగః పర్యాప్తచన్ద్రాశబ్దః, ప్ర.ఏ. 9. శరత్త్రియామా – **...త్రియామా**, ...త్రియామే, ...త్రియామాః ఆకారాన్తః స్త్రీలింగః శరత్త్రియామాశబ్దః, ప్ర.ఏ. 10. ఇవ – అవ్యయము. 11. భూయః – అవ్యయము 12. బభౌ – క్రియ – 'భా – దీప్తౌ' ఇతి ధాతోర్లిటి।

సంధులు :– 1. క్షీరోదవేలా + ఇవ – క్షీరోదవేలేవ – గుణసన్ధిః।
2. పర్యాప్తచన్ద్రా + ఇవ – పర్యాప్తచన్ద్రేవ – గుణసన్ధిః।
3. భూయః + బభౌ – భూయో బభౌ – ఉత్వాదేశః।

సమాసాలు / విగ్రహవాక్యాలు :–

1. నవక్షౌమనివాసినీ – నవం చ తత్ క్షౌమం నవక్షౌమం, తద్ నివస్తే ఇతి నవక్షౌమనివాసినీ। 'వస – ఆచ్ఛాదనే' ఇతి ధాతోర్ణినిః కృద్వృత్తిః।
2. సఫేనపుఞ్జా – ఫేనానాం పుఞ్జః ఫేనపుఞ్జః తేన సహితా సఫేనపుంజా। తృ.త.।
3. క్షీరోదవేలా – క్షీరమ్ ఉదకం యస్య సః క్షీరోదః, క్షీరోదస్య వేలా క్షీరోదవేలా – ష.త.।
4. పర్యాప్తచన్ద్రా – పర్యాప్తః చన్ద్రః యస్యాం సా పర్యాప్తచన్ద్రా। బహువ్రీహిః।
5. శరత్త్రియామా – త్రయః యామాః యస్యాః సా త్రియామా, శరదః త్రియామా శరత్త్రియామా। ష.త.

పదవ్యుత్పత్తి – నిఘంటుప్రమాణాలు – కావ్యప్రయోగాలు :–

1. వేలా :– (స్త్రీ.) ఎ) వేల్యతే–నయేతి। వేల్ + 'గురోశ్చ హలః'। ఇత్యంతతష్టాప్। సముద్రజలవికారః వారివృద్ధిః।

బి) శ్లో।। ...వేలా వృద్ధిశ్చ వారిణః।। – Tide, Flow, current, also sea - coast, sea shore అని హలాయుధకోశము '2' నామములను పేర్కొన్నది.

సి) శ్లో।। సంరమ్భం మైథిలీహాసః క్షణసౌమ్యాం నినాయ తామ్।
నివాతస్తిమితాం **వేలాం** చన్ద్రోదయ ఇవోదధేః।
– ఇతి రఘువంశమహాకావ్యే – 12–36

...చంద్రోదయము సముద్రమును కల్లోలపరచునట్లు కలచివైచెను.

డి) '**వేలా** కాలే చ జలధేస్తీరనీవికారయోః' ఇతి విశ్వః।

అలంకారములు :– ఇట 'ఉపమాలంకార'మున్నదని చెప్పదగును.

క్రియాదర్శము :– బభౌ :– 'భా – దీప్తౌ' (ప్రకాశించుట), అకర్మకమ్, అనిట్, పరస్మైపదీ,అదాదయః (2) లిట్ – ప్రథమపురుషైకవచనాంతః।

బభౌ – బభతుః – బభుః ✦ ... (సశేషం)

నమక చమకాలు

తెలుగు టీక – డా. తాడేపల్లి పతంజలి, పటాన్‌చెరువు.

సప్తమానువాకం

01. నమో దుందుభ్యాయ చాహన్యాయ చ । नमो दुन्दुभ्याय चाहन्याय च ।

దుందుభ్యాయ చ = దుందుభి(భేరి)లో ఉన్నవాడును, ఆహన్యాయ చ = భేరిని మోగించుటకు ఉపకరించు పుల్ల రూపములో ఉన్నవాడును, (నాద స్వరూపుడును) అగు శివునకు, నమః = నమస్కారము, దుందుభిలో ఉన్నవాడును, భేరిని మోగించుటకు ఉపకరించు పుల్ల రూపములో ఉన్నవాడును, (నాద స్వరూపుడును) అగు శివునకు నమస్కారము.

విశేషాలు : శివునియొక్క సర్వ వ్యాపకత్వములో భాగంగా భేరిలో ఉన్నాడని ఇందులో చెప్పబడినది.

02. నమో ధృష్ణవే చ ప్రమృశాయ చ । नमो धृष्णवे च प्रमृशाय च ।

ధృష్ణవే చ = యుద్ధమున వెన్ను చూపి పారిపోని వాడును, ప్రమృశాయ చ = శత్రుసైన్యములో ఉన్న తికమకలు, చిక్కులు బాగా తెలిసినవాడును అగు శివునకు; నమః = నమస్కారము.

యుద్ధమున వెన్ను చూపి పారిపోని వాడును, శత్రుసైన్యములో ఉన్న తికమకలు, చిక్కులు బాగా తెలిసినవాడును అగు శివునకు నమస్కారము.

విశేషము : శివుడు మహావీరుడని సారాంశము.

03. నమో దూతాయ చ ప్రహితాయ చ । नमो दूताय च प्रहिताय च ।

దూతాయ చ = మన అభిప్రాయములను ఎదుటి వారికి అందజేయుటలోను, తిరిగి వారి అభిప్రాయము తెలుసుకొనుటలోనూ నేర్పరి యైన, ప్రహితాయ చ = శాస్త్రాదిజన్యపరిజ్ఞానముకల వ్యుత్పన్నుడయిన; నమః = శివునకు నమస్కారము;

భావము : మన అభిప్రాయములను ఎదుటివారికి అందజేయుటలోను, తిరిగి వారి అభిప్రాయము తెలుసుకొనుటలోనూ నేర్పరియై, శాస్త్రాదులు చదువుట వలన కలిగిన పరిజ్ఞానము కల పండితుడయిన శివునకు నమస్కారము.

విశేషాలు : 1.దూతలు ముగ్గురు.

1. నిసృష్టార్థుడు (స్వప్రజ్ఞచే స్వామి కార్యమును సాధించువాడు), 2. మితార్థుడు (మితభాషియై స్వామికార్యమును సాధించువాడు), 3. సందేశహారకుడు (స్వామి సందేశమును మాత్రమే తెలుపువాడు).

"నిసృష్టార్థో మితార్థశ్చ తథా సందేశహారకః కార్యప్రేష్యస్త్రిధా దూతః" (సాహిత్యదర్పణము3-47)

2. శివుని అన్ని వృత్తులలోనూ, అంతటా చూచు దృష్టితో ఈ దూతాది శబ్దములు ఆయనకు ప్రయోగింపబడినవని తెలుసుకోవాలి.

04. నమో నిషఙ్గిణే చేషుధిమతే చ । नमो निषंगिणे चेषुधिमते च ।

నిషఙ్గిణే చ = ఖడ్గము కలిగినవాడును, ఇషుధిమతే చ = అమ్ముల పొది కలిగినవాడును అగు శివునకు; నమః = నమస్కారము. ఖడ్గము కలిగినవాడును, అమ్ముల పొది కలిగిన వాడును అగు శివునకు నమస్కారము.

విశేషాలు : 1. స్వామి దుష్టులను సంహరించి శిష్టులను రక్షిస్తాడనే భావనను పెంపొందిస్తుంది ఈ మంత్రం. 2. ఇషుధి = అమ్ములపొది. వ్యు. ఇషవః ధీయంతే అత్ర - ఇషు + ధా + కిః. (క ృ.ప్ర.) 3. నిషఙ్గిణ్ పదానికి విలుకాడు అను అర్థము ప్రసిద్ధమైనప్పటికి, పునరుక్తి దోష పరిహారార్థం ఖడ్గము అను అర్థము స్వీకరింపబడినది. నిషఙ్గిణ్ : having a quiver (or sword?) Monier Willam's Sanskrit-English Dictionary, 2nd Ed. 1899

05. నమస్తీక్ష్ణేషవే చాయుధినే చ । नमस्तीक्ष्णेषवे चायुधिने च ।

తీక్ష్ణేషవే = వాడియైన బాణములు కలవాడును, ఆయుధినేచ = అనేకరకములైన ఆయుధములు కలవాడును అగు శివునకు; నమః = నమస్కారము.

వాడియైన బాణములు కలవాడును, అనేకరకములైన ఆయుధములు కలవాడును అగు శివునకు నమస్కారము

విశేషాలు : 1. వాడిగా, చురుకుగా ఉంటే తీక్ష్ణము. 2. ఇషు అంటే బాణము. ఇషువేగక్షయ న్యాయము అని ఒక న్యాయము. అంటే ప్రారంభములో మంచి వేగముతో వెళుతున్న బాణము క్రమక్రమముగా లక్ష్యస్థానము చేరు సమయములో వేగము తగ్గే పద్ధతి. (శబ్దార్థదీపిక ముసునూరి వేంకటశాస్త్రి1956)

06. నమస్స్వాయుధాయ చ సుధన్వనే చ । नमस्स्वायुधाय च सुधन्वने च ।

స్వాయుధాయ చ = చక్కటి ఆయుధములు కలవాడును; సుధన్వనే చ =

చక్కటి పినాకమనే ధనుస్సు కలవాడును అగు శివునకు; నమః = నమస్కారము.

చక్కటి ఆయుధములు కలవాడును, చక్కటి పినాకమనే ధనుస్సు కలవాఁడును అగు శివునకు నమస్కారము.

విశేషాలు : 1. "స్వాయుధ" అంటే well-armed, having good weapons (Monier Willam's Sanskrit-English Dictionary, 2nd Ed. 1899) అని నిఘంటువులలో అర్థం. 2. త్రిపురాలను దహించే సమయంలో శర జ్వాలల చేత స్వర్గాన్ని కప్పినది కాబట్టి శివుని విల్లుకు పినాకము అని పేరు వచ్చింది.

07. నమస్స్రృత్యాయ చ పథ్యాయ చ । नमस्सृत्याय च पथ्याय च ।

సృత్యాయ చ = ఒక్క మనిషి మాత్రమే నడువగలిగే త్రోవ కలవాడును; పథ్యాయ చ = రథము, అశ్వము మొదలైనవి నడువగల్గిన మార్గము కలిగినవాడగు శివునకు; నమః = నమస్కారము.

ఒక్క మనిషి మాత్రమే నడువగలిగే త్రోవ కలవాడును, రథము, అశ్వము మొదలైనవి నడువగల్గిన విశాల మార్గము కలిగిన వాడగు శివునకు నమస్కారము.

విశేషము : 1. సరంతి అనేన సృతిః దీనిచేత సంచరింతురు కనుక త్రోవకు సృతి అనిపేరు. 2. అన్ని మార్గాలు శివునికి సంబంధించివని భావము.

08. నమః కాట్యాయ చ నీప్యాయ చ । नमः काट्याय च नीप्याय च ।

కాట్యాయ చ = అల్పమైన జలము ప్రవహించు చోటు కటము. అక్కడ నీటిరూపములో ఉన్నవాడు, నీప్యాయ చ = కింది వైపుగ, అడ్డముగా ప్రవహించే నీటి రూపములో ఉన్న పరమశివునకు; నమః = నమస్కారము.

విశేషాలు : నీరు ఉన్న అన్ని చోట్ల పరమశివుడున్నాడు. కాని ఇలా కటమని, నీప్యమని విడివిడిగా చెప్పుటలో స్వామిని పదే పదే నుతించాలని మనం అర్థం చేసుకోవాలి.

09. నమస్సూద్యాయ చ సరస్యాయ చ । नमस्सूद्याय च सरस्याय च ।

సూద్యాయ చ = బురద ప్రదేశములో నీటి రూపములో ఉన్న; సరస్యాయ చ = సరస్సులలో నీటి రూపములో ఉన్న వాడును అగు శివునకు; నమః = నమస్కారము.

బురద ప్రదేశములో నీటి రూపములో ఉన్న, సరస్సులలో నీటి రూపములో ఉన్న వాడును అగు శివునకు నమస్కారము.

10. నమో నాద్యాయ చ వైశన్తాయ చ । नमो नाद्याय च वैशन्ताय च ।

నాద్యాయ చ = నదులలో నీటి రూపములో ఉన్న శివునకు; వైశన్తాయ చ = అల్పమైన పల్లపు ప్రాంతములలో నీటి రూపములో ఉన్న శివునకు; నమః = నమస్కారము.

నదులలో నీటి రూపములో ఉన్న శివునకు అల్పమైన పల్లపు ప్రాంతములలో నీటి రూపములో ఉన్న శివునకు నమస్కారము.

విశేషాలు : నదతీతి నదీ– మ్రోగుతుంది కాబట్టి నది అని పేరు. నీళ్లుగల చిన్నపల్లమును **వేశంతము** అంటారు. వేశంత శబ్దమునుండి వైశన్త పదము పుట్టినది. నీళ్లు ఉన్న అన్నిచోట్ల శివుడు ఉన్నాడని ఈ మంత్రం చెబుతోంది.

11. నమః కూప్యాయ చావట్యాయ చ । नमः कूप्याय चावट्याय च ।

కూప్యాయ చ = నూతిలో నీటి రూపములో ఉన్నవానికి; అవట్యాయ చ = బొక్కలలో నీటి రూపములో ఉన్న శివునకు; నమః = నమస్కారము.

నూతిలో నీటి రూపములో ఉన్నవానికి, బొక్కలలో నీటి రూపములో ఉన్న శివునకు, నమస్కారము.

12. నమో వర్ష్యాయ చావర్ష్యాయ చ । नमो वर्ष्याय चावर्ष्याय च ।

వర్ష్యాయ చ = వర్షపు నీటిలో ఉన్నవానికి; అవర్ష్యాయ చ = వర్షములేని కరువు పరిస్థితిలో ఉన్నవానికి; నమః = నమస్కారము.

వర్షపు నీటిలో ఉన్నవానికి, వర్షములేని కరువు పరిస్థితిలో ఉన్నవానికి (అనగా వర్షముగా కురవని సముద్ర జలములలో ఉన్నవానికి) నమస్కారము.

విశేషాలు : 1. వర్షమనే పదానికి తడుపునట్టిది అని అర్థం. (వర్షతీతి – వృషుసేచనే) 2. వర్షము కురిపించే వాడు ఆయనే. కురిపించనివాడు ఆయనే. మన కర్మలు వర్షాభావానికి కారణాలు. కనుక నీరు లేక అల్లల్లాడుతున్న ప్రజల క్షేమము కొరకు వర్షము కురిపించమని, దుష్కర్మలను నశింపచేయమని , అభిషేకాల స్వామిని అక్షరాభిషేకంలో బాధతో తడిసిన హృదయాలతో కోరుకొందాం.

13. నమో మేఘ్యాయ చ విద్యుత్యాయ చ । नमो मेघ्याय च विद्युत्याय च ।

మేఘ్యాయ చ = మేఘములలో ఉన్న శివునికి; విద్యుత్యాయ చ = మెరుపులలో ఉన్న శివునికి; నమః = నమస్కారము.

మేఘములలో ఉన్న శివునికి, మెరుపులలో ఉన్న శివునికి, నమస్కారము.

విశేషాలు : మేహతీతి మేఘః – తడుపునది కనుక మేఘమని పేరు. విశేషేణ ద్యోత త ఇతి విద్యుత్ – మిక్కిలి ప్రకాశిస్తుంది కనుక విద్యుత్తు అని మెరుపునకు పేరు.

అభ్యర్థన : పరమశివా! మా కళ్లల్లో నీళ్లు తప్పించి మేఘాలనుంచి మాకు నీటి చుక్క రావటం లేదయ్యా! తపించిపోతున్నాము. స్వామీ! హృదయ పూర్వకంగా ప్రార్థిస్తున్నాను. మేఘాలతో, మెరుపులతో ఈ భూమిని తడపవయ్యా! శతాధిక ప్రణామములు.

14. నమ ఈధ్రియాయ చాతప్యాయ చ । नम ईध्रियाय चातप्याय च ।

ఈధ్రియాయ చ = శరత్కాలములో ఉండే నిర్మలమయిన మేఘములో ఉండువానికి; ఆతప్యాయ చ = ఎండకాసేటప్పుడు వర్షించు వర్షములో ఉన్న శివునికి; నమః = నమస్కారము.

శరత్కాలములో ఉండే నిర్మలమయిన మేఘములో ఉండువానికి, ఎండ కాసేటప్పుడు వర్షించు వర్షములో ఉన్న శివునికి నమస్కారము.

15. నమో వాత్యాయ చ రేష్మియాయ చ । नमो वात्याय च रेष्मियाय च ।

వాత్యాయ చ = గాలితో గూడిన వానియందున్న వానికిని, రేష్మియాయ చ = ప్రళయ కాలమునందు వర్ష స్వరూపముగల శివునకు; నమః = నమస్కారము.

గాలిలోను, ప్రళయకాలములో వర్షస్వరూపములోను ఉండు శివునకు నమస్కారము.

16. నమో వాస్తవ్యాయ చ వాస్తుపాయ చ । नमो वास्तव्याय च वास्तुपाय च ।

వాస్తవ్యాయ చ = ఆవులు, గుఱ్ఱములు మొదలైన వాటియందు ఉన్నవానికి; వాస్తుపాయ చ = గృహ నిర్మాణమునకు సంబంధించిన భూమిని కాపాడువానికి; నమః = నమస్కారము.

ఆవులు, గుఱ్ఱములు మొదలైన వాటియందు ఉన్నవానికి, గృహ నిర్మాణమునకు సంబంధించిన భూమిని కాపాడువానికి నమస్కారము.

విశేషాలు : ఏడవ అనువాకమంతా ఒకటే మహామంత్రము. కాకపోతే మనకు అర్థ సౌలభ్యం కోసం ఇలా పదహారు మంత్ర భాగాలుగా పెద్దలు విభజించారు. ✦... (సశేషం)

నమఃశివాయై చ నమఃశివాయ

వేంకట పార్వతీశ్వరకవులు 2/3

(1881 - 1972; 1882 - 1955)

- ఆచార్య గోగినేని యోగప్రభావతీదేవి, ANU

వేంకట పార్వతీశ్వరుల సాహిత్య జీవితము

జంటకవుల తొలి రచన : జంటగా ఏర్పడిన వెనువెంటనే ఈ కవులు 'చిత్రకథా సుధాలహరి' అను ఆధునిక పద్యకావ్యమును రచించి వేంకట పార్వతీశ్వర కవులనే పేరుతో ప్రకటించారు. 'ది. 15-1-1906 వ తేదీన ఈ కావ్యమును ప్రారంభించి, ఆరు దినములలో నిర్విఘ్నముగా పరిసమాప్తి నొందించితి'మని కవులే ఈ కావ్యపీఠికలో చెప్పికొన్నారు. 389 పద్యములు కలిగిన కావ్యమును ఇంత తక్కువ వ్యవధిలో రచించుట వీరికే చెల్లింది.

ఈ గ్రంథము తొలుత కాకినాడలో వెలువడుచున్న 'సావిత్రి' యను మాసపత్రికలో కొంతవరకు ముద్రింపబడింది. తరువాత ఆ పత్రిక నిలిచిన కారణముగా ముద్రణ ఆగిపోయింది. వేంకటగిరిలోని 'కారొనేషన్ విద్యావినోదినీ లైబ్రరీ' వ్యవస్థాపకులైన శ్రీనివాసాచార్యులు గారి సహాయంచే ఈ కావ్యం 1910లో ముద్రింపబడింది.

ఈ కావ్యమే జంటకవులైన తరువాత తమ తొలిరచనగా వడ్డాది అప్పారావుగారితో జరిపిన పరిచయసంభాషణమున (సాహితీవాల్లభ్యము - మొదటిభాగము) బాలంత్రపు వేంకటరావుగారు పేర్కొన్నారు.

"శ్రీరమణీ విలాసమునఁజేసి జనించి సుబుద్ధి నొంది, శో
భారతిఁ జెట్టఁ బట్టి బహుభంగులఁదాననురూపయౌ విద
ర్భా రమణాత్మజాత పయి రాగరసంబున వెల్గిఁ గొల్పునా
శౌరి కృపా కటాక్షములు సారెకు మమ్ములఁబ్రోచుఁగావుతన్."

ఈ ప్రార్థనాపద్యముతో కావ్యము ప్రారంభింపబడింది.

ఈ పద్యమున కావ్యనాయిక 'అనురూప'నామధేయం సూచింపబడింది. ఈ కావ్యమునకు నాయికానామ వ్యవహారము కూడ ఉంది. వేశ్యల పొందు కూడదనెడి నీతి ప్రతిబింబింపబడిన సాంఘికితివృత్తం గలిగినదీకావ్యం.

ఈ కావ్యరచనానంతరం ఈ జంటకవులు పెక్కు ఖండకావ్యములు రచించి ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక, భారతి, ఆంధ్రభారతి పత్రికలలో ప్రకటించేవారు. ఆ రోజులలో వీరి రచనలు లేని పత్రికలు లేవని, పాఠకులు వీరి రచనలకై ఉత్కంఠతో ఎదురుచూచేవారని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు పేర్కొన్నారు.

ఆంధ్రప్రచారిణీ గ్రంథమాలతో బాంధవ్యము : తణుకు - నిడుదవోలు - పిఠాపురం - కాకినాడ - రాజమండ్రి - కార్యస్థానములుగా కలిగిన ఆంధ్రప్రచారిణీ గ్రంథమాలతో వేంకట పార్వతీశ్వర కవుల సాహిత్య జీవితము పెనవేసికొనిపోయింది.

వేంకట పార్వతీశ్వర కవులు పీఠికా పురాధీశులైన మహారాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దరు (1885-1964) వారి ఆశ్రయమున నుండియే తమ సాహితీ వ్యవసాయమును కొనసాగించిరి. కాని ఆస్థాన కవులు కాదు. శతాధిక గ్రంథకర్తలయిన ఈ జంటకవులు పార్వతీశకవి మరణపర్యంతము జంటగానే కవనమల్లారు.

మహోన్నత భావనా శక్తి కలిగిన కావ్యముల నొకపక్క రచించుచునే, మరియొక పక్క అతివేలమైన నవలా సాహిత్యమును, బాల వాఙ్మయమును సృష్టించి ఆంధ్ర భారతికి అమూల్యమైన సేవ చేశారు. వీరి రచనములన్నియు ఆంధ్రప్రచారిణీ గ్రంథ నిలయము నుండియే ప్రకటితములైనవి.

1911వ సంవత్సరంలో వేంకట పార్వతీశ్వర కవులు ఆంధ్రప్రచారిణీ గ్రంథమాలను తణుకులో కొవ్వూరు చంద్రారెడ్డిగారి సహాయంతో స్థాపించారు. ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల స్థాపనకు ఆర్థికంగా పీఠికా పురాధిపతులే తోడ్పడ్డారు. ఆంధ్ర ప్రచారిణీ నిలయం తణుకులో ప్రారంభమైన సంవత్సరకాలమునందే అయ్యగారి నారాయణమూర్తిగారి సంపాదకత్వాన ఆరు నవలలను ప్రకటించింది. వాటిలో మూడు మన జంటకవులవే. అవి మన జంటకవుల తొలి నవలయైన వసుమతీ వసంతము (స్వతంత్రము), రాజసింహ, సీతారామము (బంకించంద్రుని వంగనవలల కనువాదములు).

మరుసటి సంవత్సరం ఆంధ్రప్రచారిణీ గ్రంథ నిలయం నిడుదవోలునకు మారి కొవ్వూరి చంద్రారెడ్డిగారి ఆధిపత్యములోనికి వచ్చింది. సారస్వత ప్రియులైన చంద్రారెడ్డిగారు 1912లో నిడుదవోలులో ఏర్పాటు చేసిన సారస్వత, సంఘ సంస్కరణ, చారిత్రక పరిశోధకుల సభలలో శ్రీకృష్ణ దేవరాయలు నాయకుడుగా తాము రచించిన 'ప్రమదావనము' అను స్వతంత్రచారిత్రక నవలను వేంకట పార్వతీశ్వరులు చంద్రారెడ్డిగారికి కృతియిచ్చి వారి యెడ తమకు గల గౌరవ ప్రేమలను ప్రకటించుకొన్నారు. ఈ జంటకవులకు ఎచటను కవి పండితులతో వాదవివాదములు లేకపోవుట గమనింప దగినది.

ఆంధ్రప్రచారిణి ద్వారా గద్య పద్య కృతులను వెలువరించి ఆంధ్రశారదను సేవిస్తూనే వేంకట పార్వతీశ్వర కవులు బాలసాహిత్యమునకు తొలిదశలో బలమైన పునాదులు వేశారు. వీరు బాలలకు అత్యంత సుబోధకముగా ఉండే విధముగా 'బాలగీతావళి'ని రచించి అయిదు భాగములతో 1912లో నిడుదవోలులో ప్రచురించారు. మొదటి భాగము జానపద గేయములు, మిగిలిన నాలుగు భాగములు 2, 3, 4, 5 తరగతుల బాలలకుపకరించెడివి. రాష్ట్ర టెక్స్టుబుక్ కమిటీవారు ప్రాథమిక తరగతుల నుండి స్కూలు ఫైనల్, ఇంటర్మీడియట్, డిగ్రీ వరకు వీరి పుస్తకములను పాఠ్య గ్రంథములుగా నిర్ణయించి ప్రోత్సహించారు.

అప్పటికే పత్రికలలో ప్రకటింపబడిన తమ ఇరువది రెండు ఖండ కావ్యములను వీరు 'హారావళి' అను కావ్యరూపముగా 1913లో ఆంధ్రప్రచారిణీ గ్రంథ నిలయము వారిచే నిడుదవోలులో ప్రకటింపజేశారు.

బంకించంద్రుని నవలల అనువాదములైన 'ఇందిర' యను నవలలను 1913లోను,

'కృష్ణకాంతుని మరణ శాసనము'ను 1914లోను రచించి ప్రకటించారు.

1916వ సంవత్సరమున ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయముచే ముద్రిపంబడిన 'ప్రేమాంజలి' కావ్యము కేవలము బాలాంత్రపు వేంకటరావుగారి కర్తృత్వముతో ప్రచురింప బడటం గమనార్హం. జగత్కారణమైన విశుద్ధైకతత్త్వమును (నిరాకార బ్రహ్మమును) ఆశ్రయింతునని ప్రార్థించుట ఇందలి ప్రత్యేకత.

వంగభాషలో ఈశ్వరచంద్ర విద్యాసాగరుల వారిచే రచింపబడి, కన్నడమునకు పరివర్తన మొందిన నవలను 1917లో 'సీతారామ వనవాసము' అను పేరుతో అనువదించి ప్రకటించిరి. 1918లో చంద్రారెడ్డిగారు స్వర్గస్థులగుట చేత అద్దేపల్లి లక్ష్మణస్వామి గారి సహాయమును కోరి 1919 నాటికి ఆంధ్రప్రచారిణిని వేంకటపార్వతీశ్వరకవులు రాజమహేంద్రవరమునకు తరలించారు. ఈ జంట కవుల స్వతంత్ర సాంఘిక నవలయగు మాతృమందిరము రాజమండ్రిలో వెలువడిన నవలలో మొదటిది. వర్ణవ్యవస్థను సునిశితంగా విమర్శించిన రచన ఇది. ఈ నవలలో ప్రతి ప్రకరణమును తమ కవిత నొక దానితో ప్రారంభించిరి. వీరపూజ, ప్రతిజ్ఞా పాలనము, లక్షరూపాయలు, మాయావిని మున్నగు నవలలు 1920లో ప్రకటింపబడ్డాయి. లక్ష్మణస్వామిగారికి స్వీయసంస్థయైన సరస్వతీ గ్రంథమండలి బాధ్యతచే ఆంధ్రప్రచారిణి కార్యవేగము కుంటుపడింది.

ఈ సంస్థ కార్యకలాపము కొంతవరకు స్థంభించిన కారణముగా కొవ్వూరి బసివిరెడ్డి గారి కుమారుడైన సూర్యనారాయణ రెడ్డిగారు సామర్లకోటలో భీమేశ్వరస్వామి ఆలయములో పూజలు చేయిస్తున్నారు. ఆ సమయమున ఆయాలయమునకు చేరిన వేంకట పార్వతీశ్వరులకు, ఆ దివ్యశివాలయప్రాంగణములో శివస్తోత్ర ఘోషల మధ్య 'ఏకాంతసేవ' రచన చేయవలయుననే మహాసంకల్పము కలిగింది. నామరూపరహితుడైన భగవానుని గూర్చి కావ్యము రచింపవలెనని నామరూపములు కలిగిన భీమేశ్వరుని సన్నిధిలో సంకల్పము కలుగుటయే విచిత్రము. ఆయాలయములో ప్రాసాదమంటపముపై భక్తిపూర్వకమైన, ప్రకృతి పరమేశ్వరారాధన రూపమైన 'ఏకాంతసేవ'ను రచించారు. ఆ రోజులలోనే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి అక్కగారైన శ్రీమతి వింజమూరి వేంకట రత్నమ్మగారి 'అనసూయ' పత్రికలో ఏకాంతసేవలోని గీతములు కొన్ని ప్రకటింపబడ్డాయి. 1920-21 సంవత్సరములలో కొనసాగిన 'ఏకాంతసేవ' 1922లో కాకినాడ కళాశాల ఆచార్యులు పెద్దాడ రామస్వామిగారి ఆంగ్లపీఠికతోను, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి తెలుగు పీఠికతోను పుస్తకరూపముగా తొలిసారిగా ప్రకటించబడింది.

రావు వేంకట మహీపతి సూర్యారావు బహద్దరు వారికి 'మహారాజా' బిరుదము వచ్చినట్లు వినినంతనే హర్షోత్కర్షమున 'మహారాజాభినందనము' అను కావ్యమును రచించి ఈ జంటకవులు మహారాజావారికి అంకితమిచ్చిరి. 1922లో సుజన రంజనీ ముద్రాక్షరశాలలో ముద్రితమైన ఈ కావ్యమునకు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తొలిపలుకు రాశారు.

పిఠాపురము యువరాజు గంగాధర రామరాయల పదమూడవ జన్మదినోత్సవ సందర్భమున వేంకట పార్వతీశ కవులు 'శ్రీరామరాజనీతి' అను కావ్యమును 1923లో రచించి

యువరాజావారికి అంకితమిచ్చారు.

1923లో ఆంధ్రప్రచారిణి క్లిష్ట పరిస్థితిలో పడి స్థానచలము చేయవలసి వచ్చింది. కాకినాడు సుజన రంజనీ ముద్రాక్షరశాల అధ్యక్షులైన పోలాప్రగడ బ్రహ్మానందరావు గారి సహాయముచే క్లిష్టపరిస్థితులు దాటి ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయము కాకినాడ చేరింది. కాకినాడ వచ్చిన పిదప వెలువడిన కాకినాడ నవలలు మరింత ప్రజామోదమును పొందాయి. పాంచకడీదేవ్ వంగభాషలో రచించిన అపరాధ పరిశోధక నవలల అనువాదములైన మాయావి, మనోరమ, రహస్యవిప్లవము, నీలాంబరి, జీవన్మృత రహస్యము, సంతాపకుడు, ఉన్మాదిని అను నవలలు, రవీంద్రనాథ టాగూరు నవలల అనువాదములైన దృఢప్రతిజ్ఞ, నౌకాభంగము, గోరా మున్నగు సాంఘిక నవలలు, బంకించంద్రుని నవలల అనువాదములైన విషవృక్షము, కపాలకుండల, శైవలిని అను నవలలు, యోగీంద్రనాథ ఛటోపాధ్యాయ రచించిన 'ఆరణ్యిక'కు బి. వేంకటాచార్యులుగారి కన్నడానువాదము ఆధారముగా చేసిన ఆంధ్రీకరణమును, ఇంకను శ్యామల, నీరద, శకుంతల, ప్రభావతి, వంగవిజేత, సాధన, మనోరమ, పరిమళ, ప్రణయకోపము మున్నగు నవలలు ఆంధ్ర ప్రజానీకపు మన్ననలందుకొన్నాయి.

1923లోనే కాకినాడలో ఈ కవులు పురాణగ్రంథమాలను స్థాపించి నడకుదుటి వీరరాజు పంతులుగారి సంపాదకత్వమున శివపురాణము, వామన పురాణము, బ్రహ్మ పురాణములను రచించి ప్రకటించారు. 1924లో ఈ జంటకవులు అప్పటివరకు రచించి పత్రికలలో ప్రకటించిన ఖండకావ్యము లన్నియు 'కావ్యకుసుమావళి' పేరుతో రెండు సంపుటములుగా టేకుమళ్ళ రాజగోపాలరావుగారి ఆంగ్లపీఠికతో ఆంధ్రప్రచారిణి వారిచే ప్రకటింపబడ్డాయి. పిఠాపురం యువరాజు గంగాధర రామరాయల వారికి పదునాలుగేండ్లు నిండిన తరుణమున ఈ 'కావ్యకుసుమావళి' అంకితమీయబడింది.

అప్పులు తీరిపోయి, మూడుపువ్వులు, ఆరు కాయలుగా ఉన్న ఆంధ్రప్రచారిణిని తీసికొని 1925 ఆగష్టులో ఈ కవులు పిఠాపురము చేరుకొన్నారు. 1927లో 'నీతికథావళి'ని రచించి, అయిదు భాగములుగా ప్రకటించారు. వీరు రచించిన 'బాల సూర్య వాచకములు' ప్రాథమిక పాఠశాలలో పాఠ్యగ్రంథములుగా ఆమోదమును పొందినవి. ఇంకను గ్రంథములను ప్రకటించుచు వేంకట పార్వతీశ్వర కవులు ఏడెనిమిది సంవత్సరములు పిఠాపురములో గడిపారు. 1930లో 'తిరుగుడు పెండ్లి', 1934లో 'నీకే జయము' మున్నగు నవలలు ప్రకటింపబడ్డాయి. దూరభారతీయ ప్రాంతములందున్న పాఠకులను కూడ వీరి రచనలు అలరిస్తూండేవి. 1935లో యువరాజు గంగాధర రామారావు గారి వివాహ సమయమున ఈ జంటకవులు 'బృందావనము' అను 346 పద్యములు కలిగిన ఆధునిక ప్రబంధమును రచించి యువరాజా వారికి కృతియిచ్చారు. ఇది పద్యచ్ఛందములతో నడిచిన, భక్తి సంభరితకావ్యము.

బాలాంత్రపు వేంకటరావుగారి అన్నకుమారుడైన బాలాంత్రపు సత్యనారాయణ రావు గారిని ఆంధ్ర ప్రచారిణికి ఒక వాటాదారుగా చేర్చి కాకినాడకు కార్యస్థానమును మార్చి 1936లో వేంకట పార్వతీశ్వరులు ఈ గ్రంథ నిలయమునకు రజతోత్సవము చేసికొన్నారు. ఆ

రజతోత్సవమునకు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు అధ్యక్షత వహించిరి. కాంగ్రెస్ వాదులయిన రాజకీయ నాయకుల సహకారముచే ఈ గ్రంథనిలయము పదిమంది సభ్యులతో బోర్డ్ఆఫ్ డైరెక్టర్సుతో ఆంధ్రప్రచారిణీ లిమిటెడ్ కంపెనీగా మారింది. దానికి మేనేజింగ్ డైరెక్టరయిన బాలాంత్రపు సత్యనారాయణరావుగారు, ఆ తరువాత నాలుగేళ్ళకు స్వాతంత్ర్యోద్యమ సంరంభముతో కాంగ్రెస్ ఆదేశానుసారము సత్యాగ్రహము చేసి శ్రీకృష్ణజన్మస్థానమునకు వెళ్ళుటతో ఆంధ్ర ప్రచారిణి కార్యనిర్వహణము కొంతకాలము కుంటుపడింది. ఆ కాలములో వేంకట పార్వతీశ్వరులు ఆంధ్రప్రచారిణి నుండి తప్పుకొని పిఠాపురము నందుండి పిఠాపురము యువరాజు గంగాధర రామారావుగారి ప్రోత్సాహముచే వాల్మీకి రామాయణమును 'నిర్వచనాంధ్ర రామాయణము' గా రచించారు. ఈ కవులు సుందరకాండ రచించుచుండగా పార్వతీశముగారు స్వర్గస్థులు కాగా వేంకటరావుగారు వియోగము సహించలేక అనువాదము ప్రసక్తి మరల తలపెట్టలేదు. ఆగిపోయిన రామాయణానువాదమును పార్వతీశ కవి తనయులు ఓలేటి అచ్యుత రామచంద్రమూర్తిగారు చేపట్టి సమగ్రముగా రచించారు. ఈ నిర్వచనాంధ్ర రామాయణము తిరుమల తిరుపతి దేవస్థానము వారిచే 1987–88 సంవత్సరములో ముద్రింపబడింది.

1922లో ప్రథమ ముద్రణమునందిన 'ఏకాంతసేవ' 1938లో ద్వితీయ ముద్రణము నందింది. 1943లో ప్రకటితమైన వీరి 'భావసంకీర్తనము' ఆ తరువాత రచించిన సీసపద్యములతో దాదాపు నాలుగు వందలకు చేరి 2000 సంవత్సరములో బాలాంత్రపు నళినీ కాంతారావుగారిచే ప్రచురింపబడింది.

✦ ... (సశేషం)

గంగకు గౌరికిన్ సవతికయ్యము నిత్యము దీర్పలేక యా
గంగను శీర్షమందునిడి గౌరికి నర్ధశరీరమిచ్చి, మే
ల్బంగరు బొమ్మలౌ సతుల లాలనజేయుచు సౌఖ్యమొందు న
య్యంగజమర్దనుండు మిము నాదరమొప్పగ నేలుగావుతన్.

– 'కామకళ' నాటకము

లోకంబులు లోకేశులు

– డా. తాడేపల్లి పతంజలి

యోగవాసిష్ఠం ఉత్పత్తిప్రకరణం లో ఇలా చెప్పారు: "యత్నో యత్నేన కర్తవ్యో మోక్షార్థం యుక్తి పూర్వకమ్, యత్నయుక్తివిహీనస్య గోష్పదం దుస్తరం భవేత్" మోక్షము కొరకు యుక్తిపూర్వక ప్రయత్నములు చేయాలి. ప్రయత్నము, యుక్తిలేని వారికి గోవుపాదమంత స్థలముకూడా దాటడానికి అసాధ్యము."

పోతనగారి "లోకంబులు....." పద్యం చదువుతుంటే నాకు ఈ యోగవాసిష్ఠం గుర్తుకు వచ్చింది. గజేంద్రుని ప్రార్థనలో ప్రయత్నము కనిపిస్తుంది. గజేంద్రుడు విష్ణువుని కాపాడమని మొరపెట్టుకొనే సందర్భంలోని ఈ పద్య విశేషాలు కొన్నింటిని చూద్దాం.

లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగినఁ దుది నలోకం బగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డే కాకృతి వెలుఁగు నతని నే సేవింతున్. (8-75-క.)

సాధారణమైన ప్రతిపదార్థం ఇది

లోకేశులున్ = లోకాలను పరిపాలించే వారు; లోకస్థులు = లోకాలలో ఉండు వారు; తెగిన = నశించిన తరువాత; తుదిన్ = చివర; అలోకంబున్ అగు = కనబడనిదగు; పెంజీకటికిన్ = గాఢాంధకారానికి; అవ్వలన్ = అవతల; ఎవ్వండు = ఎవడు; ఏక = ఒకే; ఆకృతిన్ = ఆకారముతో; వెలుగున్ = ప్రకాశిస్తుంటాడో; అతనిన్ = అతనిని; ఏన్ = నేను; సేవింతున్ = కొలుస్తుంటాను.

లోకాలు, లోకాలను పరిపాలించేవారు, లోకాలలో ఉండేవారు అందరు నశించిన తరువాత; ఆ కారు చీకట్లకు ఆవతల ఒకే రూపంతో వెలిగే ఆ దేవుణ్ణి నేను సేవిస్తాను. దీనిలోపల ఉన్న విశేషార్థము ఇది.

లోకాలు మూడు. మెలకువ, కల, నిద్ర. లోకేశులు = పై ఆధారమైన చైతన్య పరిధులు మూడు. 1విశ్వుడు, 2.తైజసుడు , 3.ప్రాజ్ఞుడు.

1.విశ్వుడు : జాగ్రదావస్థలో అజ్ఞానంతో ఉండే జీవుడు నేను కాని శరీరాన్ని నాది నేను అనే భావాన్ని కలిగిస్తాడు. నావి కాని బాహ్యపదార్థాలను నావి అనే భావాలను కలిగిస్తాడు.

2.తైజసుడు : స్వప్నావస్థలో ప్రకాశించే తాను కాని శరీరమందు తాననే అహంకార భావాన్ని , తనవి కాని స్వప్నపదార్థాలందు నావి అనే మమకార భావాన్ని కల్గించేది తైజసుడు.

3.ప్రాజ్ఞుడు : సుషుప్తిలో ప్రాజ్ఞుడు జీవునకు అజ్ఞానంచేత కలిగే తాను, తనవి అనే భావాలు కలుగకుండా చేస్తాడు.

లోకస్థులు = మూడు– లోకాలను అనుభవించే ఇంద్రియాలు, అంతఃకరణము, అహంకారం. తెగినతుది = అంటే ఇవేవీ అందుకోలేని; అలోకంబగు పెంజీకటికవ్వల = కనబడని శూన్యావస్థను కూడా మించి; ఎవ్వండు = ఎవడైతే ఉన్నాడో; ఏకాకృతి వెలుగు = నిశ్చల మయిన స్థితిలో, ఈ మూడు లోకాలలో వ్యాపించిన ఏకాక ృతిలో వెలుగు.. అంటే.. కనిపిస్తాడో అటువంటి పరమాత్ముడైన శ్రీమహావిష్ణుమూర్తిని, నే సేవింతున్ = నేను ప్రార్థిస్తాను!

బ్రహ్మ మొదలయిన వారు కూడ సృష్టి పరిణామక్రియలో అంతమైపోతారు. ఆ వెనుక నున్నది గాఢాంధకారము. అది మాయతో కూడిన మూల ప్రకృతి. ఆ మూల ప్రకృతికి వెనుకగా ఒకే ఒక వెలుగు తాను వెలుగు చుండును. అట్టి జ్యోతిస్వరూపుడైన దేవుని నేను సేవింతును అన్నాడు గజేంద్రుడు. భగవంతునికి పుట్టుక, పాపం, రూపము, కర్మ, పేరు, గుణాలు ఉండవు.

అతడు ఈ లోకాలను స ృష్టిస్తాడు, నశింపచేస్తాడు. ఇదంతా తన మాయ. ఆ వెలుగు, మాటలకూ అందని పరిశుద్ధుడు, శాంతస్వరూపుడు, ఆనందానికి మూలభూతుడు, మోక్షాధిపతి అయిన ఆ ఈశ్వరుని నేను ప్రార్థిస్తున్నాను.

ఈ పద్యంలొ ఏకేశ్వరోపాసన ఉన్నదని పెద్దల భావన. ✦

"Whatsoever you do , do not do it as a duty , do it from your love ; do not do it as a burden , do it as a celebration."

OSHO

THE GREAT AMBITION

Every human being is love unborn, hence the misery, the anguish. The seed cannot be contented as the seed. It wants to become a tree, it wants to play with the wind, it wants to rise to the sky— it is ambitious!

Each human being is born with a great ambition-the ambition to flower in love, to bloom in love. So I see each human being as a possibility, as a potentiality, as a promise. Something that has not happened has yet to happen, and unless it happens there can be no contentment, no peace; there will be agony, suffering, misery. Only when you have come to a blooming where you feel that now you are fulfilled-now you have become that for which you were born, you have attained your destiny, now there is nothing left anymore—only when ambition completely disappears because it is fulfilled, is a person in bliss, never before.



భారతాంబికా!

– డా॥ వుయూరు లక్ష్మీనరసింహారావు, గుంటూరు.

ఉ॥ వందనమమ్మ వేదమయి వందనమమ్మ సుమంత్రభూషితా!
వందనమమ్మ నాదమయి వందనమమ్మ సురేశపూజితా!
వందనమమ్మ మోదమయి వందనమమ్మ నరేశపూజితా!
వందనమమ్మ పాదమయి వందనమమ్మ భారతాంబికా! 7

చ॥ పలుకులలో మరందము ప్రవాహములై పరుగెత్త భావపు
ష్పలలితమాలికల్ నిలిపి చక్కఁగ నీపదసేవ సేయకే
తలఁపెటు వోవఁ బోవు టటు తప్పు సుమీ! కవిజాతి కిమ్మహిన్;
గొలుచుట యొప్పు నిన్నుఁ బదగుంఫన మొప్పఁగ భారతాంబికా! 8

ఉ॥ కన్నయ వెన్నముద్ద కరకంజమునందు ధరించి ముద్దుగా
నన్నలమిన్నలున్ సహచరార్భకులున్ గనుచుండ నవ్వుచు
న్దిన్నమనోజ్ఞదృశ్యమును నీయొడియందునె చూతు నేను నా
హృన్నయనమ్ముతోడ జగదీశ్వరి! యీశ్వరి! భారతాంబికా! 9

చ॥ దశరథనందనాగ్రజుఁడు ధర్మశరీరుఁడు రాముఁ డాశ్రమ
స్థ శుభతపోవిశాలుఁడయి తమ్ముఁడు భార్యయుఁ దోడు నిల్వఁగా
శశివదనుండు నీయొడిని సల్పినసద్వ్రతదీక్షఁ జూతు నా
విశదమనస్సుటద్దమున వేదవిహారిణి! భారతాంబికా! 10

ఉ॥ వేయివచస్సులేల పృథివీవరపూజితదివ్యపాద! నా
రాయణుఁ డార్తరక్షణమహావ్రతుఁ డెత్తిన దివ్యరూపముల్
నీయొడియందె వెల్గుటను నిచ్చలుఁ గాంతురు యోగిభాస్కరుల్
మాయని భక్తిభావమున మాతృమతల్లిక! భారతాంబికా! 11

చ॥ నరసురమైత్రి దెబ్బతినె, జ్ఞానము తగ్గుమొగమ్మువట్టె, శ్రీ
కరమగు దేవభాష పరఖండముదారులు వట్టె, భారతీ
యఋషివరేణ్యు లిచ్చిన మహాబలదాయకవిద్య లక్కటా!
వరుసగఁ బోవుచుండె, నిది భారతదుర్గతి భారతాంబికా! 12

✦ ... (సశేషం)



Gold Nuggets
- Osho

ఆణిముత్యాలు

– సౌభాగ్య, హైదరాబాద్

అది సాధారణ స్థితిలో, అదుపు చేయదగిన స్థితిలో వుంటుంది.

పిచ్చివాడి మనసు అదుపుతప్పి వుంటుంది. విస్తరించి వుంటుంది. అంతులేని ఆలోచనల్తో నిండి వుంటుంది. కోరికలతో, కలలతో నిండి వుంటుంది.

కాబట్టి మనసు లేని తనం పిచ్చి అనడం సరికాదు. దాన్ని మార్చాలి. నీ మనసులో నిన్ను నువ్వు కోల్పోవడం పిచ్చితనం.

నువ్వు ఈ విషయం అర్థం చేసుకుంటే నిర్మలత్వాన్ని గురించి తెలుసుకోవచ్చు. మనసు నుంచి బయటకి వస్తే, నిశ్శబ్దంలోకి వస్తే అక్కడ ఎట్లాంటి ఆలోచన వుండదు. ఎట్లాంటి కోరిక నిన్ను ఇబ్బంది పెట్టదు. నువ్వొక నిశ్శబ్ద సరోవరమవుతావు. అక్కడ చిన్న అలకూడా వుండదు. అదే స్వచ్ఛత, నిర్మలత్వం. ✦ ✦ ✦

ప్రతి తరం తన జబ్బుల్ని తరువాతి తరానికి యిస్తూ సాగుతోంది.

యిట్లాంటి అనారోగ్యం పట్ల నా మనుషులు చైతన్యంతో, స్పృహతో వుండాలి. గతించిన తరం నుండి వచ్చే ఈ జబ్బులపట్ల జాగ్రత్తగా వుండాలి. ✦ ✦ ✦

సత్యం అంటురోగమయితే దానికి మందులేదు. ✦ ✦ ✦

చెవులు వున్నవాడు వింటాడు. విన్నంత మాత్రాన గ్రహిస్తాడని లేదు. గ్రహించడానికి చెవులని మించి ఏదో వుండాలి. ఒక రకమయిన నిశ్శబ్దం, నిర్మలత్వం, ప్రశాంతత అవసరం. చెవుల వెనుక హృదయం వుండాలి. మేధస్సు కాదు.

మేధస్సు లేక మనసు అన్నది దాదాపు నిన్ను చెవిటివాణ్ణి చేస్తుంది. నువ్వు చెవిటివాడివి కాకపోవచ్చు. కానీ నీ మనసు అంతులేకుండా మాట్లాడుతూ వుంటుంది. అది వాగుడుకాయ.

కొన్ని సమయాల్లో నీ గదిలో కూర్చుని కళ్ళు మూసుకుని చూడు. అప్పుడు నీ మనసులో ఏమేమి ఆలోచనలు వస్తాయో వాటిని రాసిపెట్టు. యథాతథంగా దేన్నీ వదిలిపెట్టకుండా రాసిపెట్టు. ఎందుకంటే వాటిని నువ్వు ఎవరికీ చూపించడం లేదు. వాటిని చదివి నువ్వు ఆశ్చర్యపోతావు. నువ్వు ప్రశాంతంగా వుండలేవు. నీ మనసు పిచ్చివాడిలాంటి మనసని తెలుసుకుని దిగ్భ్రమ చెందుతావు. అవి ఇతరులకు తెలీకుండా బండి నడుపుతున్నట్లు నీకు తెలిసివస్తుంది.

అంతులేకుండా మనసు చేసే ఈ శబ్దాలవల్ల ఎవరు ఏది మాట్లాడినా నువ్వు వింటావు కానీ వాటిని అర్థం చేసుకోలేవు. ✦ ✦ ✦ ✦ ... (సశేషం)



Book Review

- Reviewer - ***Chintagunta Subbarao***

Isavasya Upanishad for Students

by Dr. K. Aravinda Rao, Ex. D.G. P.

EMESCO PUBLICATIONS PAGES : 112

Price : Rs. 60-00

The book is available at : **Sahithi Prachuranalu, 29-13-53, Kaleswararao Road, Suraraopeta, Vijayawada-2. Phone No : 0866-2436643.**

The upanishads are part of the vedas. The oldest known literature of the world, dating back to five thousand years or more. They raise questions that have ever engaged the human thought from pre-historic times, probably ever since the dawn of civilization. These questions range from the reality known to the truth unperceived. Above all, they seek answers to questions about man himself. This is precisely what makes the upanishadic part of the Veda perennially relevant to human life and activity on various fronts. The Upanishads are essentially not about God as an entity beyond the visible universe but about the absolute reality as juxtaposed to the obvious personal reality coexistent in the same nature sphere. This is why the Upanishads term this Absolute as सत्, चित् and अनन्त्, or existence, consciousness and infinitude. Nor is these distinction made of man and woman. Always the Absolute is termed तत् (that) to indicate the asexual nature of this Truth.

Dr. Aravinda Rao is a scholarly student of Vendata who presents in this book a readable text of the Upanishad and also of Shankarabhashya, in Deva-nagari script followed by word meanings and easy flowing translation exposition of the meaning. As Dr. Aravinda Rao says, "The text is best useful for a student who has interest in Vendanta and who wishes to improve his knowledge of Sanskrit". What's more is that a reading of the book may induce new acquaintences of Indian philosophical studies to probe further and delve deep into ancient Indian lore. May be, amazed seekers with a blurred vision of the truth of age - old Indian wisdom, gain hereby a clearer picture of Indian

thoughts of old which forms the bed-rock of Indian ways of living and thinking and acting and reacting. After reading the book, one only wishes that Dr. Aravinda Rao exercise his mind and hand together in a similar direction to produce books of wisdom of the ilk manner. His labours may go a long way to encourage study of ancient texts and reap the wisdom embedded in them.

Isavasya discusses the question of ideal life for the humans. It touches upon Karma-yoga, Dhyana-yoga and Bhakti-yoga too but in the seed, while it speaks of the Absolute. It tells us to inculcate a dis-passionate view of the world which is but a projection (सृष्टि) of the Absolute. As an aid it prescribes right understanding and arduous cultivation of the right attitude to work, i.e., Karma-yoga, as the Gita would have it. This puts Man on the right royal road to transcend all limitations of Mundane Nature and ripen into realization when the dividual person of the phenomenal world sees himself / herself as but the individual one from the cosmic self or विश्वात्मन्. Thus Isavasya enlightens us on the two-fold vedic path of ज्ञान (Knowledge) and कर्म (action righeous) so that the ego-centric life on earth may be alchemised into a life of Universal love which is but God-consciousness unopposed to human awareness at all levels.

Having said so much, it must be noted that the ancient rishis did not seek to found a religion in the known sense of the word. They hoped to help mankind at large and man as one in reforming the vision of the visible universe as mere matters and its happenings as incoherant seperate entities purposeless of action and insensible of consequences.

రచయితలు తమ రచనలను 30 రోజులు ముందుగా ఈ దిగువ చిరునామాకు చేరునటుల పంపగలరు. 'ఆత్మజ్యోతి' మాసపత్రిక ప్రతినెల - 1వ తారీఖుకు విడుదలగును.

చిరునామా :

రావి మోహనరావు, M.Sc., M.A., (Sanskrit)

గౌరవసంపాదకులు 'ఆత్మజ్యోతి'

404, జంజనం కాంప్లెక్స్, 1 టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురు,

చీరాల - 523 155, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

Cell : 9440115411, E-mail : *ramorasans@gmail.com*

Website : www.samskruti.org/people/ramora/ramoraindex.html